


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 302 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ మంగళవారం 8 జూలై 2025 వెల : 5/-రూ॥
VOLUME : 11 ISSUE :302 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA TUE 8 JULY 2025 PRICE : 5/- RS
Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## టీడీపీలో కష్టపడేవారికే పదవులు..
# రాజీపడే ప్రసక్తే లేదు

- ఈ నెలాఖరులోగా ఏఎంసీ, దేవాలయ కమిటీల నియామకం పూర్తి చేస్తామన్న మంత్రి
- గత పొరపాట్లు పునరావృతం కానివ్వం.. పార్టీలో సంస్కరణలు తెస్తామని వెల్లడి
- ప్రతి 4 నెలలకోసారి కేడర్ ప్రజల్లోకి వెళ్లేలా ప్రత్యేక కార్యక్రమాలకు ప్రణాళిక
- త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఈ ఏడాదే నిరుద్యోగ భృతి ఇస్తామన్న లోకేశ్




పెన్ పవర్ డెస్క్:టీడీపీలో ఇకపై కష్టపడి పనిచేసే వారికే పదవులు దక్కుతాయని, ఈ విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించి గౌరవించడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆయన అన్నారు. నెల్లూరులోని అనిల్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో లోకేశ్ పాల్గొని కీలక ప్రసంగించారు.
గతంలో జరిగిన పొరపాట్లను పునరావృతం చేయబోమని, పార్టీలో ఏమైనా తప్పులు జరిగితే సరిదిద్దుకోవడానికి సిద్ధంగా ఉన్నామని లోకేశ్ తెలిపారు. కార్యకర్తల అభీష్టం మేరకు ఈ నెలాఖరులోగా నామినేటెడ్ పదవులైన వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ), దేవాలయ కమిటీలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు, ప్రతి నాలుగు నెలలకోసారి కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లేలా సరికొత్త కార్యక్రమాలను రూపొందిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై లోకేశ్ విమర్శలు గుప్పించారు. "సొంత కార్యకర్తలను కారు కింద తొక్కేసిన నేత జగన్. కనీసం వారిని పరామర్శించేందుకు కూడా వెళ్లలేదు. కానీ కందుకూరు దుర్ఘటన జరిగినప్పుడు చంద్రబాబు ప్రతి ఇంటికీ వెళ్లి క్షమాపణ చెప్పారు. మనకి, వాళ్లకి ఇదే తేడా" అని లోకేశ్ పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే ఆలోచించి, ప్రజలతో మమేకమై పనిచేయాలని ఆయన కేడర్‌కు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి కార్యకర్త ఇంటింటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

వివరాలు 2లో..

## నెల్లూరు రొట్టెల పండుగలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్...



- నెల్లూరులోని ప్రఖ్యాత బారాషహీద్ దర్గాను సందర్శించిన మంత్రి నారా లోకేశ్
- మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే రొట్టెల పండుగలో పాల్గొన్న మంత్రి
- దర్గాలోని 12 మంది అమరవీరుల సమాధులపై చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు
- స్వర్ణాల చెరువులో 'ఆరోగ్యం' రొట్టెను స్వీకరించిన లోకేశ్
- పండుగ నిర్వహణకు కూటమి ప్రభుత్వం రూ.10 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడి
- ఆర్థిక ఇబ్బందులున్నా ఈ వేడుకకు ప్రాధాన్యం ఇచ్చామని స్పష్టం

వివరాలు 2లో..

## భారత్ లో మైనారిటీలు బందీలుగా బతుకుతున్నారు



- మైనార్టీలకు అధిక ప్రయోజనాలంటూ కేంద్ర మంత్రి రిజిజు వ్యాఖ్యలు
- మేం బందీలుగా బతుకుతున్నామంటూ తీవ్రంగా స్పందించిన అసదుద్దీన్
- మూకదాడులు, బుల్డోజర్ల కూల్చివేతలపై ఘాటు ప్రశ్నలు
- ముస్లిం విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల రద్దును ప్రస్తావించిన ఒవైసీ
- రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నారని మంత్రికి గుర్తుచేసిన ఎంపీ
- వక్ఫ్ బోర్డు సవరణ చట్టంపై తీవ్ర విమర్శలు

వివరాలు 2లో..

## వల్లభనేని వంశీకి అస్వస్థత... ప్రైవేటు ఆసుపత్రికి తరలింపు



- వంశీకి శ్వాస సంబంధిత సమస్యలు
- విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించిన కుటుంబ సభ్యులు
- కోలుకునేంత వరకు వైద్యుల పర్యవేక్షణలో ఉండనున్నట్లు సమాచారం

పెన్ పవర్ డెస్క్: వైసీపీ నేత, గన్నవరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను కుటుంబ సభ్యులు విజయవాడలోని ఓ ప్రైవే ట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అంది స్తున్నారు.

వివరాలు 2లో..

## ఏపీలో సచివాలయాల్లోనే వారసత్వ ఆస్తుల రిజిస్ట్రేషన్.. త్వరలో అమలులోకి!

- తహసీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరగకుండానే భూమి రిజిస్ట్రేషన్!
- సీఎం చంద్రబాబు ఆదేశాలు.. సచివాలయాల్లో వారసత్వ భూముల రిజిస్ట్రేషన్‌కు గ్రీన్ సిగ్నల్
- రూ.10 లక్షల లోపు ఆస్తికి రూ.100, ఆపైతే రూ.1000 రుసుము
- రిజిస్ట్రేషన్‌తో పాటే ఆటోమేటిక్ మ్యుటేషన్, ఈ-పాస్‌బుక్ జారీ



వివరాలు 2లో..

## అసెంబ్లీకి రాలేని జగన్ ప్రతిపక్షానికి కూడా పనికిరారు

- జగన్ కేసుల విచారణను వేగవంతం చేయాలని దేవినేని ఉమా డిమాండ్
- బెయిల్ పై ఉంటూ చట్టబద్ధ సంస్థలను బెదిరిస్తున్నారని ఆరోపణ
- 11 సీట్లు వచ్చినా వైసీపీ నేతలు బుద్ధి మార్చుకోవడం లేదని మండిపాటు

పెన్ పవర్ డెస్క్:మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ పై టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అసెంబ్లీకి రాలేని జగన్ ఒక పిరికిపందని, ఆయన ప్రతిపక్ష నేతగా కూడా కొనసాగేందుకు అనర్హుడని ఎద్దేవా చేశారు. అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

వివరాలు 2లో..



## కేసులకు భయపడేది లేదు... జగన్ జెండా వదిలేది లేదు

- సత్తెనపల్లి పోలీసుల విచారణకు హాజరైన పేర్ని నాని
- అధికార పార్టీ ఒత్తిడితోనే తనపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపణ
- పోలీసులు అమాయకులు, బదిలీలకు భయపడుతున్నారని వెల్లడి
- రాష్ట్రంలో సైకో, నరకాసుర పాలన అంటూ తీవ్ర విమర్శలు

పెన్ పవర్ డెస్క్:"ఎన్ని కేసులు పెట్టినా, ఎన్నిసార్లు విచారణకు పిలిచినా భయపడేది లేదు. జగన్ జెండాను వదిలే ప్రసక్తే లేదు" అంటూ మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత పేర్ని నాని అధికార కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. తనపై నమోదైన కేసు

వివరాలు 2లో..



## పవన్ ను హీరోగా చూడటం కాపుల ఖర్మ



- రంగా, ముద్రగడలాంటి వారే కాపులకు నిజమైన హీరోలు అన్న జక్కంపూడి
- చంద్రబాబును సీఎం చేయడానికే పవన్ పార్టీ పెట్టారా? అని ప్రశ్న
- చంద్రబాబు ఎప్పుడు సీఎం అయినా మహిళలు, రైతులు మోసపోవడం ఖాయమన్న బొత్స

వివరాలు 2లో..

## టెక్నాలజీతో జీరో క్రైమ్ రేట్ సాధించాలి

- రియల్ టైమ్ గవర్నెన్స్ పై సీఎం చంద్రబాబు సమీక్ష
- క్రైమ్ హాట్ స్పాట్స్‌పై సీసీ కెమెరాలతో నిరంతర నిఘా
- ప్రభుత్వ రికార్డుల భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ
- పిడుగులు పడే ప్రదేశంలో ముందుగానే సైరన్ హెచ్చరికలు

పెన్ పవర్ డెస్క్:టెక్నాలజీని వినియోగించుకుని జీరో క్రైమ్ రేట్ స్టేట్ గా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. సాంకేతికత వినియోగించుకుని శాంతి భద్రతల పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్ ను ఓ మోడల్ రాష్ట్రంగా మార్చాలని స్పష్టం చేశారు. సోమవారం నాడు ఏపీ సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్సుపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీసీ కెమెరాలతో క్రైమ్ హాట్ స్పాట్లపై నిరంతరం

వివరాలు 2లో..



## ఈ విషయంలో కేంద్రం నిస్సహాయ స్థితిలో ఉంది



- జస్టిస్ యశ్వంత్ వర్మ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయలేకపోతున్నామన్న ఉపరాష్ట్రపతి
- మూడు దశాబ్దాల నాటి సుప్రీంకోర్టు తీర్పే ఇందుకు కారణమని వెల్లడి
- జడ్జి అధికారిక నివాసంలో భారీగా నగదు దొరకడం ఘోరమైన నేరమని వ్యాఖ్య
- న్యాయమూర్తులను కాపాడాలి కానీ, ఇలాంటి ఘటనలు ఆందోళనకరం అన్న ధన్‌ఖడ్
- కేరళ పర్యటనలో భాగంగా న్యాయ విద్యార్థులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు

పెన్ పవర్ డెస్క్:జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో భారీగా నగదు దొరికిన కేసులో ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేయలేని నిస్సహాయ స్థితిలో ఉందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మూడు దశాబ్దాల క్రితం సుప్రీంకోర్టు ఇచ్చిన ఓ తీర్పు కారణంగా న్యాయవ్యవస్థ అనుమతి లేకుండా న్యాయమూర్తిపై కేసు నమోదు చేయడానికి వీల్లేకుండా పోయిందని ఆయన అన్నారు.సోమవారం కేరళ పర్యటనలో

వివరాలు 2లో..

## దలైలామాకు 'భారతరత్న' ఇవ్వాలి... కేంద్రానికి అఖిలపక్ష ఎంపీల లేఖ

- దలైలామాకు 'భారతరత్న' ఇవ్వాలని ఎంపీల ఫోరమ్ తీర్మానం
- పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి
- వివిధ పార్టీల ఎంపీలతో కూడిన బృందం ఈ మేరకు సంతకాల సేకరణ ప్రారంభించింది
- టిబెట్ ఆధ్యాత్మిక వారసత్వంలో చైనా జోక్యాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ఎంపీలు
- టిబెటన్ శరణార్థుల నివాస ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని సూచన



పెన్ పవర్ డెస్క్:టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామాకు దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న'ను ప్రదానం చేయాలని పలు పార్టీలకు చెందిన ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగించేందుకు ఆయనకు అవకాశం కల్పించాలని

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ఉప ఎన్నిక పరీక్ష

తెలంగాణ కాంగ్రెస్ కు నిజంగా ఇది అగ్ని పరీక్ష. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో గెలుపు కాంగ్రెస్ కు అనివార్యంగా ఉండాలి. లేకపోతే పార్టీ నాయకత్వంపై అసంతృప్తులు మరింత పెరుగుతాయి. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక ఆరు నెలల్లోనే జరుగుతుంది. మాగంటి గోపీనాథ్ మరణంతో ఉప ఎన్నిక అనివార్యమయింది. అయితే గతంలో సిట్టింగ్ శాసనసభ్యుడు మరణిస్తే ఉప ఎన్నికలో ఏకగ్రీవం కావడం సంప్రదాయంగా వస్తుంది. కానీ కంటోన్మెంట్ ఉప ఎన్నిక తర్వాత అది తెలంగాణలో కనిపించడ లేదు. 2023లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఉప ఎన్నిక ఏకగ్రీవం కాలేదు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ లు పోటీ చేశాయి. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గణేశ్ విజయం సాధించారు.

**అన్ని పార్టీలూ...**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ మూడు పార్టీలూ పోటీ చేయడం ఖాయంగా కనిపిస్తుంది. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం కాబట్టి ఎటూ ఆ పార్టీ తమ అభ్యర్థిని బరిలో దింపుతుంది. అలాగే బీజేపీ కూడా ఖచ్చితంగా తన పార్టీ నుంచి అభ్యర్థిని పోటీకి దింపుతుంది. ఇక కాంగ్రెస్ కూడా అధికారంలో ఉండటంతో ఖచ్చితంగా తన అభ్యర్థిని గెలిపించుకునే దిశగా ప్రయత్నిస్తుంది. అయితే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సంపన్నులు ఎక్కువగా ఉన్నట్లే పేద, మధ్య తరగతి ప్రజలు కూడా ఎక్కువగా ఉన్నారు. అందుకే ఈ నియోజకవర్గంలో గెలుపోటములను అంచనా వేయలేం. ఎందుకంటే రాష్ట్రంలో పరిస్థితులను బట్టి ఈ నియోజకవర్గ ప్రజలు వెళ్లే అవకాశాలున్నాయి.

**మైనారిటీలూ ఎక్కువే...**

జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో మైనారిటీల సంఖ్య కూడా ఎక్కువగా ఉంది. ఇక్కడ మైనారిటీ వర్గాలే కాకుండా ఉన్నతస్థాయి వర్గాల ప్రజలు కూడా అధికంగానే ఉండటం, కమ్మ, రెడ్డి సామాజికవర్గాలతో పాటు మిగిలిన కులాల వారు కూడా అధికంగా ఉండటంతో కాంగ్రెస్ తమకుకు అనుకూలం ఉంటుందని భావిస్తున్నారు. మరొక వైపు ప్రస్తుతం ఎంఐఎం కాంగ్రెస్ కు పరోక్షంగా మిత్రపక్షంగా ఉంది. ఎంఐఎం సహకారం కనుక కాంగ్రెస్ నేరుగా తీసుకుంటే ఇక్కడ గెలుపు కాంగ్రెస్ కు నల్లేరు మీద నడకే అవుతుంది. అదే సమయంలో ఎంఐఎం కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకునే వీలుంది. ఎంఐఎం గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ కు మద్దతుదారుగా ఉండటంతో ఆ ఓట్లు బీఆర్ఎస్ కు పోలయ్యాయి. ఇప్పుడు కాంగ్రెస్ కు సపోర్టుగా ఉండటంతో ఏం జరుగుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

**పనితీరును బేరీజు వేసుకునేందుకు...**

బీజేపీని కూడా తక్కువగా అంచనా వేయడానికి లేదు. మోదీ ప్రభావంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కొంత పట్టు సంపాదించుకుంది. ఈ నేపథ్యంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఖచ్చితంగా జూబ్లీహిల్స్ గెలవాలని ఆదేశించి వెళ్లారు. అదే సమయంలో ప్రభుత్వ రెండేళ్ల పాలనకు ఇది రెఫరండంగా కూడా పార్టీ హైకమాండ్ చూసే అవకాశముంది. సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ పనితీరును జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలతో బేరీజు వేసుకునేందుకు పార్టీ అధినాయకత్వానికి ఒక అవకాశం దొరుకుతుంది. అందుకే రాష్ట్ర నాయకత్వానికి అంటే ఇటు పీసీసీ చీఫ్, అటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక ఒకసవాల్ అని చెప్పక తప్పదు.

## వల్లభనేని వంశీకి అస్వస్థత... ప్రైవేటు ఆసుపత్రికి తరలింపు

- మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వంశీకి శ్వాస తీసుకోవడంలో తీవ్రమైన ఇబ్బంది తలెత్తడంతో, కుటుంబ సభ్యులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే ఆసుపత్రిలో చేర్పించారు. సమాచారం అందుకున్న వెంటనే వైద్యులు ఆయనకు అత్యవసర సేవలు అందించారు.ప్రస్తుతం వల్లభనేని వంశీ ఆరోగ్యాన్ని ఓ ప్రత్యేక వైద్య బృందం నిశితంగా పర్యవేక్షిస్తోంది. ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిరంగానే ఉన్నప్పటికీ, మరికొన్ని రోజుల పాటు ఆసుపత్రిలోనే ఉంచి చికిత్స అందించాలని వైద్యులు సూచించినట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయిలో కోలుకునే వరకు ఆయన వైద్యుల పర్యవేక్షణలోనే ఉండనున్నారని సమాచారం.

## ఈ విషయంలో కేంద్రం నిస్సహాయ స్థితిలో ఉంది

- మొదటి పేజీ తరువాయి

భాగంగా కొచ్చిలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ (%చీఖూూూ%) విద్యార్థులు, అధ్యాపకులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జస్టిస్ వర్మ కేసును ప్రస్తావిస్తూ, ఓ హైకోర్టు న్యాయమూర్తి అధికారిక నివాసంలో అంత పెద్ద మొత్తంలో నగదు దొరకడం 'ఘోరమైన నేరం' అని అభివర్ణించారు. "ఆ డబ్బు ఎక్కడిది? దాని మూలాలేంటి? ఒక న్యాయమూర్తి ఇంటికి అది ఎలా చేరింది?" అని ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఈ ఘటనలో పలు చట్టపరమైన నిబంధనలను ఉల్లంఘించినట్లు స్పష్టంగా కనిపిస్తోందని, దీనిపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదవుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు."కేంద్ర ప్రభుత్వం చేతులు కట్టేసినట్లుగా ఉంది. 90వ దశకంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఓ తీర్పు కారణంగా మేం ఎఫ్ఐఆర్ నమోదు చేయలేకపోతున్నాం. నేను న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని, న్యాయమూర్తుల రక్షణను గట్టిగా సమర్థిస్తాను. అనవసరమైన వ్యాజ్యాల నుంచి వారిని కాపాడాలి. కానీ ఇలాంటి తీవ్రమైన ఘటనలు జరిగినప్పుడు మౌనంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది," అని ధన్‌ఖడ్ అన్నారు. మార్చి 14, 15 తేదీల మధ్య రాత్రి న్యాయవ్యవస్థకు ఒక చీకటి రాత్రి అని ఆయన వ్యాఖ్యానించారు.గతంలో జస్టిస్ వర్మ ఢిల్లీ నివాసంలో అగ్నిప్రమాదం జరిగినప్పుడు, బయట ఉన్న ఓ గదిలో కాలిపోయిన నోట్ల కట్టల సంచులు బయటపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సుప్రీంకోర్టు నియమించిన కమిటీ విచారణ జరుపుతోంది. రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానం తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు గతంలోనే పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు సూచించారు.

# నెల్లూరు రొట్టెల పండుగలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్...

రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ నెల్లూరులో జరిగిన ప్రఖ్యాత రొట్టెల పండుగలో పాల్గొన్నారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ వేడుకల కోసం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, కూటమి ప్రభుత్వం రూ.10 కోట్లు ఖర్చు చేసిందని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. సోమవారం నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గాను లోకేశ్ సందర్శించారు. అక్కడ ఆయనకు ముస్లిం మత పెద్దలు ఘనంగా స్వాగతం పలికి, గలఫ్‌తో సత్కరించారు. అనంతరం, మహ్మద్ ప్రవక్త అనుచరులైన 12 మంది అమరవీరుల చిహ్నాలపై ఆయన చాదర్‌ను కప్పి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఆ తర్వాత, పండుగలో ప్రధాన ఘట్టమైన రొట్టెల మార్పిడి కార్యక్రమంలో భాగంగా లోకేశ్ స్వర్ణాల చెరువు వద్దకు చేరుకున్నారు. అక్కడ భక్తులతో కలిసి 'ఆరోగ్యం' రొట్టెను స్వీకరించారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను, ఫొటోలను మంత్రి నారా లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. ప్రభుత్వం ఈ పండుగకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆయన తన ప్రకటన ద్వారా స్పష్టం చేశారు.

# ఏపీలో సచివాలయాల్లోనే వారసత్వ ఆస్తుల రిజిస్ట్రేషన్.. త్వరలో అమలులోకి!

ఆంధ్రప్రదేశ్‌లో వారసత్వంగా సంక్రమించిన భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం వారసులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా తమ గ్రామ/వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించనుంది. ఈ మేరకు ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జరిపిన సమీక్షా సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు.అంతేకాదు, రిజిస్ట్రేషన్ కింద నామమాత్రపు ఫీజు వసూలు చేయాలని నిర్ణయించారు. మార్కెట్ విలువ ప్రకారం ఆస్తి విలువ రూ.10 లక్షల లోపు ఉంటే కేవలం రూ.100, అంతకు మించి ఉంటే రూ.1000 స్టాంపు డ్యూటీగా చెల్లిస్తే సరిపోతుంది. యజమాని మరణ ధ్రువీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌తో పాటు వారసులందరూ ఏకాభిప్రాయంతో రాతపూర్వకంగా వస్తే, సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లు ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారు.గతంలో తహసీల్దార్ కార్యాలయాల్లో మ్యుటేషన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే తీవ్ర జాప్యం జరుగుతోందని, సిబ్బంది పదేపదే తిప్పిస్తున్నారని ప్రభుత్వానికి వేల సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో, ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయగానే భూ రికార్డుల్లో వివరాల నమోదు (మ్యుటేషన్) ఆటోమేటిక్‌గా జరిగిపోతుంది. దీంతో పాటు వారసులకు ఈ-పాస్‌బుక్ కూడా జారీ చేస్తారు.

ఈ విధానం అమలులోకి రావడానికి మరో రెండు, మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. రెవెన్యూ శాఖ మార్గదర్శకాలు విడుదల చేశాక, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ దీనిని అమలు చేస్తుంది. స్థానిక సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ పారదర్శకంగా జరగనుంది. కేవలం వారసత్వ ఆస్తులకు మాత్రమే ఈ విధానం వర్తిస్తుందని, ఇతర రిజిస్ట్రేషన్లు యథావిధిగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే జరుగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

# పవన్ ను హీరోగా చూడటం కాపుల ఖర్మ

జనసేన అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్‌పై వైసీపీ నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా జక్కంపూడి రాజా... పవన్‌ను లక్ష్యంగా చేసుకుని సంచలన వ్యాఖ్యలు చేశారు. సినిమాలో నాలుగు స్టెప్పులు వేసి మైక్ పట్టుకున్నంత మాత్రాన హీరో అయిపోరని, అలాంటి వ్యక్తిని హీరోగా చూడటం కాపుల ఖర్మ అని ఘాటుగా విమర్శించారు. పిఠాపురంలో వంగా గీత అధ్యక్షతన జరిగిన వైసీపీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.పవన్ కల్యాణ్ తనను తాను ముఖ్యమంత్రి చేసుకోవడానికి పార్టీ పెట్టారా లేక చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికి పెట్టారా అని కాపు యువత ప్రశ్నించుకోవాలని జక్కంపూడి రాజా అన్నారు. వంగవీటి మోహన రంగా, ముద్రగడ పద్మనాభం వంటి వారే కాపులకు నిజమైన హీరోలని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత పవన్ ఎన్నిసార్లు పిఠాపురం వచ్చారని, ఇక్కడి ప్రజల సమస్యలను పట్టించుకున్నారా అని నిలదీశారు. రాజకీయంగా జన్మనిచ్చిన పిఠాపురంలోనే పవన్ రాజకీయంగా అంతం అవుతారని జోస్యం చెప్పారు.

ఈ సమావేశంలో పాల్గొన్న వైసీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా మహిళలు, రైతులు మోసపోవడం ఖాయమని ఆరోపించారు. మాయమాటలు చెప్పేవారిని మోసగాళ్లు అనడంలో తప్పేలేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తామనడం దారుణమని అన్నారు. "బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ" అనే నినాదంతో ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.మాజీ మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీధికో రెండు బెల్టు షాపులు పెట్టారని, గంజాయి వ్యాపారంతో యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నారని విమర్శించారు. మరో నేత తోట నరసింహం మాట్లాడుతూ, పిఠాపురంలోనే కూటమిలో కుర్చీలు, జెండాలతో కొట్టుకునే స్థాయికి విభేదాలు వచ్చాయని ఎద్దేవా చేశారు.

# కేసులకు భయపడేది లేదు... జగన్ జెండా వదిలేది లేదు

విచారణలో భాగంగా సోమవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌కు హాజరైన పేర్ని నాని... విచారణ అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

**అధికార పార్టీ ఒత్తిడితోనే కేసులు..!**

ఖ"గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రెంటపాళ్ల గ్రామంలో పర్యటించినప్పుడు నేను కూడా ఆయన వెంట ఉన్నాను. కేవలం మూడు కార్లలో వెళ్లిన వంద మందిలో ఒకడినైన నాపై ఏకంగా 11 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇది కచ్చితంగా ప్రభుత్వ కక్ష సాధింపు చర్యల్లో భాగమే," అని పేర్ని నాని ఆరోపించారు. ఈ కేసులో సత్తెనపల్లి పోలీసుల తప్పేమీ లేదని, వారు కేవలం పైనుంచి వచ్చిన ఆదేశాలను పాటిస్తున్నారని అన్నారు. "అధికార పార్టీ నేతలు చెప్పినట్టు వినకపోతే బదిలీలు చేస్తామని, సస్పెండ్ చేస్తామని పోలీసులను భయపెడుతున్నారు. ఆ ఒత్తిడితోనే వారు అమాయకులపై కేసులు పెట్టాల్సి వస్తోంది" అని నాని వ్యాఖ్యానించారు.

**రాష్ట్రంలో సైకో, నరకాసుర పాలన!**

రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధమైన పాలన సాగడం లేదని, సైకో, నరకాసుర పాలన నడుస్తోందని పేర్ని నాని తీవ్రంగా ధ్వజమెత్తారు. "ప్రతిపక్ష నేతల గొంతు నొక్కాలనే దురుద్దేశంతోనే ఇలాంటి తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. నన్ను మహా అయితే బందరు నుంచి సత్తెనపల్లికి తిప్పుతారు, అంతకుమించి ఈ ప్రభుత్వం ఏమీ చేయలేదు. ఇలాంటి బెదిరింపులకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ భయపడరు" అని స్పష్టం చేశారు.

# టెక్నాలజీతో జీరో క్రైమ్ రేట్ సాధించాలి

- మొదటి పేజీ తరువాయి

నిఘా పెట్టి నేరాల నియంత్రణ చేయాలన్నారు. దీంతో పాటు ప్రైవేటు సీసీ కెమెరాల ఫుటేజి వ్యవహారంలోనూ నిబంధనలు మార్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. నేరాల నియంత్రణకు ప్రైవేటు కెమెరాలను కూడా వినియోగించుకునేలా చూడాలని స్పష్టం చేశారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడే వారి విషయంలో టెక్నాలజీని మరింతగా ఉపయోగించుకోవాలన్నారు. కొందరు తెలివిగా నేరాలు చేసి.. దాన్ని ప్రభుత్వంపై నెడుతున్నారని.. పోలీసులకు సహకరించని వ్యక్తులు, నేతల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు సూచించారు. ఇలాంటి వారి కోసం పబ్లిక్ సేఫ్టీ యాక్టు కింద వారి వద్ద నుంచి డేటాను తీసుకునేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఆయా నేరాలకు బాధ్యులుగా చేసే అంశంపైనా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ప్రజా భద్రత కోసం.. నేరాల కట్టడి కోసం.. దర్యాప్తు నిమిత్తం.. షాపింగ్ మాల్స్, థియేటర్లు, హొటళ్ల వద్ద ఉండే సీసీ కెమెరాల్లోని ఫుటేజీని సేకరించే వంటి వాటి విషయాల్లోనూ పబ్లిక్ సేఫ్టీ యాక్టును వర్తింప చేయాలన్నారు. మరోవైపు వివిధ రంగాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాల వినియోగం పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ పురోగతిపైనా అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**ప్రభుత్వ రికార్డుల భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ**

వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన రికార్డులు, డేటా భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీని వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రస్తుతం రెవెన్యూ రికార్డులను కూడా పూర్తి స్థాయి ప్రక్షాళన చేసి నూతన సాంకేతికతనే వినియోగించి భద్రంగా ఉండేలా చూడాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారం డేటా లేక్ ద్వారా సమన్వయం చేయాలని సీఎం స్పష్టం చేశారు. మరోవైపు 517 పౌరసేవల్ని వాట్సప్ గవర్నెన్సు ద్వారా అందిస్తున్నట్టు అధికారులు వివరించారు. అయితే అందిస్తున్న సేవలన్నీ యూజర్ ఫ్రెండ్లీగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

పిడుగులు పడే ప్రాంతాల్లో విలువైన ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పనిచేయాలని.. ముందస్తు హెచ్చరికల వ్యవస్థ సమర్ధంగా పనిచేసేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ముందుగానే ఆయా ప్రాంతాల్లో సైరన్ మోగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భూగర్భ జలాల పర్యవేక్షణకు ఫీజియో మీటర్లు, సెన్సార్లు త్వరితగతిన పునరుద్ధరించాలని అన్నారు.

రిజర్వాయర్లలో ప్రస్తుతం ఉన్న నీరెంత, ఎంతమేర ప్రవాహాలు వస్తున్నాయి. సముద్రంలోకి విడుదల చేస్తున్న నీరెంత లాంటి వివరాలు నమోదు చేయాలన్నారు. రిజర్వాయర్లలో వచ్చే ప్రవాహాలకు సంబంధించిన వివరాలను రియల్ టైమ్ లో పర్యవేక్షిస్తే వరద నిర్వహణ చేయొచ్చన్నారు. ప్రస్తుతం వస్తున్న ప్రవాహాలతో రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లనూ పూర్తి సామర్థ్యంతో నింపుతున్నట్టు సీఎం స్పష్టం చేశారు. మరోవైపు సముద్ర తీరప్రాంతాల్లో అలల ఉధృతి, చేపల వేటకు అవకాశం ఉన్న ప్రాంతాలపై ఇన్ కాయిస్ సంస్థ ఇచ్చే వివరాలను మత్స్యకారులకు, తీరప్రాంతాల్లోని వారికి అందేలా చూడాలని స్పష్టం చేశారు.

**ప్రజల అవసరాలకు అనుగుణంగా పథకాల రూపకల్పన**

ప్రతీ ప్రభుత్వ శాఖ తమ దగ్గర ఉన్న లబ్దిదారుల డేటా సహా ఇతర వివరాలను ఆర్టీజీఎస్ తో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వ్యత్యాసం ఉంటే తక్షణం ఆర్టీజీఎస్ కు తెలిపి డేటాను సవరించుకోవాలని స్పష్టం చేశారు. 2029 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అందుకు తగినట్టుగా సంక్షేమ పథకాల రూపకల్పన జరగాలని ముఖ్యమంత్రి అన్నారు. పేదరిక నిర్మూలన కోసం చివరి వ్యక్తి వరకూ చేయూత అందించటమే కూటమి ప్రభుత్వ ఆలోచన అని అన్నారు. పీ4లో భాగంగా బంగారు కుటుంబం- మార్గదర్శి అనుసంధాన ప్రక్రియ నిరంతరం కొనసాగాలని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నిర్వహించిన ఈ సమీక్షకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు

# అసెంబ్లీకి రాలేని జగన్ ప్రతిపక్షానికి కూడా పనికిరారు

- మొదటి పేజీ తరువాయి

బెయిల్‌పై బయట ఉన్న జగన్, చట్టాలను కాపాడే వ్యవస్థలనే బెదిరించేలా వ్యవహరించడం దారుణమని దేవినేని ఉమ అన్నారు. ప్రజాస్వామ్యం, న్యాయస్థానాలంటే ఆయనకు ఏమాత్రం గౌరవం లేదని విమర్శించారు. జగన్‌పై ఉన్న కేసుల విచారణను పోలీసు, న్యాయవ్యవస్థలు ఒక సవాలుగా స్వీకరించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు. వైఎస్ హయాంలో పెట్టిన కేసుల కోసం తాను ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నానని గుర్తుచేశారు.

గత ఐదేళ్లలో జగన్ చేయలేని అభివృద్ధిని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాది కాలంలోనే చేసి చూపించారని ఉమ స్పష్టం చేశారు. "ఒక్క ఛాన్స్" అని అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని నాశనం చేశారని, ఇప్పుడు మళ్లీ సింగయ్య శవం లాంటి ఘటనలతో కుయుక్తులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసినా వైసీపీ నేతల బుద్ధి మారడం లేదని, ఇంకా కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి కుతంత్రాలు మానుకోకపోతే ప్రజలే వైసీపీని తరిమి తరిమి కొడతారని దేవినేని ఉమ హెచ్చరించారు.

## టీడీపీలో కష్టపడేవారికే పదవులు.. రాజీపడే ప్రసక్తే లేదు

- మొదటి పేజీ తరువాయి

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నామని, త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ఈ ఏడాదిలోనే నిరుద్యోగ భృతి అందిస్తామని ప్రకటించారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులను భర్తీ చేస్తున్నామని, మిగిలిన ఉద్యోగాలను కూడా పద్ధతి ప్రకారం భర్తీ చేస్తామని లోకేశ్ భరోసా ఇచ్చారు.ఈ సమావేశంలో మంత్రులు పొంగూరు నారాయణ, ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, పలువురు ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# భారత్ లో మైనారిటీలు బందీలుగా బతుకుతున్నారు

దేశంలో మైనార్టీలు పౌరులుగా కాకుండా బందీలుగా బతుకుతున్నారంటూ ఏఐఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భారతదేశంలో మెజారిటీ వర్గాల కంటే మైనార్టీలకే ఎక్కువ ప్రయోజనాలు, రక్షణ లభిస్తోందంటూ కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలపై ఆయన సోమవారం ఘాటుగా స్పందించారు. రిజిజు వ్యాఖ్యలు వాస్తవాలను వక్రీకరించేలా ఉన్నాయని, ముస్లింలు ఎదుర్కొంటున్న వివక్షను ఆయన విస్మరించారని మండిపడ్డారు. ఎక్స్ వేదికగా అసదుద్దీన్ ఒవైసీ సుదీర్ఘ పోస్టులో తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. "భారతదేశంలో మైనార్టీలు రెండో తరగతి పౌరులుగా కూడా లేరు. మేమిప్పుడు బందీలం" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి చెబుతున్న ప్రయోజనాలు ఏమిటో చెప్పాలని ఒవైసీ నిలదీశారు. "ప్రతిరోజూ పాకిస్థానీ, బంగ్లాదేశీ, జిహాదీ అంటూ పిలిపించుకోవడం ప్రయోజనమా? మూకదాడుల్లో ప్రాణాలు కోల్పోవడమే రక్షణా? మా ఇళ్లు, మసీదులను చట్టవిరుద్ధంగా కూల్చివేయడాన్ని చూస్తూ ఉండటం ప్రత్యేక హక్కా? సాక్షాత్తు ప్రధానమంత్రి నుంచి విద్వేష ప్రసంగాలను ఎదుర్కోవడం గౌరవమా?" అని ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు.రిజిజు ఒక చక్రవర్తిలా కాకుండా, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిలా మాట్లాడాలని ఒవైసీ హితవు పలికారు. "మైనార్టీల హక్కులు ప్రాథమిక హక్కులే కానీ, ఎవరూ ఇస్తున్న భిక్ష కాదు" అని ఆయన స్పష్టం చేశారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని ప్రస్తావిస్తూ, హిందూ ఎండోమెంట్ బోర్డులలో ముస్లింలు సభ్యులుగా ఉండలేరని, కానీ వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతరులు సభ్యులుగా చేరి మెజారిటీ సాధించేలా చట్టం చేశారని విమర్శించారు.ప్రభుత్వ విధానాల వల్ల ముస్లిం విద్యార్థులు నష్టపోతున్నారని ఒవైసీ ఆరోపించారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్, ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను రద్దు చేయడాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే ఉన్నత విద్యలో ముస్లింల సంఖ్య గణనీయంగా పడిపోయిందని తెలిపారు. భారతీయ ముస్లింల పిల్లలు వారి తల్లిదండ్రుల కంటే అధ్వాన్న స్థితిలో ఉన్నారని, తరతరాల అభివృద్ధి తిరోగమనంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము మెజారిటీ వర్గాల కన్నా ఎక్కువ ఏమీ కోరడం లేదని, రాజ్యాంగం హామీ ఇచ్చిన సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని మాత్రమే డిమాండ్ చేస్తున్నామని ఒవైసీ స్పష్టం చేశారు.

## దలైలామాకు 'భారతరత్న' ఇవ్వాలి... కేంద్రానికి అఖిలపక్ష ఎంపీల లేఖ

- మొదటి పేజీ తరువాయి

డిమాండ్ చేశారు. వివిధ పార్టీల ఎంపీలతో కూడిన 'అఖిలపక్ష భారత పార్లమెంటరీ ఫోరమ్ ఫర్ టిబెట్' ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాలు చేసింది. బీజేడీ రాజ్యసభ ఎంపీ సుజీత్ కుమార్ నేతృత్వంలోని ఈ ఫోరమ్‌లో బీజేపీ, జేడీ(యూ) వంటి పార్టీల ఎంపీలు సభ్యులుగా ఉన్నారు. దలైలామాకు 'భారతరత్న' ఇవ్వాలన్న డిమాండ్‌కు మద్దతుగా సంతకాల

సేకరణ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించినట్లు ఫోరమ్ కన్వీనర్ సుజీత్ కుమార్ తెలిపారు.టిబెట్ ఆధ్యాత్మిక వారసత్వ ఎంపిక విషయంలో చైనా జోక్యాన్ని ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకించారు. 14వ దలైలామా వారసుడిని ఎన్నుకునే హక్కు కేవలం టిబెట్ ప్రజలకు మాత్రమే ఉందని వారు స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు భారీ ర్యాలీ నిర్వహించాలని అరుణాచల్ ప్రదేశ్ ఎంపీ తాపిర్ గావో సూచించారు.ఇటీవల అమెరికా కాంగ్రెస్ టిబెట్‌కు అనుకూలంగా ఆమోదించిన బిల్లును ఈ ఫోరమ్ ప్రశంసించింది. మన దేశ పార్లమెంటులోనూ అలాంటి చట్టాన్ని తీసుకురావాలని సభ్యులు అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, దేశంలోని టిబెటన్ శరణార్థుల నివాస ప్రాంతాలను సందర్శించి, వారికి రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించేలా స్థానిక యంత్రాంగాలపై ఒత్తిడి తీసుకురావాలని ఎంపీలకు సూచించారు. ఈ పరిణామం చైనాతో దౌత్యపరమైన సంబంధాల విషయంలో భారత్‌కు మరోసారి సవాలుగా మారే అవకాశం ఉంది.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూ॥ గోదావరి । ప॥ గోదావరి । ఏలూరు

## కూలిన వంతెనకు తాత్కాలిక మరమ్మతులకు చర్యలు

### పరిశీలించిన డిఇ పోచారవు, నీటి సంఘం అధ్యక్షులు గారపాటి



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 07 :** మురికి నీటి కాలువపై ఉన్న వంతెన కూలిన స్థానంలో తాత్కాలికంగా ద్విచక్ర వాహనాల వంటి వాటిపై రైతుల రాకపోకలకు అడ్డంకి లేకుండా ఐరన్ వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు డ్రైన్స్ డిఈ పోచారావు అన్నారు. మండలంలోని పినపళ్ళ నుండి మండపేట వెళ్ళు మురికి నీటి కాలువపై ఉన్న వంతెన కూలడంతో సోమవారం ఆయన డ్రైన్స్ జేఈ సుబ్రహ్మణ్యం, నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడు ఈ కాలువపై నూతన వంతెన నిర్మాణం సాధ్యం కాదన్నారు. ప్రస్తుతం వర్షాల కారణంగా వంతెన శిథిలమై కూలిపోయిందన్నారు. వచ్చే వేసవిలో పంట కాలువలకు నీటిని నిలుపుదల చేసిన సమయంలో యుద్ధ ప్రాతిపదికన ఈ వంతెన నిర్మాణం పూర్తి చేసేందుకు ఉన్నత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి తీసుకు వెళ్లినట్లు దిగి పోచారావు తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి రైతులకు ఎటువంటి అడ్డంకి లేకుండా వారి సాగుకు మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించినట్లు తెలిపారు.

## పేదరిక నిర్మూలన లక్ష్యంగా అధికారులు పని చేయాలి

### - కలెక్టర్ మహేష్ కుమార్ పిలుపు



**అమలాపురం, పెన్ పవర్, జూలై 7 :** ప్రభుత్వ దాతలు, ప్రజలు భాగస్వామ్యంతో సమాజంలోని పేదరిక నిర్మూలన లక్ష్యంగా నియోజకవర్గ ప్రత్యేక అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ పిలుపునిచ్చారు సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు నియోజకవర్గ ప్రత్యేక అధికారులు సచివాలయ సంక్షేమ, డిజిటల్ సహాయకులు తో సమావేశం నిర్వహించారు పి4 కార్యక్రమం విధి విధానాల పట్ల సమీక్షించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మందిని అట్టడుగును ఉన్న 20 శాతం మంది పేదలకు దత్తత తీసుకునే వారికి అండగా నిలిచి పేదరికం నుంచి పైకి తీసుకురావాలన్నదే పథక ఆశయమన్నారు. పి4 అనగా సంపన్న కుటుంబాలను (మార్గదర్శకులు) ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలతో (బంగారు కుటుంబం) తో అనుసంధానం చేయాలన్నారు. బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకుని వారి అవసరానికి నిధులు సమకూర్చాలన్నారు ఒక కుటుంబానికి దీర్ఘకాలిక మార్గదర్శకం మరియు ఆర్థిక సహాయం అందించి వారిని స్వయం సమృద్ధి వైపు నడి పించి విద్య, ఉపాధి ఆర్థిక స్థిరత్వంలో వారికి మార్గ నిర్దేశం చేయాలన్నారు..మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం కు శివ సుబ్రహ్మణ్యం అయ్యర్ దగ్గర శిష్యుడుగా చేరి శాస్త్రవేత్తగా రాష్ట్రపతి స్థాయికి ఎదిగారు అన్నారు. వ్యాపారవేత్తలు టాటా గ్రూపు అత్యంత ధనకులైన బిల్ గేట్స్ తదితరులు దాతృత్వ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రపంచవ్యాప్తంగా 200 మందికి పైగా ధనవంతులు తన సంప దలో కనీసం 50 శాతం పైగా సామాజిక సంక్షేమ కార్యక్ర మాలకు దానం చేశారన్నారు. ఇదే కోవలో ఏపీలో పేదరికం తగ్గించి పేద కుటుంబాలను సాధికారతవైపు నడిపించేం దుకు ప్రభుత్వం పి 4 విధానం సంపన్న వర్గాలు నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకుని ఆర్థికంగా బలోపేతం చేయడమే దీని ప్రధాని ఉద్దేశ్యమన్నారు జిల్లా వ్యాప్తంగా 64 వేల మంది బంగారు కుటుంబాల సర్వే ద్వారా గుర్తించినట్లు తెలిపారు.నియోజకవర్గ ప్రత్యేక అధికారులు సంబంధిత శాసనస భ్యుల సమన్వయంతో మార్గదర్శులను గుర్తిస్తూ నిర్దేశిత ప్రొఫా ర్మాలో జాబితాను నాలుగు రోజుల్లో సమర్పిం చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దేవర కొండ అఖిల సిపిఓ మురళీ కృష్ణ, నియోజవర్గ ప్రత్యేక అధికారులు గ్రామ సచివాలయ సంక్షేమ డిజిటల్ సహాయకులు పాల్గొన్నారు.





## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### - ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం పెన్ పవర్ జూలై 7 :** డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో అమలాపురం పార్ల మెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి స్థానిక ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తో కలిసి పాల్గొన్నారు. మార్కెట్ వీధిలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఏర్పడ్డ నష్టాలను సరిచేసుకుంటూ అభివృద్ధిని,సంక్షేమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ గేయమని ప్రజా సమస్యలను యాప్ ద్వారా నమోదు చేసి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేసుకుంటూ వస్తామని, రాష్ట్రాన్ని అభి వృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని , సంక్షేమాన్ని మరింతగా ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు.

## సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

### - ఎస్పి కృష్ణారావు



**అమలాపురం పెన్ పవర్ జూలై 7 :** ప్రజా సమస్యల పరిష్కారం కొరకు సోమవారం న జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్య క్రమం జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల యొక్క వ్రాతపూర్వక అర్జీలను జిల్లా ఎస్పీ స్వయంగా స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

వెంటనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలి అని, "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, భాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని, ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్పి అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై 24 మంది ఫిర్యాదీదారులు వారి సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### - పీజీఆర్ఎస్ వేదికపై 627 ఫిర్యాదులు స్వీకరణ



**కాకినాడ, పెన్ పవర్ జూలై 7 :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతీ వారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ మానీష్, డీఆర్వో జె. వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ. శ్రీనివాసు, సీపీవో పీ. త్రినాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.ఈ సంద ర్భంగా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారుల వద్దకు పంపించి, వాటిపై సత్వర పరిష్కారాలు, సంతృప్తికరమైన నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ వేదిక ద్వారా మొత్తం 627 అర్జీలు అందాయి. వీటిలో:బియ్యం కార్డు మంజూరు, పేర్ల మార్పులు చేర్పులు,పింఛన్లు, ఉపాధి అవకాశాలు,ఇళ్ల స్థలాలు, భూమి వివరాల ఆన్‌లైన్ నమోదు రీ సర్వే, ఆక్రమణలు తొలగింపుడ్రైన్లు, కాలువల పూడిక తొలగింపు, పారిశుద్ధ్యంతల్లికి వందనం ఆన్‌లైన్ సమస్యలు సంవందించిన సమస్యలపై ప్రజలు అర్జీలు వేశారు.

**కలెక్టర్ సూచనలు :** కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ, ప్రతి వారం పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని అన్నారు. పరిష్కరించిన దరఖాస్తులపై జిల్లా అధికారి ఆడిట్ చేసి నివేదికను రాష్ట్ర స్థాయికి పంపించాలన్నారు. ఒకే సమస్యపై పునరావృతంగా దరఖాస్తులు రాకుండా అధికారులు నాణ్యమైన పరిష్కారం ఇవ్వాలని సూచించారు. మీకోసం వెబ్‌సైట్, టోల్ ఫ్రీ సేవలు:ప్రజా ఫిర్యాదుల వేదికకు హాజరు కాలేక పోయిన అర్జీదారులు తమ ఫిర్యాదులను మీకోసం.ఏపీ.జివోవి.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అలాగే 1100 (డబుల్ వన్ డబల్ జీరో) టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి అర్జీల ప్రస్తుత స్థితిని తెలుసుకోవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో విభిన్న శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



## వరద ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తం

### జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్



**స్టాఫ్ రిపోర్టర్, గంగవరం/పాడేరు,పెన్ పవర్,జూలై 7:** గోదావరి, శబరి నదులు ప్రభావిత ప్రాంతాలలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం ఎటపాక, కూనవరం, చింతూరు, వి.ఆర్.పురం ఎంపిడిఓలు, తాహశీల్దారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. వరదలకు ఎటువంటి ప్రాణ నష్టం జరగ కూడదన్నారు. ఇటీవల వారం రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి,శబరి నదులు విస్తృతంగా ప్రవహిస్తున్నాయన్నారు. గోదావరికి ప్రథమ హెచ్చరిక శబరి నదికి మొదటి,రెండవ ప్రమాద హెచ్చరికలు జారీ చేసారని అన్నారు. తాహశీల్దారులు, ఎంపిడిఓలు ముందస్తు చర్యలు చేపట్టి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. వరదల పై ప్రజలను అప్రమత్తం చేయాలని స్పష్టం చేసారు.ఈ సమావేశంలో ఎంపిడిఓలు తాహశీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్‌తో నాటు సారా తయారీ సంచలనం

- నాటు సారా తయారీదారుల కొత్త టెక్నిక్-చెరకులకు బదులుగా గ్యాస్...
- దేవీపట్నంలో మద్యం తయారీకి మారిన మార్గాలు...
- పోలీసుల అవగాహనకు తూట్లు... మద్యం మాఫియాకు కొత్త మార్గాలు...



**దేవీపట్నం,పెన్ పవర్,జూలై7 :** అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలో నాటు సారా తయారీదారులు ఇప్పుడు కొత్త పంథా ఎంచుకున్నారు.వంట చెరకులకు బదులుగా గృహవాడిలో వినియోగించే గ్యాస్ సిలిండర్‌ను ఉపయోగించి నాటు సారా మద్యం తయారు చేస్తున్నారు.పంటకాలువల దగ్గర బెల్లపు ఊటలు గ్యాస్ సిలిండర్లు ఇటీవల మీడియా కంటపడటం సంచలనంగా మారింది.పోలీసులు,ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్వహించిన అవగాహన సదస్సులు,కేసులు,రిమాండ్లతో ఎలాంటి మార్పు కనిపించకపోగా..తయారీదారులు రోజుకో కొత్త మార్గాన్ని ఎంచుకుంటున్నారు. వంట చెరకు మంటకు పొయ్యి, శ్రమ తగ్గించాలనే ఉద్దేశ్యమో, పొగ వల్ల ఇబ్బంది అనిపించిందో తెలియదుగానీ,గ్యాస్ వినియోగంతో తయారీ సాగుతోంది.ఇక దేవీపట్నం మండలంలోని మారుమూల గ్రామాల్లో విచ్చలవిడిగా నాటు సారా తయారీ, బెల్ట్‌షాపుల నిర్వహణ సామాన్య ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది.ఆరోగ్య సమస్యలు,ఆర్థిక భారం ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నాయి.ఈ పరిస్థితుల్లో నాటు సారా తయారీ,విక్రయాలపై సంబంధిత అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.







## బాదంపూడిలో దొంగల బీభత్సం

### ఏఎన్ఎం ఇంట్లో రూ.లక్ష నగదు అపహరణ



**ఉంగుటూరు పెన్ పవర్, జులై 7 :** బాదంపూడి గ్రామంలో దొంగతనం కలకలం రేపింది. గ్రామానికి చెందిన ఆరోగ్య కార్యకర్త (ఏఎన్ఎం) ఉండ్రాజవరపు గంగ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం సాయంత్రం వరంగల్‌కు వెళ్లారు. ఆదివారం ఉదయం ఓ ఆన్‌లైన్ డెలివరీ బాయ్ ఇంటికి వెళ్లినప్పుడు తలుపు తెరిచి ఉండటం గమనించి, వెంటనే ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. గంగ కుటుంబ సభ్యులు హుటాహుటిన ఇంటికి వచ్చి చూసేసరికి, ఇంట్లో సామాన్లు చిందరవందరగా ఉండటంతో అవాక్కయ్యారు.



బాధితురాలు మంగ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారంఇంట్లో ఉన్న బీరువాలో మెడికల్ చదువుతున్న కుమార్తె ఫీజుల కోసం ఉంచిన రూ.లక్ష నగదు దొంగలు అపహరించారు. దొంగలు ఇంటి వెనుక భాగాన ఉన్న ద్వారం ద్వారా వచ్చి, తాళాలు పగలగొట్టి చోరీ చేసినట్లు అనుమానిస్తున్నారు. వేలిముద్ర నిపుణులు సంఘటనా స్థలానికి వచ్చి ఆధారాలు సేకరించారు. కేసును దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# రెండు గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం

గోదావరి తీరంలో 65-70 ఏళ్ల మహిళ మృతదేహం..
ప్రాజెక్ట్ కెనాల్ వద్ద 30-40 ఏళ్ల గుర్తుతెలియని పురుషుడి మృతదేహం
మృతదేహాలపై ఇప్పటికీ గుర్తింపు లేని పరిస్థితి..
సమాచారం ఉన్నవారు దేవీపట్నం పోలీసులను సంప్రదించాలి....
- దేవీపట్నం ఎస్సై షరీఫ్...




**దేవీపట్నం,పెన్ పవర్,జూలై7 :** దేవీపట్నం మండలంలో రెండు గుర్తు తెలియని మృతదేహాలు బయటపడినట్లు ఎస్సై కే.షరీఫ్ సోమవారం తెలిపారు.2023 ఏప్రిల్ 22న దేవీపట్నం మండలంలోని పోచమ్మగండి (పి.గొందూరు) వద్ద గోదావరి తీరాన సుమారు 65-70 సంవత్సరాల వయస్సు గల మహిళ మృతదేహం లభ్యమైందని పేర్కొన్నారు.ఆమె శరీరంపై తెలుపు రంగు చీర,జాకెట్ ఉన్నట్లు తెలిపారు.అలాగే 2023 సెప్టెంబర్ 24న అంగులూరు గ్రామ శివార్లలోని ప్రాజెక్ట్ కెనాల్ వద్ద సుమారు 30-40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని పురుషుడి మృతదేహం కనిపించిందని వెల్లడించారు.మృతదేహం నీటిలో మునిగి ఉబ్బిపోయిన స్థితిలో ఉన్నదన్నారు.ఇప్పటివరకు ఈ ఇద్దరి గుర్తింపు జరగలేదని,వీరికి సంబంధించిన బంధువులు గానీ,సమాచారం తెలిసిన వారు గానీ ఉన్నట్లయితే దేవీపట్నం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై తెలిపారు.వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు:9440900761,9440900763.

# అగ్ని ప్రమాద బాధితులకు రమణారావు సహాయం




**అమలాపురం పెన్ పవర్ జూలై 6 రూరల్ :** కామనగరువు పంచాయతీ జంగంపాలెంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమై బాధితులు కట్టుబట్టలతో మిగిలారు.అగ్ని ప్రమాదంలో వాసంశెట్టి పెద్దిరాజు,కుంచే శాంతమ్మ కుటుంబాలు సర్వం కోల్పోయి నిరాశ్రయులు అయ్యారు.విషయం తెలుసుకున్న అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సిపి సీనియర్ నాయకులు,గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుంచే రమణారావు అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు సాయం అందించారు.సోమవారం బాధిత కుటుంబాలకు సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ చేతులమీదుగా బియ్యం,వంట సామాగ్రి, నిత్యావసరాలు, దుస్తులను గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు అందజేశారు.సాయం అందించిన రమణారావుకు బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు.మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్ గ్రామ పెద్దలు చొల్లంగి శ్రీనివాస్,పెద్దింశెట్టి ప్రకాష్,కొప్పిశెట్టి వీరంశెట్టి, కుంచే మోహన్,మెండి ప్రసాద్,ఫౌండేషన్ సభ్యులు పందిరి సుబ్బరాజు, నేరేడుమిల్లి శ్రీనివాస రావు,గంటా లక్ష్మీ ప్రసాద్,కుంచే అర్జున్,పరమట రాజేష్,నెల్లి ప్రసాద్,కుంచే రాజు,పరమట మురళీ కృష్ణ,పరమట నాగరాజు, ముత్తాబత్తుల గణేష్,బల్లా చిన రాజా,విప్పర్తి రమేష్ పాల్గొన్నారు.

# “సత్యాన్ని వెలుగులోనికి తేవడమే నేరమా?”

- గంటా ప్రసాద్‌పై దాడి కలకలం



**తాళ్లపూడి, పెన్ పవర్, జూలై 7 :** తాళ్ళపూడి గ్రామానికి చెందిన, పెన్ పవర్ దినపత్రికలో రిపోర్టర్‌గా పనిచేస్తున్న గంటా ప్రసాద్ సామాజిక బాధ్యత నెరవేర్చే క్రమంలో దాడికి గురయ్యాడు. గ్రామ పంచాయతీ స్థలాలను కొందరు ఆక్రమిస్తున్నారని ఆయన ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, బాధితుడు కాకుండా పోయాడు. స్థానికంగా చెబుతున్న వివరాల ప్రకారం పంచాయతీ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తి, ప్రసాద్‌ను ఇంటికి పిలిపించి కొట్టి గాయపర్చినట్టు సమాచారం. గాయాలపాలైన విలేకరి గంటా ప్రసాద్ కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన తరువాత డిశ్చార్జ్ అయ్యాడు. దీంతో విలేకరి పట్ల సంఘీభావం ప్రకటిస్తూ ఆదివారం పలువురు గ్రామ పెద్దలు, నాయకులు గంటా ప్రసాద్‌ను పరామర్శించారు. పెద్దేవం గ్రామ ఉప సర్పంచ్, వైసీపీ సీనియర్ నాయకుడు తోట రామకృష్ణ, వైసీపీ నాయకులు చామకూరి సత్యనారాయణ, నల్లాకుల వేణుగోపాలకృష్ణ, వేము రామారావు, కోడి గంగారావు తదితరులు ప్రసాద్ నివాసానికి వెళ్లి ధైర్యం చెప్పారు. ‘ప్రజలకు నిజాలు చెప్పే జర్నలిస్టులపై దాడులు జరగడం విచారకరం’ అంటూ వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

# రైతు బజార్ ఏర్పాటు చేయాలని వినతి



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 7 :** తాడేపల్లిగూడెం టౌన్‌లో పేద ప్రజల సౌకర్యార్థ రైతు బజార్ ఏర్పాటు చేయాలనిలో ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణ్ రావు ఆర్డీవోను కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం సమర్పించారు. కార్యదర్శి కళింగ లక్ష్మణ్ రావు ఏపీ రైతు సంఘం నాయకులు బండారు శ్రీనివాసరావు సిపిఐ పెంటపాడు మండల సహాయ కార్యదర్శి కొణతాల నాగరాజు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లిగూడెం నియోజకవర్గం నాయకులు దిద్దె నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రజా సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ చర్యలు

- ఐటిడిఎలో 83 ప్రజా దరఖాస్తులు స్వీకరణ - ప్రజా సమస్యలపై స్పందించిన ఐటీడీఏ




**దేవీపట్నం/రంపచోడవరం, పెన్ పవర్,జూలై7 :** ఏజెన్సీలోని మారుమూల గ్రామాల ప్రజా సమస్యల పరిష్కారానికి రంప చోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం ముందుకు వచ్చారు. సోమవారం ఐటిడిఎ సమావేశ హాలులో నిర్వహించిన గ్రీవెన్స్ డే లో మొత్తం 83 దరఖాస్తులు అందాయని తెలిపారు. వ్యక్తిగత,సామూహిక సమస్యలను పరిశీలించి కొన్నింటికి తక్షణమే పరిష్కారం కల్పించగా,మరికొన్నింటిని సంబంధిత అధికారులకు పంపారు.పెద్దగెద్దాడ సమీప నిమ్మల కాలువ పూడికతీత,నల్లగొండ ఆశ్రమ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం, పుల్లంగి రోడ్డు పనుల పునఃప్రారంభం, వితంతు పింఛన్,మడిపల్లి గ్రామ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ,దబ్బ మామిడి స్కూల్ కొనసాగింపుపై వచ్చిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు రుక్మాండయ్య, షరీఫ్,ఏఈలు శ్రీనివాసరావు, రవికుమార్,తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఇమ్మిడివరప్పాడులో సుపరిపాలన తొలి అడుగు



**అమలాపురం పెన్ పవర్ రూరల్ జూలై 6 :** మండలం లోని ఇమ్మిడివరప్పాడు గ్రామంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి వారి సమస్యలను ఎమ్మెల్య అయితాబత్తుల ఆనందరావు అడిగి తెలుసుకున్నారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మెట్ల రమణ బాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ జడ్పిటిసి అధికారి జయవెంకటలక్ష్మి,మట్ట మహాలక్ష్మి ప్రభాకరరావు జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు, మాజీ మండల టిడిపి అధ్యక్షులు మల్లుల పొల్లయ్య, మందా గేద్దయ్య, మడపల్లి యాకోబు, సినగన మల్లేశ్వరరావు,యలగాన శ్రీనివాసరావు, ఈతకోట నాగేశ్వరరావు, తిరుమనాథం మురళి, మందా దుర్గారావు, వంకాయల ప్రసాద్,ఆకుల సత్తిబాబు,చంద్రావు, రామలింగేశ్వర రావు మరియు టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# నారాయణపురంలో రహదారుల విధ్వంసం

## వీల్స్ ట్రాక్టర్ల అరాచకంతో కంకర దారులు గోతుల పాలు!




**ఉంగుటూరు పెన్ పవర్, జూలై 7 :** నారాయణపురం గ్రామంలో ఇటీవల అత్యవసర నిధులతో నిర్మించిన కంకర రహదారులు గోతుల బారినపడుతున్నాయి. అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి రోడ్డును చదును చేయగా, మరోవైపు భారీ ఐరన్ వీల్స్ ట్రాక్టర్లు తిరగడంతో దారి మొత్తం దెబ్బతింటోంది. చదును చేసిన రోడ్డంతా ఇప్పుడు మళ్లీ రేగిపోగా, గోతులు ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. “ఇలా నిబంధనలు అతిక్రమించి తిరిగే ట్రాక్టర్ల వల్ల వందల మంది ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉంది. వీటిపై చర్యలు తప్పవు” అని అధికారులు పేర్కొన్నారు. ఇటీవల గుత్తేదారులు సంబంధిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తిరిగే వీల్స్ ట్రాక్టర్లను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

# శాకాంబరిగా దర్శనమిచ్చిన చింతలూరు నూకాలమ్మ



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 07 :** ఆషాడ మాసం సందర్భంగా ఆలమూరు మండలం చింతలూరు శ్రీ నూకాంబికా అమ్మవారు శాకాంబరీ దేవిగా దర్శనమిచ్చారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శాకాంబరి ఉత్సవాల్లో అమ్మవారి నామ నక్షత్రమైన అనురాధా నక్షత్రం ఉన్న సోమవారంనాడు అమ్మవారిని వంగ, బెండ, దొండ, కాకర, చిక్కుడు, గోరుచిక్కుడు, మునగ, సొర, బీర, గుమ్మడి బంగాళదుంప, కంద దుంప, క్యాప్సికమ్, క్యాబేజీ, బీన్స్, క్యారెట్, అరటి వంటి వివిధ రకాల కాయగూరలు,ఆకుకూరలతో అలంకరించారు.ఆలయ ప్రాంగణాన్ని సైతం వివిధ కూరగాయలు, ఫల, పుష్పాలతో అలంకరించారు. శాకాంబరిగా నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న వారంతా భక్తి తన్మయత్వంతో పులకితులయ్యారు. ఒకప్పుడు దుర్గమాసురుడనే రాక్షసుడి కారణంగా లోకంలో కరువుకాటకాలు ప్రబలాయని, ఆ సమయంలో దేవతల ఆరాధనను మన్నించిన అమ్మవారు శతాక్షి దేవిగా అవతరించి జీవరాశులన్నింటికి అవసరమైన ఆహారం, కూరగాయలు, పాడి పంటలు. జీవజలాలు ఆమె శరీరం నుంచి అందించి పెంచి పోషించిందని, జీవులకు అవసరమైన శాకాలను సృష్టించినందుకుగాను నాటి నుంచి అమ్మవారిని శాకంబరిగా అలంకరించి పూజించడం అనవాయితీ అని, ఈరోజు అమ్మవారిని దర్శించుకున్న వారికి అన్న పానీయాలకు లోటు లేకుండా ఆశీర్వదిస్తారని పండితులు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి మాట్లాడుతూ చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయంలో శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా ఉచిత సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధి కోసం విరాళాలు అందిస్తున్న వారిని అభినందించారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

## పిఠాపురం పాడా పీజీఆర్ఎస్ కార్యక్రమంలో

# 46 ఫిర్యాదులు స్వీకరణ



**కాకినాడ/పిఠాపురం, పెన్ పవర్,జూలై 7 :** పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (పాడా) కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్) లో పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఏ. చైత్ర వర్షిణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఠాపురం పరిసర ప్రాంతాల ప్రజలు వివిధ అంశాలపై సమస్యలను వివరించగా, పాడా పీడీ వాటిని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మొత్తం 46 ఫిర్యాదులు అందినట్లు ఆమె తెలిపారు. అందులో రెవెన్యూ విభాగం నుంచి 10, మునిసిపాలిటీకి సంబంధించినవి 17, పంచాయతీరాజ్‌కు చెందినవి 6, మరియు ఇతర విభాగాలకు సంబంధించినవి 13 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అర్జీదారులు తమ ఫిర్యాదుల నమోదు స్థితి గురించి తెలుసుకోవాలంటే 1100 (డబుల్ వన్ డబుల్ జీరో) నంబరుకు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చని పాడా పీడీ సూచించారు.ఈ కార్యక్రమంలో పిఠాపురం మునిసిపల్ కమిషనర్, పిఠాపురం, కొత్తపల్లి తహసీల్దార్లు, మూడు మండలాల ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

# వినియోగదారుల సమస్యలపై తక్షణం స్పందించాలి : స్టాలిన్ బాబు



**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 7 :** ఇటీవల పదోన్నతిపై ఏపీ ఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎమ్ ఫైనాన్స్)గా నియమితులైన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పెట్టా వెంకటేశ్వర రావును విశాఖపట్నంలోని ఆయన కార్యాలయంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ కమిటీ మాజీ సభ్యులు నేలపూడి స్టాలిన్ బాబు సోమవారం కలిసి ఆయనను అభినందించారు. కోనసీమ ప్రాంతం నుండి ఈ ఉన్నత ఉద్యోగ స్థానంలో ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందని దుస్సాలువా తో సత్కరించారు. కోనసీమ ప్రాంత విద్యుత్ వినియోగదారుల సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు కృషి చేయాలని ముఖ్యంగా చిన్న సన్నకారు మరియు ఆక్వా రైతులు విద్యుత్ బిల్లుల పరంగా ఎదుర్కొంటున్న సమస్యల విషయంలో తగు చర్యలు తీసుకోవాలని కోరారు. నిరుపేద దళితులకు ఉచిత విద్యుత్ ను, దళిత కాలనీలకు ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా విద్యుత్తును అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్



**జగ్గంపేట, పెన్‌పవర్, జూలై 7 :** జగ్గంపేట మండలం మన్యంవారి పాలెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సోమవారం జగ్గంపేట ఎస్సై టి రఘునాథరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ.5150 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై రఘునాథరావు తెలిపారు.

# 13 నుండి మున్సిపల్ వర్కర్స్ నిరవధిక సమ్మె





**ముమ్మిడివరం పెన్ పవర్ జూలై7 :** ఎ.పి.మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు.) అనుబంధంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మునిసిపాలిటీల నుండి ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పై రాష్ట్ర సంఘం. పిలుపులో భాగంగా సంఘ అధ్యక్షులు పెట్టా శివ ప్రసాద్ అధ్యక్షతన సోమవారం ముమ్మిడివరం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు కి, అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్ బాలయోగి కి ఇంజనీరింగ్ కార్మికులకు జి.ఒ. నెం.36 ప్రకారం జీతాలు పెంచాలని, ప్రభుత్వం తో ఇప్పటికే రెండు దఫాలు చర్చలు జరిగినప్పటికీ మాకు న్యాయం జరగలేదని, మీ ద్వారా మా యొక్క సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఇచ్చి, అనంతరం మెయిన్ రోడ్డు పై మానవహారం నిర్వహించడం జరిగినది.అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే 13 వ తేది నుండి నిరవధిక సమ్మెలోకి వెళతామని తెలియజేసారు. డిమాండ్లు.:ఇంజనీరింగ్ కార్మికులకు జి.ఒ. నెం.36 ప్రకారం జీతాలు పెంచాలి, 5 సం.లు సర్వీసు పూర్తి చేసిన ప్రతీ కార్మికుడిని పర్మినెంట్ చేయాలి.,గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలుకు జి.ఓ.లు ఇవ్వాలి. తల్లికి వందనం పథకంతో సహా అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలి, రిటైర్మెంట్ వయసు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం. శ్రీనివాసరావు, వి.వెంకటేశ్వర్లు, ఎస్. అజయ్ కుమార్, ఎ.సత్తిబాబు, జి.రమేష్, కె.గోవిందరాజు, వి.ప్రసాద్, ఆర్. అరుణ, వై.రమణ, కె. వెంకటశివ, కె.శరత్, జి.ప్రదీప్ జి.వెంకటేశ్వరరావు, ఎస్.రామరాజు, కె.శ్రీనివాసరావు, సి. హెచ్. వెంకటేశ్వర రావు, ఎన్.బొజ్జమ్మ పాల్గొన్నారు.

### శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి, శ్రీ కిరాత వారాహి అమ్మవారి బోనాల పండగ



**అడ్డతీగల ,పెన్ పవర్ ,జూలై 7 :** అడ్డతీగల మండలం వెదురు నగరం గ్రామంలో శ్రీ శివసాయి భువనేశ్వరి ఆశ్రమంలో సాయిరాం ఆధ్వర్యంలో గిరిజన సాంప్రదాయాలతో జులై 10వ తేదీ గురువారం నాడు ఉదయం 7 గంటలకి గురుపూజ. 8 గంటలకు దత్తాత్రేయ హోమం. 9 గంటలకు బోనాల ఊరేగింపు మహంకాళి అమ్మవారి శ్రీ కిరాత వారాహి అమ్మవారికి బోనాల సమర్పణ అనంతరం వచ్చిన, భక్తులకు అన్న ప్రసాద వితరణ చేయబడుతుందని, సాయిరాం గురూజీ తెలియ చేసారు. భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని స్వామివారు, అమ్మవారు యొక్క ఆశీస్సులు పొందాలని సాయిరాం గురూజీ తెలిపారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో

# మెరుగైన విద్య కోసం చర్యలు తీసుకోండి

### - ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం





**దేవీపట్నం/రంపచోడవరం,పెన్ పవర్,జూలై7 :** ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని,అందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించామని రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం తెలిపారు.రంపచోడవరం మండలంలోని బొర్నగుడెం గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత పాఠశాల భవనం జీర్ణావస్థలో ఉండటంతో పాకలో విద్యాబోధన జరుగుతుందని గ్రామస్తులు తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు తగిన వసతులతో కూడిన భద్రతాయుత భవనంలో చదవాలన్న ఉద్దేశంతో,పక్క భవనంలో తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలాగే విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు,పాఠ్య పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడాలని,మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం పక్కాగా అమలు చేయాలని సూచించారు. విద్యారంగ అభివృద్ధి కోసం అవసరమైన ప్రతి చొరవను తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## ఆలమూరు ఎస్సైగా నరేష్ బాధ్యతలు స్వీకరణ




**ఆలమూరు, పెన్ పవర్,జూలై 07 :** ఆలమూరు సబ్ ఇన్ స్పెక్టర్ గా జి.నరేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం క్రైమ్ డిపార్ట్మెంట్ లో సబ్ ఇన్ స్పెక్టర్ గా పనిచేసి బదిలీపై స్థానిక పోలీస్ స్టేషన్ కు వచ్చారు. సబ్ ఇన్ స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన నరేష్ 2019-2024 మధ్యకాలంలో రాయవరం, ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ లలో పనిచేశారు. గత జూన్ 26న రోడ్డు ప్రమాదంలో అప్పటి వరకు పనిచేసిన ఎస్సై అశోక్ మృతి చెందడంతో ఈ ఖాళీ ఏర్పడింది.

**శాంతి భద్రతల పరిరక్షణకు కృషి :** పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు, అసాంఘిక కార్యక్రమాలు నిరోధానికి ఉన్నతాధికారుల సహాయంతో కృషి చేస్తానని ఎస్సై జి.నరేష్ హామీ ఇచ్చారు. కక్షిదారులకు, బాధితులకు తగిన న్యాయం సత్వరం చేస్తానన్నారు. నేర పరిశోధన విభాగంలో పనిచేసిన తనకు ప్రతి విషయంపైన అవగాహన ఉందని ఆయన పేర్కొన్నారు.

## అన్నా క్యాంటీన్ లో పేదలకు అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 7 :** స్థానిక కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద గత నాలుగు సంవత్సరాలుగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నా క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఈ వారం గండేపల్లి మండలం కె.గోపాలపురం గ్రామానికి జగ్గంపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు అవసరాల బాలసుబ్రహ్మ ణ్యం మనవడు శ్రీకర్ పుట్టిన రోజు సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో నిర్వహిం చిన ఈ అన్నా క్యాంటీన్ ను టీటీడీ జిల్లా టిడిపి అధ్యక్షులు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ ముఖ్యఅతిథిగా హాజరై అన్నా క్యాంటీన్ ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించారు. జ్యోతుల నవీన్ మాట్లాడుతూ జగ్గంపేటలో అన్నా క్యాంటీన్ భవన నిర్మాణ పనులు ప్రారంభం అయ్యా యని ఆ పనులు పూర్తయ్య వరకు దాతల సహకారంతో కొనసాగిస్తామని నవీన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, అడబాల భాస్కరరావు, అవసరాల సుబ్రహ్మణ్యం, బద్ది సురేష్, యల్లమిల్లి దేగల సత్తిబాబు, పీలా మహేష్, చాగంటి కృష్ణమోహన్, పాతాళ తాతాజీ, పాతాళ గన్ని రాజు, సలాది రామకృష్ణ, కరణం వీరబ్బులు, కర్రీ శ్రీనివాస్, కర్రీ శివ, సలాది కనకరాజు, గొల్లవిల్లి కొండయ్య, జనపరెడ్డి మహాలక్ష్మి, కౌవులూరి చంద్రరావు, గునుకుల నాగార్జున, తూరుబెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో

## ఘనంగా మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకులు






**అల్లవరం, పెన్ పవర్, జులై 07 :** అల్లవరం మండలం గోడి గ్రామంలో ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయం నందు పద్మశ్రీ అవార్డు గ్రహీత, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఆంధ్ర ప్రదేశ్ శాసన మండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ నేతృత్వంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ జెండా ఆవిష్కరణ చేసి, కేక్ కట్ చేసి, స్వీట్స్ పంచి, భారీ బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ వర్గీకరణ సాధకుడు, అంబేద్కర్ ఆశించిన సామాజిక న్యాయం కోసం పోరాడిన అభినవ అంబేద్కర్ శ్రీ మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాట ఫలితంగా వృద్ధులకు, వికలాంగులకు మహిళలకు పెన్షన్ లు సాధించటం, ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్ లో రిజర్వేషన్లు, వర్గీకరణ ఫలితంగా అనేక వేల మందికి ఉద్యోగాలు కల్పన, ఆర్టీసీ కార్మికుల కోసం పోరాడి వారి హక్కులను సాధించిన పోరాటయోధుడు మందకృష్ణ మాదిగ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ అతను సాధించిన ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లు అందరూ ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఇజ్రాయిల్ రెల్లుగడ్డ ,తూర్పులంక కోడూరుపాడు గ్రామాలలో ఏర్పాటుచేసిన మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకల్లో కూడా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో యార్లగడ్డ రామకృష్ణ, ఆకుమర్తి మోహన్, బొమ్మి ఆనందరావు, బొమ్మి చంటి, బొమ్మి ప్రసాద్, పలివెల శ్రీరామ్ ,మల్లవరపు శ్రీను, నవుంద్రు నాగరాజు, ఆకుమర్తి అమృతం, మమ్మిడివరపు రామారావు, మమ్మిడివరపు సుధీర్, చేట్ల సత్యనారాయణ, బుంగ ఆనంద్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మండల వ్యాప్తంగా వైఎస్ జయంతి సందడి

### వైఎస్ జయంతి శోభయాత్రకు వేడుకలా మారనున్న గ్రామాలు

### జయంతి వేడుకలకు మండల వ్యాప్తంగా ఏర్పాట్లు



**ఉంగుటూరు పెన్ పవర్ జూలై 7 :** ఉంగుటూరు మండలంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని ఈ రోజు (మంగళవారం) ఘనంగా నిర్వహించేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి. ఈ మేరకు మండల వైకాపా అధ్యక్షుడు మారడా మంగారావు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నారాయణపురంలోని వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి రంగులు వేయించడం ద్వారా జయంతి వేడుకల ఆరంభాన్ని చేశారు. “మండలంలోని అన్ని గ్రామాల్లో విగ్రహాల వద్ద జయంతి వేడుకలు నిర్వహించేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు. ప్రతి గ్రామంలో ప్రజా ప్రతినిధులు, అభిమానులు భాగస్వామ్యం కాబోతున్నారు” అని మారడా మంగారావు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణపురంలో నిర్వహించిన ఏర్పాట్ల పరిశీలన కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పైడి అరుణ్ కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు అరివెల్లి మహాలక్ష్మి దానయ్య, వార్డు సభ్యులు నేదురి గంగాధర్, కార్యకర్తలు వరప్రసాద్, మానుబోతుల చంద్రశేఖర్, ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షులు బందారు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వనమహోత్సవ సందర్బంగా మొక్కల పంపిణీ

### విద్యార్థులే వన సంరక్షణ సైనికులు!



**ఉంగుటూరు పెన్ పవర్, జూలై 07 :** పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా నారాయణపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో పలు రకాల మొక్కలను నాటించారు. విద్యార్థుల చేతుల్లోనే పచ్చదనం భవిష్యత్తు ఉందని చెబుతూ, మొక్కలను పెంచి సంరక్షించాల్సిన బాధ్యతను వారికి అప్పగించారు. “ప్రతి విద్యార్థి ఒక మొక్కను పెద్దదిగా చేయాలి. అది వారి బాధ్యతగా భావించాలి” అని ప్రధానోపాధ్యాయులు తోట పోతురాజు పిలుపునిచ్చారు. వనమహోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల్లో ప్రకృతి ప్రేమను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 7 :** లేబర్ కోడ్స్ రద్దుకు కార్మికులు సమస్యల పరిష్కారానికి ఈనెల 9 తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ను జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుండి ప్రారంభమైన ర్యాలీ తాడేపల్లిగూడెం పట్టణం నుంచి పెంటపాడు వరకు సాగింది. ఈ ర్యాలీ లో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లు గా చేయడాన్ని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని దుయ్యబ ట్టారు. లేబర్ కోడ్లు అమలు అయితే సమ్మె చేసే హక్కును కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ లేబర్ కోడ్లు అమలు అయితే సంఘం పెట్టుకునే హక్కు, అగ్రిమెంట్ చేసుకునే హక్కు కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్లు యజమానులకు అనుకూలం గాను, కార్మికులకు నష్టదాయకంగా ఉన్నాయని వీటిని కార్మిక వర్గం సహించదని ఈ విధానాలను సిఐటియు తీవ్రంగా ఖండిస్తున్నదని ఆయన అన్నారు.4 లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కార్మికులందరికీ కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, కూటమి ప్రభుత్వం 8 గంటలు నుండి 10 గంటలకు పనిదినం పెంపును రద్దు చేయాలని, విశాఖ స్టీల్, ప్రభుత్వ సంస్థలు ప్రైవేటీకరణ ఆపాలని, అధిక ధరలు అరికట్టాలని,కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ ర్యాలీ కి సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, సత్తి కోదండ రామిరెడ్డి, బంకురు నాగేశ్వరరావు, శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను,నరమాల కృష్ణ,వ్రి అప్పారావు, దేశంశెట్టి సతీష్,అన్నం చిన్నారావు,వడిసెల శ్రీను,పక్కుర్తి చిన్న అప్పారావు,పతివాడ నాగేంద్రబాబు మరియు సిఐటియు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు .

## భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 07 :** మండలంలోని చింతలూరులో వేంచేసియున్న శ్రీ నుకాంబిక అమ్మవారి ఆలయంలో సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు వైభవంగా జరిగాయి. శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఆషాఢ శుద్ధ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవాదాయ శాఖ ఉచితంగా పూజా సామగ్రిని సమకూర్చి ఏర్పాటు చేసిన ఈఆధ్యాత్మిక కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసారు. ఆలయ ముఖ మండపంలో అమ్మవారి ఎదుటగా కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం శాకాంబరీ అవతారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధి కారి ఉండవల్లి వీర్రాజు చౌదరి ఏర్పాట్లను పర్యవేక్షణ చేశారు.

## పశువులకు వట్టిగడ్డి పంపిణీ



**అమలాపురం పెన్ పవర్ జూలై7 :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ త్సవటపల్లి బివివి నారాయణస్వామి( వెంకటేశ్వరరావు) ఆధ్వర్యంలో పశువుల ( వట్టిగడ్డి) పంపిణీ చేశారు. అమలాపురం ఎర్ర వంతెన వద్ద గల గీతా మందిర్ పశు వులసాలకు 12 వేల రూపాయల విలువగల వట్టిగడ్డిని గాయత్రి ట్రస్టకు అందజేశారు. పశువుల దాన అందజేయడం పట్ల గాయత్రి ట్రస్ట్ వారు అభినందించారు.

## ఘనంగా ఎంఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



**గోకవరం, పెన్ పవర్, జులై 07 :** సోమవారం స్థానిక సంజీవయ్యనగరంలోని బాబు జగజ్జీవన్ రామ్ కమ్యూనిటీ భవనం ఆవరణంలో ఎంఎస్ పి మండల అధ్యక్షులు గరబారపు శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.అదేవిధంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగరవేసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో బొడ్డపాటి వీరచంద్రం మాదిగ చింతాటి వెంకన్నమాదిగ, చీకట్ల రాజుమాదిగ,రసాల వెంకన్నమాదిగ, చింతాటి చిట్టియ్యమాదిగ, కోడి శ్రీనుమాదిగ, అరసాల శ్రీనుమాదిగ. బొడ్డపాటిచిన్నిమాదిగ, చీకట్ల నానిమాదిగ, కందుకూరి నాగరాజు మాదిగ,చింతాటి ఏసు,దొండపాటి వెంకన్న వేమగిరిశివ,చీకట్ల వందనం, తోలేటి చందు,గరబారపు అశోక్ వర్మ,అరసాల కుమార్, కందుకూరి కృపవరం తదితరులు పాల్గొన్నారు.

### కాండ్రేగులలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 7 :** జగ్గంపేట మండలం కాండ్రేగుల గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తకొండ బాబు, క్లస్టర్ ఇంచార్జ్ బస్వా చినబాబు పాల్గొని కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలన దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంలో ప్రతి ఒక్కరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయకత్వంలో రాష్ట్రం ప్రయాణిస్తుందని తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గం కోట్లాది రూపాయలతో జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో అభివృద్ధి చేస్తున్నారని ప్రతిక్షణం ప్రజల సంక్షేమం కోసం జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతన్ నవీన్ కృషి చేస్తున్నారని కొత్త కొండబాబు అన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల మాజీ ఎంపీటీసీ సభ్యులు రామిశెట్టి చంద్రరావు, యల్లపు దొరబాబు, రామిశెట్టి పాపారావు, లింగం విష్ణు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

## ఏజెన్సీలో జమాల్ ఖాన్ సేవలు వెలకట్టలేనివి

## మెమెంటోతో సత్కారం

**ఎటపాక ,పెన్ పవర్, జులై 07 :** ఏజెన్సీలో టిడిపి సీనియర్ నాయకులు ఆయుర్వేద వైద్యులు డా జమాల్ ఖాన్ విలువ కట్టలేనివని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషా దేవి కొనియాడారు.తోటపల్లి గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే శిరీషా దేవి ఆవిష్కరించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.ఎంతోమంది నిరుపేద కుటుంబాల్లో డా జమాల్ ఖాన్ వెలుగులు నింపారు.ఇల్లు కాలిపోయిన కుటుంబాలకు ఇంటి సామగ్రి తోపాటు ఆర్థిక సహాయం అందజేస్తున్న మంచి మనసున్న వ్యక్తి అన్నారు.విలీన మండలాల్లో ఆయన చేస్తున్న సేవలు విస్తృతం చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు,జనసేన,బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# అర్జీదారులతో గౌరవంగా మెలగాలి

- సమస్య పరిష్కరిస్తున్న తీరును వారికి వివరించాలి

- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జులై 7 :** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారంలో లోపాలకు తావు ఇవ్వరాదని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అధికారులను ఆదేశించారు. ఐవిఆర్ఎస్ విధానం ద్వారా పీజీఆర్ఎస్ అర్జీదారుల నుంచి నిరంతరం స్పందన తీసుకుంటున్నారని చెప్పారు. వీటిని పద్ధతి పాటించనవి, ప్రవర్తన సరిగా లేనివి అని రెండు రకాలుగా వర్గీకరించారని తెలిపారు. ప్రవర్తనాపరమైన అంశాలలో అధికారులు సరిగా మాట్లాడుతున్నారా, మిమ్మల్ని బెదిరించారా, లంచాలు అడుగుతున్నారా, ఉద్దేశ పూర్వకంగా ఇబ్బందులు పెడుతున్నారా వంటి ప్రశ్నలు అర్జీదారులను అడుగుతున్నట్లు చెప్పారు. ముందుగా నోటీస్ ఇవ్వడంలేదు, ఎండార్స్మెంట్ ఇవ్వడం లేదు, అర్జీదారుతో నేరుగా మాట్లాడటం లేదు, అర్జీదారుకు సమస్య పరిష్కరించిన విధానాన్ని తెలపడం లేదన్న ఫీడ్ బ్యాక్ ప్రజల నుంచి వస్తోందన్నారు. అన్ని శాఖలు ఇలాంటి వాటిపై దృష్టి సారించాలని చెప్పారు. ఒకవేళ సమస్యను పరిష్కరించ లేకపోతే దానికి గల కారణాలు, ప్రత్యామ్నాయ పరిష్కార మార్గాలు ఫిర్యాదుదారుకు తెలపాలని సూచించారు. అర్జీ దారులతో గౌరవంగా మసలుకోవాలని, సమస్య పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యలు వారికి వివరించాలని చెప్పారు. సంయుక్త కలెక్టర్ ఎస్.చిన్న రాముడు మాట్లాడుతూ అర్జీదారులతో సహనంగా వ్యవహరించాలని, వారి గోడు వింటే సగం సమస్య పరిష్కరించినట్లేనని చెప్పారు. ప్రతి శనివారం ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహిస్తున్నారని, అందుకే అధికారులంతా ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, డిఆర్ఓ టి.సీతారామమూర్తి, డివిల్డివో లు ఏ.స్లీవా రెడ్డి, పి.వీణ దేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పి.భాగ్యలక్ష్మి, ఎంఆర్ఆర్ ప్రేమ్ కుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాలేయ మార్పిడికు రూ.10 లక్షల చెక్కు అందించన మంత్రి వాసంశెట్టి సుభాష్

పేదల బతుకులకు భరోసాగా సీఎం సహాయనిధి తోడ్పాటు



**కె.గంగవరం పెన్ పవర్ జులై 7 :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కాలేయ మార్పిడి (లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్) కోసం మంజూరైన రూ.10 లక్షల ఎల్ ఓ సి చెక్కును రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ బాధితుని కు సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో అందజేశారు.రామచంద్రపురం నియోజవర్గం ఉట్రుమిల్లి గ్రామానికి చెందిన గాదంశెట్టి లక్ష్మీనారాయణ కాలేయ సంబంధిత వ్యాధితో బతుకు పోరాటం చేస్తున్నాడు.తన ప్రాణాలు కాపాడాలంటూ మంత్రి సుభాష్ ను కలిసి అభ్యర్ధించారు. బాధితుని సమస్య పట్ల స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫారసు చేశారు.మంత్రి సుభాష్ సిఫారసు మేరకు మంజూరైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసి) ను ఈరోజు అందించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రానికి పెద్దకొడుకుగా సీఎం చంద్రబాబు నాయుడు వ్యవహరిస్తూ పేదల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్నారన్నారు. వైద్య సహాయం అందక ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదు అనే ఆశయంతో సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఆయన అడుగుజాడల్లోనే తామంతా నడుస్తూ ప్రభుత్వ పరంగా, వ్యక్తిగతంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.సీఎం సహాయ నిధితో మెరుగైన ఆరోగ్యం పొంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.తన పరిధిలో ఉన్న ఏ సహాయం చేయడానికి అయినా తాను ముందు వరసలో ఉంటానని ఈ సందర్భంగా గుర్తు చేశారు.రూ. 10 లక్షలు చెక్కును అందించిన మంత్రి సుభాష్ కు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతి కుటుంబానికి సుపరిపాలన, సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ సంకల్పం



**కె.గంగవరం పెన్ పవర్ జూలై 7 :** ప్రతీ కుటుంబానికి సుపరిపాలన సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ సంకల్పం అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం కె.గంగవరం మండలంలోని బాలాంత్రం,గుడిగళ్ల బాగా గ్రామాల్లో పర్యటించి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలును వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి సుస్థిరతను, సమగ్ర అభివృద్ధిని, ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలను తీసుకొస్తుందని, నైతిక విలువలతో పారదర్శకతతో అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తూ సుపరిపాలన దిశగా పయనిస్తుందని, గ్రామీణాభివృద్ధి సమగ్ర సదుపాయాలు, ఉపాధి అవకాశాల సృష్టి, పరిశ్రమల ప్రోత్సాహం, విద్య, వైద్య రంగాలలో నాణ్యతను మెరుగుపరచడం జరుగుతుందని, గతంలో ప్రారంభించిన అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించడం, కొత్త పెట్టుబడులు ఆకర్షించడం, యువతకు ఉపాధి కల్పించడం, మహిళలకు సాధికారతను మరింత బలోపేతం చేయడం కూటమి ప్రభుత్వ ప్రథమ లక్ష్యాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, నియోజకవర్గ మండల నాయకులు, క్లస్టర్, బూత్ ఇన్చార్జిలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఓఎన్జీసీ లక్ష్యం.. స్వచ్ఛ భారత్

- ఆపర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తాం - గ్రామాభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ వినతి



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 07 :** కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ లక్ష్యంగా ఓఎన్జీసీ సంపూర్ణ సహకారం అందిస్తుందని ఆసంస్థ ప్రతినిధులు కె.శ్రీకృష్ణ, బి.శివకుమార్ అన్నారు. మండలంలోని సంధిపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం సర్పంచ్ తోట భవానీ అధ్యక్షతన స్వచ్ఛ భారత్%-%స్వచ్ఛత సేవ అనేక కార్యక్రమంపై గ్రామస్తులకు అవగాహన జరిగింది. ఈసందర్భంగా పర్యావరణ పరిరక్షణకు, పారిశుధ్య కల్పనకు ఓఎన్జీసీ తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో తడిచెత్త, పొడిచెత్తను వేరే చేసేందుకు తమ వంతు సాయం అందిస్తామని తెలియజేశారు. ఈసదర్భంగా పర్యావరణ హితం కోసం ఎంపీటీసీ తోలేటి సంతోషి, కూటమి నేతలు దొడ్డా సుబ్బారావు, నల్లా వెంకన్న, తోట వెంకటేశ్వర్లు చేతుల మీదుగా గ్రామస్తులకు చేతి జూట్ సంచులను ఓఎన్జీసీ ప్రతినిధులు పంపిణీ చేశారు. అలాగే రావులపాలెంకు చెందిన చిరంజీవి కళాజాత బృందం ప్రదర్శించిన స్వచ్ఛ భారత్ బుర్రకథ గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది.స్వచ్ఛ భారత్ లక్ష్యంగా చేపట్టిన విధి విధానాలను వివరిస్తూ స్వచ్ఛతే సేవ అంటూ ఓఎన్జీసీ సమకూర్చిన టీ షర్టులు, టోపీలు, జూట్ సంచులతో బారీ ర్యాలీ జరిగింది. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని స్థాపనే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ప్రత్యామ్నాయ పద్దతులను అవలంభించాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం, ఓఎన్జీసీ సిబ్బంది కోరారు. సూరపురెడ్డి పట్టాభి రామయ్య, సిద్ధిరెడ్డి వెంకటేష్, గ్రామ కారదర్శి ఎస్ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



**ప్రచార ఆర్భాటం తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదు :**

ఓఎన్జీసీ తమ ప్రచార ఆర్భాటానికే తప్ప గ్రామాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు శూన్యమని, ప్రజలకు ఒరిగిందేమీ లేదని పలువురు గ్రామస్తులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. మండలంలోని సుమారు చమురు అన్వేషణ బావులు ఉన్నా మెజారిటీ గ్రామాలను పట్టించుకోవడం లేదని వారు ఆవేదన చెందారు. గ్రామాభివృద్ధికి రూ 12 లక్షలు నిధులు ఇస్తామన్న హామీ ఇప్పటి వరకూ నెరవేరకపోడం దురదృష్టకరమని వ్యాఖ్యానిస్తున్నారు. గ్రామంలో రెండు రిగ్‌లు ఏర్పాటు చేసి చమురు నిక్షేపాలను తీసుకువెళుతున్నా అభివృద్ధికి సహకరించపోవడం దారుణమన్నారు. గ్రామాభివృద్ధికి నిధుల కేటాయింపుపై ఓఎన్జీసీ ఉన్నతాధికారులు స్పష్టమైన హామీ ఇవ్వాలని గ్రామస్తులు డిమాండు చేశారు.

# కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో ఉచిత వైద్య శిబిరం





**సీతానగరం, పెన్ పవర్ జూలై 07 :** రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల తమ బృందంతోరాజమండ్రీ వారిచే ఆధ్వర్యంలో సోమవారం నాడు సీతానగరం మండలంలోని లంకూరు గ్రామంలో కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామీ పరిజ్ఞేయనంద మహారాజ్ ఆధ్వర్యంలోఈ వైద్య శిబిరంలో డా.శ్రీనివాస్ రాయుడు. డా.సత్యం రమేష్ బాబు. ఈ వైద్య శిబిరం లో పాల్గొని,సుమారు 300మందికి రోగులకు వైద్యసేవలు అందించారు. వీరిలో 89మందికి రక్త నీరుడు పరీక్షలు, 07గురుకి థైరాయిడ్ పరీక్షలు చేసి పరమహంసయోగానంద నేత్రలయ వేమగిరి వారిచే సుమారు82మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 19 మందిని శుక్లాం ఆపరేషన్ నిమిత్తం వేమగిరి ఆసుపత్రి కి తరలించారు.18 మందికి కంటి అద్దాలుఇవ్వనున్నారు. మరియు ఈ శిబిరంలో పరమహంస యోగానంద నేత్ర లయ ప్రోగ్రాం మేనేజర్ నక్కా చంటిబాబు సిబ్బంది పాల్గొన్నారు. కస్తూరిబా గాంధీ ఆశ్రమంలో రోగులకు సహాయకులుకు పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ ఆశ్రమప్రతినిధి కుమారి జి. సుశీల, రామకృష్ణ మిషన్ కో ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్ ,యన్నమని వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు,

# అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

మోతుగూడెం ఎస్సై ఎస్కే సాదిక్





**చింతూరు, పెన్ పవర్, జులై 7 :** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కొత్తపల్లి పంచాయతీ వేములరాయి గ్రామంలో సోమవారం మోతుగూడెం ఎస్సై ఎస్.కె సాదిక్ , పోలీస్ సిబ్బంది సందర్శించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారాయి తయారు చేయడం నేరం అని గంజాయి రవాణా చేయడం, పండించడం, సేవించడం చేయకూడదని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. యువత చెడు దారి పట్టకుండా ఉండాలని సూచించారు. గ్రామస్తులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మోతుగూడెం పోలీస్ స్టేషన్ సిబ్బందితోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# జీతాల కోసం సత్యసాయి కార్మికుల నిరవధిక సమ్మె

జూలై 8 నుంచి సమ్మె ప్రారంభం... తొలి రోజే పాదయాత్ర...



**దేవీపట్నం,. పెన్ పవర్,జూలై7 :** పురుషోత్తపట్నం సత్య సాయి డ్రింకింగ్ వాటర్ సప్లై స్కీంలో పని చేస్తున్న 52 మంది కార్మికులు జీతాలు లభించక 19 నెలలుగా తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పీఎఫ్, ఈఎస్ఐ వంటి సంక్షేమ నిధులు కూడా కట్టకపోవడంతో వారి ఆవేదన మరింతగా పెరిగింది.పరిస్థితికి ముడి వేసి కార్మికులు జూలై 8వ తారీఖున మంగళ వారం అర్ధరాత్రి 12 గంటల నుంచి నిరవధిక సమ్మెకి దిగుతున్నట్లు ప్రకటించారు. గతంలో జీతాల విషయమై రాజమండ్రి లాలాచెరువు ఆర్.డబ్ల్యు.ఎస్.ఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేసినా,అధికారుల హామీలు అమలుకాలేదు.దీంతో ఇప్పుడు సత్య సాయి కార్మికులు మరోమారు సమ్మె బాట పట్టారు.జూలై 7న ఇందుకూరుపేట పంపుహౌస్ వద్ద ఏర్పాటు చేసిన జనరల్ బాడీ మీటింగ్‌లో కార్మికులు సమావేశమై సమ్మెపై ఒకగాటిగా నిర్ణయం తీసుకున్నారు.ఆధికారులు,కాంట్రాక్టర్లకు ముందుగానే పోస్టల్ ద్వారా నోటీసులు పంపినప్పటికీ స్పందన రాకపోవడం కారణంగా ఈ చర్యకు దిగినట్లు వారు తెలిపారు.జూలై 8న సమ్మె ప్రారంభమవుతూనే,తొలి రోజే గోకవరం ఎమ్మార్వో కార్యాలయం నుంచి రాజమండ్రిలోని లాలాచెరువు వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు.జీతాల సమస్య పరిష్కారం అయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు.ప్రజల మద్దతు కోరుతున్న సత్యసాయి కార్మికులు,తమ న్యాయ హక్కుల కోసం న్యాయపద్ధతిలో పోరాడతామని తెలిపారు.

# రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంలో మహా శివార్చన

- ఆలయంలో 63 నాయనార్ల విగ్రహ ప్రతిష్ఠ

- ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పోకల వంశీ నాగేంద్ర మాధవ్



**ప్రత్తిపాడు, పెన్ పవర్ జూలై 7 :** ఆధ్యాత్మిక పవిత్రతకు నిలయంగా నిలుస్తున్న కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామంలో వెలసిన శ్రీ అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి ఆలయం సోమవారం శివభక్తులతో కిటకిటలాడింది. ఆంధ్ర అరుణాచలంగా ఖ్యాతిగాంచిన ఈ పవిత్ర క్షేత్రంలో జరిగిన ప్రత్యేక హెూమాలు, 63 మంది నాయనార్ల విగ్రహాల ప్రతిష్ఠా మహెూత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగాయి. ఈ మహెూత్సవానికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మరియు ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షులు పోకల వంశీ నాగేంద్ర మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న మాధవ్ కు కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, ప్రత్తిపాడు మండల అధ్యక్షులు ఊట వీరబాబు ఘన స్వాగతం పలికారు. పుణ్యక్షేత్రంలోకి ప్రవేశించిన వంశీ మాధవ్ ఆలయ సంప్రదాయ పూజలలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. భక్తులు, నేతలు, స్థానికులు సమభోగంగా పాల్గొన్న ఈ వేడుకల్లో హెూమాలు, శాంతికారక పూజలు, శివపారాయణంతో ఆలయ ప్రాంగణం ధర్మమయం అయ్యింది. నాయనార్ల పునఃప్రతిష్ఠ మహెూత్సవం అనంతరం జరిగిన సభలో భక్తి, సంస్కృతి, సేవా తత్వం ప్రాధాన్యతపై నేతలు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మాట్లాడుతూ "రాచపల్లి ఆలయం ప్రత్తిపాడు మండల ఆధ్యాత్మిక చైతన్యంలో ముఖ్య పాత్ర పోషిస్తోందని, ఇటువంటి కార్యక్రమాల ద్వారా సమాజంలో శ్రద్ధా బలంతో పాటు సమైక్యత కూడా పెరుగుతుందన్నారు. బీజేపీ అధ్యక్షుడు వంశీ మాధవ్ మాట్లాడుతూ "ఆధ్యాత్మికత మన సంస్కృతి మూలస్తంభం. ఇలాంటి శుభకార్యాలలో పాల్గొనడం ఆనందకరమని, భవిష్యత్తులో దేవాలయ అభివృద్ధికి తోడ్పడతామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు కీలక బీజేపీ నాయకులు సైతం రాచపల్లి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్, ఉమ్మిడి వెంకట్రావు, పైలా సుభాష్ చంద్రబోస్, సింగిలిదేవి సత్తిరాజు, పైలా అయ్యప్ప, నీలి సురేష్, రెడ్డి వరలక్ష్మి, కంద వీర స్వామి, రెడ్డి లోవరాజు, గట్టి వెంకట రమణ, కించ జోగి రాజు, సాహితీ వర్మ తదితరులు పాల్గొన్నారు.



# ప్రకృతి విపత్తులు ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలి : ఆర్డీవో మాధవి







**అమలాపురం /ఐ పోలవరం, పెన్ పవర్ జూలై 7 :** గోదావరి వరదలు ప్రకృతి విపత్తులు,తుఫాన్లు సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు మండల స్థాయి యంత్రాంగం సన్నద్ధం కావాలని ఆర్డిఓ కే మాధవి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి రుతుపవనాలు గోదావరి వరదలు సమీపిస్తున్న నేపథ్యంలో ముంపు బాధితులను ఆదుకునేందుకు అన్ని విధాలుగా సర్వ సన్నద్ధం కావాలని ఆదేశించారు.

వరదలు ఎదుర్కొనేందుకు ప్రమాద హెచ్చరిక స్థాయిలను బట్టి కార్యాచరణ ప్రణాళికలను రూపొందిం చుకుని ఆయా హెచ్చరికల నేపథ్యంలో చేపట్టాల్సిన సహాయ కార్యక్రమాలను సమర్థ వంతంగా చేపట్టి ఎటువంటి ఆస్తి ప్రాణ నష్టం కలుగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. జిల్లా యంత్రాంగం జిల్లాలో ఏ హెచ్చరిక స్థాయిలో ఏ ఏ ప్రాంతాలు ముంపు బారిన పడతాయో నిర్దిష్ట ప్రామాణిక నివేదికను రూపొం దించడం జరిగిందని ఆ ప్రకారం సహాయక చర్యలను చేపట్టాలని సూచించారు. రోడ్లపై చెట్లను తొలగించడం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం నిత్య అవసరాలు మూడు నెలలకు సరిపడా నిల్వలు చేయడం, పునరావాస కేంద్రాలు పడవలను సిద్ధం చేయడం, జనరేటర్లు సహాయంతో త్రాగునీటి పథకాలు కొనసాగిం చడం వంటి తాత్కాలిక సహాయక చర్యలపై దృష్టి చారించాలన్నారు. తాసిల్దారు విజయ శ్రీ, ఎంపీడీవో శర్మ ఎలక్ట్రికల్ డిఈ శ్రీనివా సరావు, ఆర్డబ్ల్యూఎస్ డీఈ రాంప్రసాద్ సిఐ మోహన్ రావు ఎస్ఐ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# అగ్రికల్చర్ డ్రోన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం, పెన్ పవర్,జులై 07 :** వ్యవసాయ శాఖ ద్వారా ఎనభై శాతం సబ్సిడీ పై అందించిన అగ్రికల్చర్ డ్రోన్లన స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ రైతులకు పంపిణీ చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే మండలంలో పర్యటించారు. కొత్తపల్లి, వెదురుపాక గ్రామాలకు చెందిన శ్రీవినాయక సిహెచ్‌సి గ్రూపు,రామ్ విజయ్ సిహెచ్‌సీ గ్రూపు సభ్యులకు అగ్రికల్చర్ డ్రోన్లను ఎమ్మెల్యే అందజేశారు.అదేవిధంగా నూరుశాతం సబ్సిడీ తో వ్యవసాయ శాఖ అందించిన నాలుగు క్వింటాళ్ల మినుము విత్తనాలను మండలంలోని రైతులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ అడపా భరత్ కుమార్,మండల టిడిపి నాయకులు మంగరౌతు రాము,గాజింగం సత్తిబాబు ఏడిపి మల్లికార్జున రావు,ఏఓ రాజరాజేశ్వరి, మండలంలోని రైతులు పాల్గొన్నారు.

# గ్రామాలలో సుపరి పాలనలో తొలి అడుగు విజయవంతం

## తల్లికి వందనం సూపర్ సిక్స్ పట్ల ప్రతి ఇంట హర్షం




**ఎటపాక ,పెన్ పవర్, జులై 7 :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల పరిధిలోని పలు గ్రామాలలో రంపచోడవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి భాస్కర్లు సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమాలలో సోమవారం పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా ఎటపాక మండల కేంద్రంలో ఉన్నటువంటి ప్రజలతో మమేకమై ఇంటింటికి తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేసే విధానాన్ని డోర్ టు డోర్ తిరిగి అడిగి తెలుసుకుంటున్నారు, ఇందులో భాగంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలోని ఉన్నటువంటి మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలతో గ్రామాలలోకి వెళ్లి ఏడాది పాలనలో ఏపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు సూపర్ సిక్స్ పథకాలు తల్లికి వందనం వంటి కార్యక్రమాల గురించి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరిస్తూ, అడుగు తెలుసుకోవడమే పార్టీ ఉద్దేశమని అన్నారు, ఎటపాక కార్యక్రమం అనంతరం నెల్లిపాక గ్రామంలో ఉన్నటువంటి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మితక తనిఖీ చేసి ప్రజల యొక్క బాగోగులను అడిగి తెలుసుకున్నారు, ప్రజలకు డాక్టర్లు 24 గంటలు అందుబాటులో ఉండాలని అన్నారు,తోటపల్లి గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆవిష్కరించారు, అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన విగ్రహ ఆవిష్కరణ సభను ఉద్దేశించి ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి భాస్కర్లు మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్న తరుణంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందజేస్తుందని అన్నారు, గ్రామాలలో ఏ ఇంటికి వెళ్లినా తల్లికి వందనం డబ్బులు వచ్చాయని,టిడిపి పాలన బాగుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు అందించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, గత ప్రభుత్వానికి భిన్నంగా తెలుగుదేశం ప్రభుత్వం ?4,000 పెన్షన్ లబ్ధిదారులకు అందిస్తుందని హర్షం వ్యక్తం చేశారు, అదేవిధంగా నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని ఇచ్చిన దాతల కుటుంబాలకు కృతజ్ఞతలను తెలియజేశారు, కార్యక్రమం అనంతరం సభా వేదికపై ఉన్నటువంటి ప్రజా ప్రతినిధులకు ముఖ్య నాయకులకు సాలు వాళ్లతో సన్మానం చేసి మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జ్ఞాపిక మెమొంటాలను అందజేశారు, ఈ కార్యక్రమంలో ఆయుర్వేదిక్ వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి వల్లభనేని.చందు, తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంటరీ కార్యదర్శి మువ్వా.శ్రీను,వైస్ ఎంపీపీ దొంతు.మంగేశ్వరరావు, సీనియర్ నాయకులు పాటి. చలపతి రావు, కిలారి వెంకటేశ్వరరావు, రాయి.మాధవరావు, నలజాల. శ్రీకాంత్, బాచినేని.మల్లేశ్వరరావు, ఏలూరి.వెంకన్న, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.









## ఇచ్చిన వాగ్దానాలు
# నెరవేర్చి మాట్లాడండి

- జెడ్పీటీసీ గుజ్జ విజయ, ఎంపీపీ పాయం రంగమ్మ



**కూనవరం,పెన్ పవర్,జులై 7 :** మండలంలో టిడిపి నాయకులు కొంతమంది మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి,ఎమ్మెల్సీ అనంత బాబును విమర్శించే స్థాయి వారికి లేదని జడ్పిటిసి గుజ్జ విజయ,ఎంపీపీ పాయం రంగమ్మ జగ్గవరం లో నిర్వహించిన సమావేశంలో అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి సాధ్యం కానీ వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత సాధ్యం కాదని చెప్పడం వారికే చెల్లిందని అన్నారు.సూపర్ సిక్స్ లో భాగంగా 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అని చెప్పి అరకొరగా ఇచ్చారని అన్నారు. తల్లికి వందనం కొంతమందికి వచ్చి కొంతమందికి రాకపోవడం అది మీ తప్పిదమేనని అన్నారు.వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2022 వరదలకు ప్రతి కుటుంబానికి 2వేలు ఆర్థిక సాయం,ఇల్లు కూలిపోయిన వారికి ప్రత్యేక అమౌంట్ వారి అకౌంట్లోకి జమ చేయడం జరిగిందని,నిత్యవసర వస్తువులు,టర్ బల్లలు ప్రతి ఇంటికి ఇవ్వడం జరిగిందని తెలిపారు.16 పంచాయితీలలో 5 పంచాయతీలను ముంపు పరిగణలోకి తీసుకోకుండా 16 పంచాయతీలకు ఆర్థిక సాయం చేసిన ఘనత మాకు చెందుతుందని చెప్పారు. మీరు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చి అప్పుడు మాట్లాడండి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కారం పార్వతి,కట్టం లక్ష్మి,ఎంపీటీసీ నాగమణి,బీసీ సెల్ రాష్ట్ర నాయకులు ఆవుల మరియాదాసు,ఎస్టీసెల్ సభ్యుడు గుజ్జా బాబు,దీకొండ గంగాధర్,నోముల కొండలరావు,అరవ దివాకర్, కొమ్మాని సునీత,కరక రాజ్ కుమార్ నాయకులు,కొమ్మాని మోహన్ రావు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈనెల 10న అన్ని విద్యా సంస్థలో మెగా పేరెంట్స్ మీట్

- విద్యా ప్రమాణాలు మెరుగు పరడమే లక్ష్యం - ప్రతీ విద్యార్థి తల్లి పేరున మొక్కలు నాటాలి
- పకడ్బందీగా మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహణ - జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్





**స్టాఫ్ రిపోర్టర్, గంగవరం /పాడేరు,పెన్ పవర్,జులై 7 :** రాష్ట్ర ప్రభుత్వం విద్యా ప్రమాణాలు మెరుగు పరచడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ పేర్కొన్నారు.ఈనెల 10వ తేదీన నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ మీట్ ను అన్ని యాజమాన్యాల విద్యా సంస్థల్లో విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యమైన విద్య పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని చెప్పారు.గిరిజన సంక్షేమాధికారులు, విద్యాశాఖాధి కారులు, ఎంపీడీఓ లు, తాహశీల్దారులు అటవీశాఖ అధికారులు, మెగా పేరెంట్స్ మీటింగ్ ఏర్పాట్లపై సోమవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తలిదండ్రులను మెగా పేరెంట్స్ మీటి ఆహ్వానించాలని చెప్పారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలపై తలిదండ్రులకు మీటింగ్ లో అవగాహన కల్పించాలని అన్నారు. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు,లైబ్రెరీలు వంటి సదు పాయాలను కల్పించాలన్నారు.మౌలిక సదుపాయాలు కల్పనలో స్థానిక దాతల నుండి విరాళాలు సేకరించి పాఠశాలలను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు.ప్రతీ విద్యార్థికి ఆర్బి ఎస్ కె కార్డులు మార్గదర్శిని పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచిం చారు. మంగళవారం నుండి మొక్కలు పంపిణీ ప్రక్రియ జరగాలని అన్నారు. మొక్కలు నాటడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ విద్యార్థి తల్లిపేరిట ఒక మొక్క నాటాలని చేసారు. మండలాల్లో మొక్కలు నాటించే బాధ్యత తాహశీల్దారులపైనే ఉందన్నారు.

గ్రీన్ పాస్పోర్టు ఎన్ని పాఠశాలలు నమోదు చేసారని అధికారు లను అడిగి తెలుసు కున్నారు. తలిదండ్రులు విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.మెగా పేరెంట్స్ మీట్కు నిర్వహణకు అన్ని పాఠ శాలలకు నిధులు విడుదల చేసామన్నారు. నిధులను సక్రమంగా వినియోగించాలని ఆదేశించారు.స్థానిక ప్రజా ప్రతినిధులను మెగా పేరెంట్స్ మీట్కు ఆహ్వానించాలని స్పష్టం చేసారు. కెరీర్ గైడెన్సుపై అన్ని పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు.ఈ సమావేశంలో పాడేరు ఐటిడిఏ పిఓ డాక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ, రంపచోడవరం ఐటిడిఏ పిఓ కె.సింహాచలం, డిఎఫ్ఓ పి.వి. సందీప్ రెడ్డి, (వర్చువల్ గా) జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, ఎపిసి డా. స్వామి నాయుడు, జిల్లా వైద్యాధికారి డాక్టర్.టి. విశ్వేశ్వర నాయుడు గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎల్.రజని. ఎంపిడిఓలు, తాహశీ ల్దారులు, మండల విద్యాశాఖాధికారులు, గిరిజన సంక్షేమాధికా రులు, సహాయ ఇంజర్మీడియట్ విద్య అధికారులు పాల్గొన్నారు.

# వెయిట్ లిఫ్టింగ్‌లో చింతూరు యువతకు అవార్డుల పంట




**చింతూరు, పెన్ పవర్, జులై 7 :** చింతూరు శ్రీ వీరభద్ర పవర్ జిమ్ విద్యార్థులు అవార్డుల పంట పండించారు. రాజమహేంద్రవరంలోని ఆల్కట్ తోటలో జరిగిన తూర్పుగోదావరి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ 2025, 2026 పోటీలలో శ్రీ వీరభద్ర పవర్ జిమ్ కు విద్యార్థులు చెందిన అండర్ 13 విభాగంలో ఉయిక. సంతోష్, గోలి వీర జస్వంత్ గోల్డ్ మెడల్ సాధించారు. అలాగే జూనియర్ విభాగంలో ఉమెన్ క్యాటగిరి లో గుత్తుల మధు చందన గోల్డ్ మెడల్ సాధించారు. 60 పురుష విభాగంలో మైస రోహిత్ బంగారు పతకం సాధించారు. 65 కేటగిరిలో శీలం త్రిశాంత్ సిల్వర్ మెడల్ దక్కించుకున్నారు. 78 కేటగిరి లో మైస రాహుల్ గోల్డ్ మెడల్ సాధించారు. సీనియర్ మెన్ విభాగంలో డి ధనరాజు(60 కేటగిరి), గరగ రాము (65 కేటగిరి) శీలం సాయి చందు(71 కేటగిరి లలో సిల్వర్ పతకాలు సాధించారు. 78 కేటగిరి లో గొంప. రాము బ్రోంజ, 88 కేటగిరిలో గొంప సాయి కిరణ్ బంగారు పతకాన్ని సాధించారు. 94 కేటగిరిలో కే లక్ష్మీ గణేష్ బంగారు పథకాన్ని సాధించారు. ఈ జిమ్ కేంద్రం లో ఏడు బంగారు, నాలుగు సిల్వర్, బ్రోనజ్ ఒక పతకాన్ని సాధించటం పట్ల కోచ్ గంగాధర్ ను రాజమండ్రిలో సన్మానించారు. శ్రీ వీరభద్ర పవర్ జిన్ విద్యార్థులు పత కాలను సాధించినందుకు గ్రామస్తులు గంగాధర్ ను ప్రశంసించారు.




# పగలు రాత్రి రోడ్లపైనే పశువులు.. అధికారుల ఆదేశాలు భేకాతర్



**వై రామవరం, పెన్ పవర్, జులై 7 :** అధికారుల ఆదేశాలను పట్టించుకోకుండా పగలు రాత్రి అనే తేడా లేకుండా పశువులు రోడ్లపైనే ఉంటున్నాయని స్థానికుల ఆరోపిస్తున్నారు. సోమవారం దండోరా వేయించిన రైతులలో చలనం లేకపోవడంతో యధావిధిగా పశువులు రహదారులపైనే ఉన్నాయని తెలిపారు. అధికారుల ఆదేశాలు క్రింది స్థాయి సిబ్బంది పాటించిన పశువులు గల రైతులు పట్టించుకున్న దాఖలాలు లేవని అంటున్నారు. ఊరూర దండోరాలు వేయించిన, పశువులు కట్టని రైతులకు 500 రూపాయలు జరిమానా వేయించడం జరుగుతుందన్న రైతన్నలు పట్టించుకున్న దాఖలాలు లేవని అంటున్నారు. పగలు రాత్రులు అనే తేడా లేకుండా పశువులు రోడ్లపై ఉంటూ వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని అంటున్నారు.రాత్రులు పశువులను కట్టకపోవడంతో ఈ వ్యవసాయ సీజన్లో నేటికీ వరి ఆకుమడులు వేయలేక పోతున్నామని రైతులు వాపోతున్నారు. పశువులు గల రైతులను కట్టమంటుంటే తమపై దాడి చేయడానికి ప్రయత్నిస్తున్నారని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సచివాలయంలో ఉన్న సిబ్బంది రైతులకు అవగాహన కల్పించి పశు వులను కట్టే విధంగా చర్యలు తీసుకోవలసిన బాధ్యత ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.



## సుపరి పాలనలో తొలి అడుగు విజయవంతం
### తల్లికి వందనం, సూపర్ సిక్స్ పట్ల ప్రతి ఇంట హర్షం





**చింతూరు, పెన్ పవర్, జులై 7 :** ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం కోసం మంత్రులు, యం యల్ ఏ లు, నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లోకి వెళ్లి ఏడాది పాలనలో ఏ పి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సూపర్ సిక్స్ పథకాలు, తల్లికి వందనం వంటి కార్యక్రమాల గురించి ప్రతి ఇంటికి కి వెళ్లి ప్రజలకు వివరిస్తున్నారు. అది పార్టీ అధినేత ఆదేశం. దాంతో అన్ని గ్రామాల్లో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటి ఇంటికి టీడిపి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రంపచోడవరం యం యల్ ఏ మీరియాల శిరీష దేవి, మఠం విజయ్ భాస్కర్ అదేశాల మేరకు సోమవారం ఛత్తీస్ ఘడ్ సరిహద్దు లను ఆనుకోని ఉన్న చింతూరు మండలంలోని ఏడుగురాళ్లపల్లి, పేగ పంచాయతీ ల పరిధిలోని మారుమూల గ్రామలైన పావురు లంక, డి జగ్గారం, పేగ అల్లిగూడెం, మల్లంపేట, గ్రామాల్లోని బూత్ 31, 32, 33, 34, 35 ల్లో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యం.డి జహంగీర్ నేతృత్వంలో ఇంటి ఇంటికి టీడిపి కార్యక్రమం నిర్వహించారు. ఏ ఇంటికి వెళ్లిన తల్లికి వందం డబ్బులు వచ్చాయని, టీడిపి పాలన బావుందని, చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అందించటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంకు భిన్నంగా పింఛన్ రూ. 4000 అందింది అని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రములో టీడిపి నాయకులు సొసైటీ అధ్యక్షులు చిట్టీ బాబు, సల్మాన్ రాజు, వార్త విలేకరి జానీ, అనిగి చంద్రయ్య, మడకం వెంకయ్య, సోడే శ్రీను, మడకం రఘూ, జోగారావు, రఫీ, మోహన్, శ్రీను, కుంజా రమేష్, పొడియం రమేష్, స్వామి, అనిత, కుంజా రఘు, చల్ల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నూతన మండల కన్వీనర్‌కు అభినందన



**మండపేట. పెన్ పవర్.జులై 7 :** కపిలేశ్వరపురం మండల వైసీపీ కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తాతపూడి గ్రామ అధ్యక్షుడు గూటం సత్యనారాయణకు ఆ పార్టీ శ్రేణులు అభినందనలు తెలియజేశాయి. మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆశీస్సులతో ఎంపికైన ఆయన నియామకం పట్ల తమ హర్షాన్ని వ్యక్తం చేస్తూ ఆ పార్టీ నాయకులు పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన జడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు మాట్లాడుతూ దళితులకు రాజకీయంగా సముచిత స్థానం ఇవ్వడంలో వైఎస్ఆర్‌సీపీ ముందుంటుందన్నారు. సత్యనారాయణ ఎంపిక అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి అందరం తోట త్రిమూర్తులు నాయకత్వంలో కృషి చేస్తామని అన్నారు. ఎంపీపీ మేడిశెట్టి సత్య వేణి దుర్గారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదలను మోసం చేసి అనేక వాగ్దానాలను విస్మరించిందన్నారు. వైసీపీ కార్యకర్తలను వేధింపులకు గురి చేస్తూ పైశాచిక ఆనందం పొందుతుందని విమర్శించారు. అయినా ఏమీ భయపడేది లేదని కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. నూతన కన్వీనర్ సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడిని కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తోట త్రిమూర్తులు నాయకత్వాన్ని బలపరచడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అడ్డాల శ్రీనివాస్, పలివెల మధు, సర్పంచ్ వాసంశెట్టి విష్ణు, పబ్లిసిటీ విభాగ కన్వీనర్ వంగా నల్లశ్రీను, నాయకులు కట్ట మురళి, పీతల బంగారం, అరిగెల సంబులింగం, రాయుడు జగపతి, పేరా బత్తుల రామకృష్ణ, కందుకూరి సత్యం, గేద్దాడ రామకృష్ణ, మేడిశెట్టి త్రిమూర్తులు, మాత నాగేష్, నేలపూడి శ్రీను, పాలింగి శ్రీను, పట్నాల సత్యనారాయణ, కురుపూడి ఉదయ శ్రీనివాస్, గోవిందు, పాలింగి కృష్ణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మంద కృష్ణమాదిగ పుట్టినరోజు వేడుకలు

### -ముఖ్యఅతిథిగా హాజరైన తుమ్మలపల్లి రమేష్



**కిర్లంపూడి, పెన్ పవర్, జులై 7 :** కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలో కిర్లంపూడి మండలం ఎమ్మార్పీ ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు సోమ వారం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకులు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొని మందకృష్ణ మాదిగ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మందకృష్ణ మాదిగ పోరాటాన్ని గుర్తించి ఇటీవలే పద్మశ్రీ పురస్కా రాన్ని అందజేసిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణ శేఖర్,మాదిగ దండోరా నాయకులు తాతపూడి సింహాచలం, మాజీ సర్పంచ్ తాతపూడి అప్పయమ్మ,కాకడ కృష్ణమ్మ, కాకడ సత్యనారా యణ, దార చిన్నయ్య, గంధం రాఘవ,మంద నూకరాజు, దిగుమతి యేసురాజు,ఉప సర్పంచ్ రేవూరి శ్రీను,రేపల్లె వెంకటలక్ష్మి, తామరాడ, గోనేడ, సోమరాయణంపేట, పాలెం గ్రామ ఎమ్మార్పీఎస్ నాయకులు హాజరయ్యారు.

## నిధుల దుర్వినియోగంపై పోతులూరు సర్పంచ్‌కుచెక్ పవర్ రద్దు

- పీజీఆర్ఎస్ ఫిర్యాదుతో స్పందించిన అధికారులు
- 3 నెలలు చెక్ పవర్ రద్దు చేస్తూ డీపీఓ ఉత్తర్వులు




**ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై 7 :** ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై ప్రత్తిపాడు మండలం పోతులూరు గ్రామ సర్పంచ్ బొండు రాంబాబు చెక్ పవర్‌ను మూడు నెలల పాటు రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి వి. రవికుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధుల ఖర్చుపై సరైన బిల్లులు, ఖర్చుల ఆధారాలు లేకపోవడంతో పాటు, గతంలో ఇచ్చిన షోకాజ్ నోటీసుకు సమాధానం ఇవ్వకపోవడమే దీనికి కారణంగా అధికారులు తెలిపారు. గ్రామానికి చెందిన బర్ల చక్రం, పంచాది వీరబాబు పీజీఆర్ఎస్ వేదిక ద్వారా ఫిర్యాదు చేయగా, డిఎల్పివో ఆధ్వర్యంలో విచారణ చేపట్టి నివేదికను అందించారు. దాంతో, వెంటనే చర్యలు తీసుకుంటూ సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేశారు. పరిపాలనా విభాగంలో నిర్బంధం రాకుండా ఉండేందుకు డిప్యూటీ ఎంపీడీవో కెవివిఎస్ కాశీ విశ్వనాథంకు తాత్కాలిక చెక్ పవర్ అప్పగించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇక ఈ వ్యవహారంలో పనిచేసిన ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు బి. శ్రీనివాస్, బి.కామరాజు, బి.నాగమణి పాత్రపై కూడా విచారణ కొనసాగుతున్నట్టు సమాచారం.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

## జనహృదయాలను తాకిన వేడుక

- మల్లిపూడిలో మాదిగ జాతి గౌరవోత్సవం



**పెనుమంట్ర,పెన్ పవర్, జూలై 07 :** మండలం మల్లిపూడి గ్రామం నందు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కాపా ఇస్సా ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వారసత్వంగా సాగుతున్న హక్కుల పోరాటానికి మరో కొత్త ఊపిరి... సామాజిక సమానత్వ గమ్యానికి మరో చైతన్యయాత్ర మల్లిపూడి గ్రామం చరిత్రలో మైలురాయిగా నిలిచే రోజు అది. మాదిగ వర్గ గౌరవ పోరాటానికి ప్రతీకగా నిలిచిన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామస్థాయిలో భవ్యంగా నిర్వహించారు. ఈ వేడుకలు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా మరింత వైభవంగా సాగాయి.ముఖ్య అతిథిగా హాజరైన యువ నాయకులు పితాని వెంకట్ గ్రామ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. యువతతో కూడిన మానవహారాన్ని తలపించే ర్యాలీ గ్రామ వీధుల్లో ఊహించని ఉత్సాహాన్ని నింపింది. నినాదాలు, జెండాలు, భావోద్వేగాలు-ప్రతీ ఒక్కటి సామాజిక ఉద్యమ చైతన్యానికి నిదర్శనం అయింది. ఈ సందర్భంగా పితాని వెంకట్ మాట్లాడుతూ కార్యకర్తల అంకితభావం ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంది. జాతి గౌరవం కోసం ఇంతలా నిలబడే సామూహిక స్ఫూర్తి అరుదైనదని పలువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ ఉద్యమం మాదిగల సమానత్వానికి నిలువెత్తు సాక్ష్యం. ఇది మాదిగ జాతికి గర్వకారణం మాత్రమే కాదు, భవిష్యత్ తరాలకు మార్గదర్శక ఉదాహరణ అయన అన్నారు. సభా కార్యక్రమంలో అనేకమంది యువత, పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. మాదిగ జాతి సమూహ చైతన్యానికి ఇది మరో తేజోవంతమైన అడుగు అని గ్రామస్థులు అన్నారు. సమాజంలో వివక్షను అధిగమించి గౌరవంతో బతికే జీవన యాత్రకు ఇలాంటి కార్యక్రమాలు స్ఫూర్తినిస్తాయని ప్రతి భక్తితో ఈ వేడుకలు ముగిశాయి. ఈ కార్యక్రమం లోఎమ్.ఎస్.పి. జిల్లా అధ్యక్షులు పలివెల పైడియ్య మాదిగ, టీడీపీ యువ నాయకులు సిర్రా బాలాజీ, కనపల చిన్న సుందరరావు, ఈ. జాన్ బాబు, ఎ.శ్రవణ్, యు సురేంద్ర, కె.దాసు, టీ.నాగరాజు, ఆర్. ప్రసాద్, టి.ఏసు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ పని తీరుపై ప్రజల్లో సంతృప్తి

- ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం, పెన్ పవర్, జులై 07 :** కూటమి పాలనలో అమలవుతున్న సంక్షేమం, జరుగుతున్న అభివృద్ధిపై ప్రజల్లో సంతృప్తి కనబడుతుందని స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు.సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో సోమవారం మండల కేంద్రం గోకవరంలో ఎమ్మెల్యే పాల్గొని గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఏడాది సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలను పంపిణీ చేశారు .రాష్ట్రంలో, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ప్రజలతో మాట్లాడారు.ప్రజలకు అందుతున్న సంక్షేమం, జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ వైసీపీలా తమది పరదాల పాలన కాదని, ప్రజాపాలన అని తెలిపారు.అభివృద్ధి సంక్షేమం సమపాళ్లలో ముందుకు తీసుకెళ్లే సత్తా ఒక్క చంద్రబాబుకే సాధ్యమని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. తొమ్మిది లక్షల కోట్లతో కంపెనీలతో ఎంఓయు లు ప్రభుత్వం చేయడం జరిగిందన్నారు.ఒకేసారి 4 వేలకు పెన్షన్ పెంచడం,ఉచితంగా గ్యాస్ సిలిండర్లు, ఒకేసారి 67 లక్షల మందికి తల్లికి వందనం పథకం ద్వారా 13 వేల రూపాయలు ఇవ్వడం జరిగిందన్నారు.ఈ నెలలోనే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు అవుతుందని, ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం కానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గతంలో ఇంటిలో చదువుకున్న వారికి ఒక్కరికే నగదు ఇచ్చారని కానీ కూటమి ప్రభుత్వంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తున్నామని చెప్పారు.జగ్గంపేట నియోజవర్గలో విద్య, వైద్యం, ఉపాధి, నీటి ప్రాజెక్టులపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని, వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో అమలుచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, ప్రజల కళ్ళలో ఆనందం కనబడుతుందని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## రేఖపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

-సిపిఎం పార్టీ నాయకులు ఆదివాసి గిరిజన సంఘం







**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై. 7 :** మండలంలోని రేఖపల్లి తహసిల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సిపిఎం పార్టీ నాయకులు ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ముంపుతో సంబంధం లేకుండా రైతులకు సబ్సిడీ విత్తనాలు ఎరువులు ఇవ్వాలని అన్నదాత సుఖీభవ పథకం వర్తింపచేయాలని,కటాఫ్ డేట్ తో సంబంధం లేకుండా 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులకు ఆర్.అండ్.ఆర్. ప్యాకేజీ పునరావాసం కల్పించాలని, కోరారు. రేఖపల్లి, అన్నవరం, ఉమ్మడివరం గుర్రంపేట, నూతిగూడెం, చిన్నమట్ట పల్లి,సున్నంవారి గూడెం,మొద్దుల గూడెం,జల్లివారి గూడెం,రెడ్డిగుంపు తదితర గ్రామాలను ముంపు జాబితాలో చేర్చి సర్వే చేయాలని,స్థానిక తహసీల్దార్, ను కోరారు. 41:15 కాంటూరు పరిధిలోని గ్రామాలకు కేటాయించిన పునరావాస కాలనీలు భైరవపట్నం, కన్నాయిగూడెం, రాంగోపాల్ పురం, తాడువాయి, విస్సాపురం, రామన్న గూడెం తదితర కాలనీలలో కొన్ని సౌకర్యాలు ఇంతవరకు కల్పించలేదని, రహదారులు,డ్రైనేజీ,త్రాగునీరు తో పాటు మిగిలి పోయిన గృహాలను నిర్మించవలసి ఉందని ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకుని అన్ని సౌకర్యాలు కల్పించాలని, డిమాండ్ చేశారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన మెమోరాండం స్థానిక తాసిల్దార్,కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్,జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు,ఎంపీపీ కారం లక్ష్మి, ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్,కారం సుందరయ్య, మండల కమిటీ సభ్యులు పో డియం శ్రీరామమూర్తి తోడం రాజు,వడ్లాది రమేష్,గుండుపూడి లక్ష్మణ రావు, కమ్మసిచ్చు సత్యనారాయణ,పులి బుజ్జి ,కారం సత్తిబాబు, సీరపు తాతబాబు,గొర్రె రాజు,పీసా నాయకులు వేటకాని సూరి బాబు, సారా పాండురాజు,కారం రాముడు,అనిల్, గొంది దారయ్య, ఖాదర్,వివిధ గ్రామాల రైతులు యువతీ యువకులు పాల్గొన్నారు.

లింగంపర్తిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో

## ఘనంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు

**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 7 :** మండల పరిధి లింగపర్తి గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 60 వ జన్మదిన వేడుకలను ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనంతారపు రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఎన్డీఏ కూటమి నాయకులు హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 వసంతాలు పూర్తి చేసుకుని 31వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానిక పార్టీ నాయకుల సమక్షంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న పిల్లలు నాయకులు మాట్లాడుతూ 30 సంవత్సరాల ఉద్యమములో మందకృష్ణ మాదిగ అలుపెరగని పోరాటం చేసారు.మాదిగల హక్కుల సాధన కోసమే ఏర్పడిన మాదిగ దండోరా సమాజంలో అన్ని కులాలకు ఆరోగ్యశ్రీ , వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, రేషన్ బియ్యం పెంపు ఇలా ప్రభుత్వాల ప్రవేశపెట్టిన అన్ని పథకాల సాధనకు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితాలే అన్నారు. సమాజం లో అణగారిన వర్గాలకు న్యాయం జరిగే విధంగా ఎమ్మార్పీఎస్ మందకృష్ణ మాదిగలు పోరాటం చేయటం జరిగిందని అన్నారు. సమాజం కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా సామాజిక విభాగంలో పద్మశ్రీ అవార్డు ఇవ్వటం యావత్ మాదిగ జాతికి వచ్చిన అవార్డుగా మందకృష్ణ మాదిగారు చెప్పడం జరిగిందని జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు అనంతరపు రాజు అన్నారు.గత 30 సంవత్సరాల వర్గీకరణ పోరాటం ఎన్నో ఆటు పోటులకు నిలబడి ఉద్యమ నాయకుడిగా ఏ రాజకీయ పార్టీకి



తలవంచకుండా ఈ రోజున ఈ స్థాయిలో జాతి నిలబడటంగర్వ కారణమని జాతికి ఇంత గౌరవం తీసుకొచ్చిన మహోన్నత వ్యక్తికి మందకృష్ణ మాదిగ అని కొనియాడారు. అనంతరం లింగంపర్తి నుండి ఏలేశ్వరం వరకు బైక్ ర్యాలీగా వెళ్లి బాలాజీ చౌక్ సెంటర్లో మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ జడ్పిటిసి జ్యోతుల పెదబాబు, ఎస్ జి వి సుబ్బరాజు , చిక్కాల లక్ష్మణరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సెల్ నాయకులు నూకతాటి ఈశ్వరరావు, జనసేన నాయకుడు పెంటకోట మోహన్, లింగంపర్తి గ్రామ సర్పంచ్ యార్లగడ్డ చంద్రలేఖ లీలావతి , ఎంపీటీసీ సభ్యులు తెలుగుదేశం పార్టీ మండల యువజన అధ్యక్షుడు పెంటకోట శ్రీధర్, బాబు జగజ్జీవన్ రావు యూత్ ఏలేశ్వరం వైస్ చైర్మన్ మసిరపు నాగేశ్వరరావు బుజ్జి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొల్లి ఏసుబాబు, ఎమ్మార్పీ సీనియర్ నాయకులు శశి వెంకటేష్, విప్పర్తి వెంకన్న, పలు గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకులు, యువత వేడుకల్లో పాల్గొన్నారు.

## రాజుపాలెం-రామవరం రహదారి నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి

- సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర డిమాండ్





**కిర్లంపూడి పెన్ పవర్, జూలై 7 :** కిర్లంపూడి మండలం రాజుపాలెం నుండి రామవరం వరకు నత్త నడకన సాగుతున్న ఆర్ అండ్ బి రహదారి నిర్మాణం తక్షణమే యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సామాజిక ఉద్యమకారుడు పాతంశెట్టి సూర్యచంద్ర డిమాండ్ చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మారుమూలనఉన్న రహదారులు సైతం అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు.

రాజుపాలెం నుండి రామవరం వరకు ఉన్న ఆర్ అండ్ బి రహదారి నిర్మాణం కూడా యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం చేపట్టాలని పాటంశెట్టి సూర్యచంద్ర పాలకులను,అధికారులను కోరారు. రాజుపాలెం నుండి రామవరం వరకు 15 కిలోమీటర్ల ఆర్ అండ్ బి రహదారి నిర్మాణానికి 2022వ సంవత్సరంలో గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేసి పనులు మొదలుపెట్టిందన్నారు. అప్పటి నుండి రోడ్డు నిర్మాణం నత్త నడకన సాగిందని 20 శాతం పనులు కూడా పూర్తి చేయలేదన్నారు.

కూటమి ప్రభుత్వం ద్వారా ఈ రహదారికి మోక్షం లభిస్తుందని గత సంవత్సర కాలంగా ప్రజలు ఎదురుచూస్తున్నా నేటి వరకు రహదారి నిర్మాణ పనులు మొదలు పెట్టలేదని సూర్యచంద్ర ఆరోపించారు.రెండు సంవత్సరాల క్రితం రహదారి పనులు తొందరగా చేయాలని అడుగుకోగొయ్యి, గజానికో గుంత కార్యక్రమం ద్వారా నాటి ప్రభుత్వం మీద అనేక నిరసన కార్యక్రమాలు చేశామన్నారు. నేటి కూటమి ప్రభుత్వం ఈ రహదారిని తొందరలో నిర్మించకపోతే సంబంధిత గ్రామ ప్రజలతో నిరసనలు,ఆందోళన కార్యక్రమాల ద్వారా ప్రభుత్వాన్ని మేల్కొల్పుతామని పాటంశెట్టి సూర్యచంద్ర ప్రభుత్వానికి ముందస్తుగా తెలియజేశారు.

## నిర్వాసితులు ఎవరు అధైర్య పడవద్దు : ఎమ్మెల్యే శిరీష దేవి





**కూనవరం,పెన్ పవర్,జూలై 7:** సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే మిర్యాల శిరీషాదేవి కాచవరం, చూచిరేవుల గూడెం,పల్లూరు, టేకులబోరు,కూనవరం గ్రామాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రతి నిర్వాసితుడికి న్యాయం జరుగుతుందని ఇప్పటికే పునరావాసకాలనీల పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎవరూ అధైర్య పడవద్దు అని అన్నారు.అందరికీ పూర్తి పరిహారం, పునరావాసం కల్పించిన తర్వాతే తరలించడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు.పర్యటనలో భాగంగా కోతుల గుట్ట నందు ఉన్న సొసైటీ ఆఫీస్ నందు ఎరువులను రైతులకు పంపిణీ చేసి,ప్రభుత్వ హాస్పిటల్ హెూటల్ ను సందర్శించి రోగులతో మాట్లాడారు. రానున్న వరదలను దృష్టిలో పెట్టుకొని హాస్పటల్ నందు మందులన్నీ ఉండాలని లేవు అనే మాట రాకూడదని హాస్పిటల్ సూపర్డెంట్ మహేష్ కు సూచించారు.

అనంతరం శబరి నది బ్రిడ్జి పై నుంచి వరద పరిస్థితిని సమీక్షించారు.వరదల్లో అధికారులు అంతా సమన్వయంతో పని చేయాలని ఎలాంటి ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆమె తాసిల్దార్ శ్రీనివాసరావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మఠం భాస్కర్, ఎడవల్లి భాస్కరరావు, చెలికాని ఉమా,గడ్డిపాటి ప్రసాద్,గడేసుల రంజిత్ కుమార్,ఎచ్చు రాము, నోముల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చూసి అసూయతోనే బురద జల్లే ప్రయత్నం : టీడీపీ నేతలు



**గంగవరం, పెన్ పవర్, జూలై 7 :** రంపచోడవరం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి అసూయ తోనే ఎమ్మెల్యే పై వైసీపీ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని టిడిపి పార్టీ మండల అధ్యక్షుడు పాము అర్జున్, రాష్ట్ర రైతు సెల్ కార్యదర్శి కనిగిరి రాంబాబు, మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, ఎంపీటీసీ పండా ఆదినారాయణ తదితరులు అన్నారు . సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమాలను చూడలేక మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి మా ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి పై అసత్య ఆరోపణలు చేస్తూ బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019 నుండి 2024 వరకు ఆమె చేసిందేమీ లేని అభివృద్ధి గురించి ఇప్పుడు మాటలు చెప్పే అర్హత ధనలక్ష్మి కి లేదని, అవినీతికి కేర్ ఆఫ్ అడ్రస్ వైసీపీ నాయకులేనని విరుచుకుపడ్డారు.తాజాగా వ్యవసాయ శాఖ అధికారులపై మాజీ ఎమ్మెల్యే చేసిన ఆరోపణలు కూడా తప్పుడు వని, నిజానికి ఒక వ్యవసాయ అసిస్టెంట్ పై గ్రామస్తులే పోలీస్ స్టేషన్ కి ఫిర్యాదు చేశారని, అంశాన్ని తెలుసుకోకుండా చేసినట్టు మాట్లాడడం సరికాదని అన్నారు. “మాకు లంచాలు తీసుకొని ఉద్యోగాలు ఇచ్చే సంప్రదాయం లేదు. దళితులను వేధించే, దళిత డాక్టర్ సుధాకర్ ని చంపే రీతీ మాకు లేదు. పోలవరం, రాజధాని నిర్మాణాలను అర్ధాంతరంగా నిలిపే చేతులెత్తే పరిస్థితి మాకు రాదు. అభివృద్ధి అంటే అది తెలుగుదేశం పార్టీదే,” అని నేతలు స్పష్టం చేశారు. “అమరావతి, పోలవరం వంటి రాష్ట్రానికి ప్రాణాధారమైన ప్రాజెక్టులను నిర్మించే శక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే ఉందన్నారు. రంపచోడవరం అభివృద్ధి కోసం మా ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి చేస్తోన్న అభివృద్ధిని మాజీ ఎమ్మెల్యే చేయలేకపోయారు. కాబట్టి ప్రజలు ఏది నిజమో తెలుసుకుని తగిన సమయంలో తగిన బుద్ధి చెబుతారు,” అని అన్నారు.ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి దుమ్ముల భాను ప్రకాష్, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి పామర్తి వీరబాబు, మాజీ ఎంపీటీసీ కొసు బుల్లియమ్మ, గ్రామ కన్వీనర్ శారపు సత్యవేణి, కొమ్మనా చిన్నారావు, నియోజకవర్గ ఎస్టీ సెల్ నాయకులు మడకం రామారావు, ఎస్టీ సెల్ అధ్యక్షులు సింహాద్రి రాంబాబు, గ్రామ కో-కన్వీనర్ గానుటూరి నాగేశ్వరావు, మండల కో-కన్వీనర్ సాగర్, కమ్మరి రాంబాబు, రాజు కుమార్, బుల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

## తొలి అడుగులో ఇంటింటా పలకరింపులు

6వ రోజు కొనసాగిన ఎమ్మెల్యే వేగుళ్ల పర్యటన



**మండపేట. పెన్ పవర్.జూలై 7 :** సుపరిపాలనలో భాగంగా జరుగుతున్న తొలి అడుగు కార్యక్రమం 6వ రోజు కూడా విజయవంతంగా కొనసాగింది. మండపేట ఎమ్మెల్యే, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు సోమవారం రాయవరం మండలం పసలపూడి, మండపేట మండలం తాపేశ్వరం, మండపేట పట్టణంలోని 16వ వార్డు, గొల్లపుంత కాలనీలో కూటమి నాయకులతో కలిసి ఇంటింటా పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కూటమి పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమం అందుతున్న తీరును పరిశీలించారు. ప్రజలు ఆప్యాయంగా స్వాగతం పలకడంతో పర్యటన ఉత్సాహంగా సాగింది. ఇంటింటా తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా కొన్ని సమస్యలకు వెంటనే పరిష్కారం చూపిస్తూనే, కొన్నిటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపించాలని సూచించారు. కార్యక్రమంలో టీ ఎన్ టీ యూ సీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు, టీడీపీ నాయకులు మెడింటి సూర్య ప్రకాశరావు, మద్దాల శ్రీనివాస్, గంటి రమణ, కర్రి తాతారావు, సిద్దిరెడ్డి రామన్న, కట్టుమేను వీర్రాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలకు వంద మీటర్ల లోపు

## పొగాకు ఉత్పత్తులు అమ్మరాదు

- జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాధరావు




**జగ్గంపేట, పెన్ పవర్, జూలై7 :** జగ్గంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో విద్యాసంస్థలకు వంద మీటర్ల లోపు ఉన్న షాపుల్లో ఎటువంటి పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు చేపట్టరాదని జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాధరావు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థల దగ్గర పాన్, ఫ్యాన్సీ దుకాణాలు ఉన్నాయని వాటిల్లో సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు అమ్మినట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యాసంస్థల వద్ద వీటిని అమ్మితే విద్యార్థులు వాటికి లోబడి తమ జీవితాలు నాశనం చేసుకుంటారన్నారు. షాపు యజమానులు సైతం ఈ విషయాన్ని గమనించి పొగాకు ఉత్పత్తులు అమ్మకుండా ఉండాలన్నారు. పాఠశాలల వద్ద ఉన్న షాపులను తనిఖీ చేస్తామని ఎక్కడైనా పట్టుపడితే చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులంతా బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చెడు వ్యసనాల బారిన పడరాదని ఎస్ఐ రఘునాధరావు పేర్కొన్నారు.

## గంగవరంలో సుపరిపాలనలో తొలి అడుగు

### గంగవరంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాల పంపిణీ



**గంగవరం, పెన్ పవర్, జూలై 07 :** రాష్ట్రంలో సుపరి పాలనలో – తొలి అడుగు కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆరవ రోజు రంపచోడవరం నియోజకవర్గం గంగ వరం మండలం గంగవరం పంచాయతీ పరిధిలోని గంగవరం గ్రామంలో కొనసాగింది. టిడిపి నాయకులు కార్యకర్తలు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పరిపాలనలో ఏడాది కాలంలో సాధించిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల వద్దకు కరపత్రాలను అందిస్తూ, ప్రతి ఇంటి సమస్యలు తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించి, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బూత్ ఇంచార్జ్ సారపు సత్యవేణి, మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, పార్టీ ముఖ్య కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు సమస్యలు, అభ్యర్థనలు తమ ముందు ఉంచగా, వాటిని సమీక్షించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి పరిష్కరించనున్నట్లు హామీ ఇచ్చారు.

## ఎంఆర్పిఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం

### పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పోరాటాలకు గౌరవ నివాళి



**పెనుమంట్ర, పెన్ పవర్, జూలై 07 :** మండలంలోని పోడూరు గ్రామం కుమ్మరి గుంట నందు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామ అధ్యక్షుడు కండెల్లి సునీల్ బాబు అధ్యక్షతన ఎంఆర్పిఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం జన్మదిన వేడుకలు గ్రామంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ముఖ్య అతిథిగా ఎంఎస్పి జిల్లా గౌరవ అధ్యక్షులు కనపాల పెద్దిరాజు మాదిగ హాజరై ప్రసంగించారు. ఈ రోజు మనకు గర్వకారణంగా ఉంది. మందకృష్ణ మాదిగ గారి దీర్ఘకాలిక ఉద్యమాల ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధ్యమైంది. ఆయన పోరాటం వల్ల ఆరోగ్యశ్రీ పథకం, వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు పెన్షన్ పెంపు వంటి అనేక విజయాలు సాధించగలిగాం. ఈ ఉద్యమాలు సామాజిక న్యాయం సాధనలో మైలురాయిలుగా నిలిచాయి" అని పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జి ఆకుమర్తి పెద్దిరాజు మాదిగ మాట్లాడుతూ సభలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ మందకృష్ణ మాదిగ నాయకత్వాన్ని కొనియాడుతూ, భవిష్యత్తులో కూడా ఆయన మార్గదర్శనంలో ముందుకు సాగాలని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ ఇన్ఛార్జి టి. శేఖర్ మాదిగ, తానేటి ఏసు మాదిగ, కె. జయశేఖర్ మాదిగ, చదలవాడ సత్యనారాయణ మాదిగ, చదలవాడ ప్రసాద్ మాదిగ, తొత్తరమూడి చైతన్య మాదిగ, అయినపూడి భాను మాదిగ, చితగుల్లబాలు మాదిగ, కడిమి సుధీర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## సేవ కేంద్రం ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు

### గంగవరం ఎస్బిఐ మేనేజర్ రత్నరాజు



**గంగవరం, పెన్ పవర్, జూలై 7 :** ఎస్బిఐ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడం లక్ష్యంగా భారతీయ స్టేట్ బ్యాంక్ పనిచేస్తుందని గంగవరం బ్రాంచ్ మేనేజర్ ఎస్ రత్నరాజు అన్నారు సోమవారం స్థానిక ఎస్బిఐ ఖాతాదారుల సేవా కేంద్రాన్ని ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు బ్యాంకు వేళాలతో పని లేకుండా అన్ని సమయాల్లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఎస్బిఐ ఖాతాదారుల సేవా కేంద్రం ద్వారా వినియోగదారులకు బ్యాంకింగ్ సేవలను అందుబాటులో ఉంచామని వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సేవా కేంద్రం ద్వారా సాధారణ బ్యాంకింగ్ సేవలే కాకుండా ఖాతాదారుల రక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న పలు బీమా పథకాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్యాష్ ఆఫీసర్ శ్రీనివాస్ ఖాతాదారుల సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఎంఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



**పెనుమంట్ర, పెన్ పవర్, జూలై 7 :** పెనుగొండ మండల ప్రధాన గ్రామం నందు ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పలివేల పైడియ్య మాదిగ మాట్లాడుతూ సుమారు 30 సంవత్సరాల కృషి ఫలితంగా వర్గీకరణ సాధించిన ఈ విజయాన్ని మనం జరుపుకోవాలి. ఇది మన ఉద్యమానికి, మాదిగ సామాజిక న్యాయ పోరాటానికి పెద్ద దిక్సూచి అని అన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ జన్మదినాన్ని కూడా సభలో ఘనంగా నిర్వహించడం సాగాయి. ఆయనకు పద్మశ్రీ పురస్కారం లభించడాన్ని వేదికపైకి వచ్చిన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తొత్తరాముడి శ్రీనివాస్ ఎంఆర్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. చెరుకువాడ, చిన్నవారిపాలెం, వడలి గ్రామాలకు చెందిన నాయకులు కూడా ఈ సభకు హాజరయ్యారు. సంఘాల నాయకులు విహెచ్పీఎస్‌కి చెందిన తానేటి చిన్న బుల్లి మాదిగ, ఎం.ఇ.ఎఫ్ నాయకులు లక్ష్మణ్, తానేటి శేఖర్ మాదిగ, రాపాక గాలి మాదిగ, పలివెల ప్రసాద్ మాదిగ, పలివెల సుధీర్ మాదిగ, పలివెల శ్రీను మాదిగ, కొడమంచిలి మధుబాబు, అయినవేల్లి వెంకటేశ్వరరావు, సుబ్బారావు, మంద శ్రీను, నవంబర్ సీతయ్య, కంకిపాటి శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## చాయ్ నుండి చాయ్ దునియా వరకు యువతకు ఆదర్శంగా నిలిచిన సాయి శిరసాని








**చింతూరు, పెన్ పవర్, జూలై 7 :** చిన్న వయసులోనే కుటుంబ బాధ్యతలు భుజాలపై వేసుకుని కష్టపడి ఎదిగిన యువకుడు శిరసాని సాయి. సంతల్లో షాప్ షాప్ కి తిరుగుతూ ఐదు రూపాయలకే వ్యాపారస్తులకు చాయ్ అందిస్తూ తన జీవితం ప్రారంభించిన ఈ యువకుడు, క్రమేపుగా స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకుని ఇప్పుడు చాయ్ దునియా పేరుతో స్వంత టీస్టాల్ ప్రారంభించాడు. కష్టకాలంలో తల్లిదండ్రులకు వెన్నుపూసల మాదిరిగా నిలిచిన సాయి, తన సంపాదనలో భాగాన్ని కుటుంబ ఖర్చులకు వినియోగిస్తూ, వ్యాపారం చేయాలనే దృఢ సంకల్పంతో ముందడుగు వేసాడు. వ్యాపారంపై ఉన్న ఆసక్తితో, అంచెలంచెలుగా అనుభవాన్ని పెంచుకుంటూ చివరికి తనకే సొంతంగా చాయ్ దునియా టీస్టాల్‌ను ప్రారంభించాడు. ప్రత్యేకంగా అలంకరించిన ఈ టీస్టాల్ చింతూరు ప్రాంతంలోని యువతలో చైతన్యం నింపుతోంది. ఇక్కడ రకరకాల టీలు, హాట్ డ్రింక్స్ అందుబాటులో ఉండటంతో పాటు, ఆకర్షణీయమైన వాతావరణం కస్టమర్లను ఆకట్టుకుంటోంది. స్థానిక యువతలో ఉత్సాహాన్ని రేకెత్తించేలా సాయి స్థాపించిన ఈ టీస్టాల్ ఆదరణ పొందుతోంది. కష్టాలను తట్టుకుని సాధించాలంటే మనసు ఉంటే చాలు అనే సందేశాన్ని తన జీవితం ద్వారా తెలియజేస్తున్న శిరసాని సాయి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.

## ఆంధ్రా అరుణాచలం భవిష్యత్తులో మరింత ఖ్యాతి పొందుతుంది : ఎమ్మెల్యే సత్యప్రభ

### - ఘనంగా 63 నాయనార్ల విగ్రహ ప్రతిష్ఠ - పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు





**ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై 6 :** ఆధ్యాత్మిక పవిత్రతకు నిలయంగా నిలుస్తున్న కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామంలో వెలసిన శ్రీ అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి ఆలయం సోమవారం మహా శివభక్తులతో కిటకిటలాడింది. ఆంధ్ర అరుణాచలంగా ఖ్యాతిగాంచిన ఈ పవిత్ర క్షేత్రంలో జరిగిన ప్రత్యేక హోమాలు, 63 మంది నాయనార్ల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలలో ముఖ్యఅతిథులుగా స్థానిక శాసనసభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా, జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు, ట్రస్ట్ సభ్యులు వీరిని సాదరంగా స్వాగతించి ఆశీర్వాదం అందించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హోమాలు, శివ పారాయణం, దేవతా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు భక్తిని పుట్టించేలా సాగాయి. ముఖ్యంగా 63 మంది నాయనార్ల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఈ మహానుభావుల జీవితాలను వివరించే పుస్తకాన్ని విడుదల చేయడం మరో ముఖ్య ఘట్టంగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మాట్లాడుతూ "ఇటువంటి పవిత్ర ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని, రాచపల్లిలో ఉన్న అరుణాచలేశ్వర ఆలయం మహత్తరమైన ఆధ్యాత్మిక క్షేత్రంగా రూపుదిద్దుకుంటోందన్నారు. శివభక్తుల అంకితభావం వల్లే ఇలాంటి విస్తృత కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ విశ్వాసస్తులు, గ్రామస్తులు, భక్తులు, నియోజకవర్గాల నుండి వచ్చిన శివనుభావులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విశేష ఆధ్యాత్మికతతో కూడిన ఈ మహోత్సవం రాచపల్లికి కొత్త ప్రాచుర్యం తెచ్చిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

### - డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి - వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై7 :** కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలో తోటపల్లి, వెంకటనగరం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కార్యకర్తలు, ప్రత్తిపాడు ఎంపీపీ గొల్ల కాంతి సుధాకర్, పలువురు ఎంపీటీసీలు కిర్లంపూడి ముద్రగడ నివాసంలో గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ



గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా గ్రామాల్లో నాయకులు కార్యకర్తలు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ లో నిర్వహించే రక్తదాన శిబిరంలో పార్టీ శ్రేణులు,యువకులు దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరాపు గంగరాజు, ఎంపీటీసీ పినిశెట్టి ప్రకాష్, సింద్రపు భాస్కరరావు, యెనుముల దొరబాబు, ఏనుగు పెద్ద, తదితరులు పాల్గున్నారు.

## మన్యంలో ప్రతి చిన్నారి ఒక జ్యోతిబాయి సావిత్రి బాయి పూలేలు కావాలి

### గిరిపుత్రులకు కొండంత అండగా శ్రీనృసింహ సేవా వాహిని సంస్థ

### విద్యతోనే పేదరికం పోతుంది : డా. కృష్ణ చైతన్య స్వామి



**ఎటపాక ,పెన్ పవర్, జూలై 07 :** మన్యం లో అనేక సేవలు చేస్తున్న నృసింహ సేవా వాహిని సంస్థ గత కొన్ని సంవత్సరాలనుండి గిరిపుత్రులకు కొండంత అందగా నిలుస్తూ పేద బిడ్డలకు అక్షర జ్ఞానాన్ని అందిస్తున్నది. ప్రతి సంవత్సరం విద్యావికాసం అనే కార్యక్రమం ద్వారా కొన్ని వేల మంది చిన్నారులకు నోట్ బుక్స్ తో పాటు బ్యాగు లు ఇతర స్టేషనరి కిట్లు చేసి మన్యంలో పేద బిడ్డలకు ఓ వరం లా సేవలందిస్తున్నది శ్రీనృసింహ సేవా వాహిని. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు డా. కృష్ణ చైతన్య స్వామి మాట్లాడుతూ మన్యంలో అనేక గ్రామాలు ఇంకా వెనుకబడి ఉన్నాయని పేదరికం రూపుమాపే సాధనం విద్య అని విద్యతోనే అభివృద్ధి ఉంటుందనే సంకల్పం తో దారితెన్ను లేని మారు మూల పల్లెల్లో ఈ విద్యా సంవత్సరం సుమారు 1500 మంది చిన్నారులకు ఈ బ్యాగుల కిట్లను అందజేశామని అన్నారు. ఈరోజు చర్ల మండలం లోని బూరుగుపాడు, చింతగుప్ప, ఆర్ కొత్తగూడెం గ్రామాలతో పాటు దుమ్ముగూడెం మండలం కొత్తదుమ్ముగూడెం లో సైతం చిన్నారులకు ఈరోజు బ్యాగులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. మేము సమాజ శ్రేయస్సు కోసం పని చేస్తున్నామని మేము చేస్తున్న సేవలు కనీసం ఒక్క కుటుంబం లో వెలుగులు నింపినా చాలని, ఇలా ప్రతి కుటుంబం లో మార్పులు వస్తే జన్మనిచ్చిన నేలకు సేవలు చేశామనే మా సంకల్పం నెరవేరుతుందని కేవలం విద్య ద్వారానే పురోగతి ఉంటుందని ఒక పేదవాన్ని ఉన్నతునిగా చేసే సాధనం విద్య మాత్రమే నని అన్నారు. సమాజ సేవే లక్ష్యం గా సాగుతున్న మా సేవా ప్రపంచం లో ఎంతో మంది ప్రత్యక్షంగా పరోక్షంగా సేవలందిస్తూ తరిస్తున్నారని నిజంగా హరిజన గిరిజన పల్లెల్లో ప్రతినిత్యం శ్రీనృసింహ భక్త కుటుంబం చేస్తున్న సేవలు అమోఘం అని అన్నారు. ఇంత చక్కని సేవలు మన్యం లో అందిస్తున్న సంస్థ సభ్యులకు మన్యం బిడ్డలు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో సంస్థ వ్యవస్థాపకులు డా. కృష్ణ చైతన్య స్వామి, ట్రస్టీ శ్రీధర్ శర్మ, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వామపక్షాల సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మికుల బైక్ ర్యాలీ



**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 7 :** వామపక్షాలు జూలై 9నచేయ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం మండలంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలో పలు గ్రామాల్లో ప్రచార కార్యక్రమాల్లో భాగంగా సిపిఎం, సి ఐ టి యు, ఏఐసిసి టి యు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టారు. స్థానిక బాలాజీ చౌక్ సెంటర్లో బైక్ ర్యాలీ ప్రారంభిస్తూ సిపిఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు మాట్లాడుతూ నాలుగు కోడ్లు రద్దు చేయాలని, కనీస వేతనం 26,000, రైతులు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఆటో అమాలి భవననిర్మాణ ట్రాన్స్ పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు అనుబంధ క్వారీ లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జ్యోతుల సత్తిబాబు, కార్యదర్శి గొర్ల శివ, తోట రాంబాబు, పులగం కాటమస్వామి, సిఐటియు నాయకులు పిల్లా రాంబాబు, ఏఐసీసీ టి యు రాష్ట్ర నాయకుడు ఏగుపాటి అర్జున్ రావు, మండల నాయకుడు గుర్రం వీరబాబు, అంగన్వాడి మండల అధ్యక్షురాలు కె.సునీత, గండి వెంకట్రావు, బొడంపర్తి వీరబాబు, కార్మికులు తదితరులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

## నేడే ప్లాంటేషన్ కార్యక్రమం

**వై రామవరం, పెన్ పవర్, జూలై 7 :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమం నేడు మండల వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి కె బాపన్న దొర తెలిపారు. గ్రామీణ అభివృద్ధి కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలో 17 పంచాయతీలలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమంలో అందరూ విధిగా పాల్గొనాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ప్రజలు, ఉపాధి శ్రామికులు, గ్రామ పెద్దలు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కోరారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### రాజవరంలో డాక్టర్ నిడమర్తి చిన్నబాబు పిలుపు




**గంగవరం, పెన్ పవర్ ,జూలై 7 :** అల్లూరి సీతారామరాజు జిల్లా, గంగవరం మండలం, రాజవరం గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నిడమర్తి చిన్నబాబు ఆధ్వర్యంలో జరిగింది. గ్రామంలో దండోరా జెండాను ఆవిష్కరించి జాతి ఆత్మగౌరవానికి మరో మైలురాయిగా నిలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ నిడమర్తి చిన్నబాబు మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ సోదరుల జాతి కోసం గత 30 ఏళ్లుగా నిరంతరంగా సాగిస్తున్న పోరాటాన్ని స్మరించుకున్నారు. జాతి మనుగడ కోసం, హక్కుల సాధన కోసం మందకృష్ణ చూపిన దారిలోనే ప్రతి మాదిగ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇంకా పలు సమస్యలు ఎదుర్కొంటున్న మాదిగ సోదరుల సమస్యలను ఎప్పటికప్పుడు కృష్ణ దృష్టికి తీసుకెళ్తూ పరిష్కారానికి కృషి చేస్తున్న ఉత్తర కోస్తా ఆంధ్ర జిల్లాల కన్వీనర్ ముమ్మిడివరపు చిన్న సుబ్బారావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి మాల సోదరులకే పరిమితమై ఉండగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాదిగ జాతిని గౌరవించి జవహర్ ని ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమించడం హర్షణీయమని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ప్రభుత్వానికి, నేతలకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగవరం మండలంలోని మాదిగ సోదరులు, సోదరీమణులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి ఏటా జూలై 7వ తేదీని ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంగా ప్రతి గ్రామంలో ఘనంగా జరుపుకోవాలని, దండోరా జెండాను ఎగరవేయాలని డాక్టర్ నిడమర్తి చిన్నబాబు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## రైతు పక్షపాతి ప్రభుత్వం కూటమి ప్రభుత్వం

### గోస్తానీ నదిలో కిక్కేస తొలగింపు పనులకు శ్రీకారం



**పెనుమంట్ర, పెన్ పవర్, జూలై 07 :** గత సార్వ పంటలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని రైతులకు సాయం చేయాలని దృక్పథంతో మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చొరవతో జిల్లా వాటర్ డిస్ట్రిబ్యూటరీ సంఘం నిధులతో గోస్తానీ నదిలోని కిక్కీస తొలగింపు పనులకు తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తనయుడు వెంకట్ పనులకు శ్రీకారం చుట్టారు. వేల్పూరు నుండి మాముదూరు వరకు గోస్తాని నదిలో పెరిగిపోయిన కిక్కేసా గురపడేక్కులను తొలగించి ఎగువ నుండి దిగువకు మురుగునీరు వచ్చే విధంగా పనులు చేపడుతున్నామని ఈ పనులు పూర్తయితే గోస్తాని నది పరివాహక ప్రాంత పంట భూములు ముంపుకు గురయ్యే ప్రమాదం తప్పుతుందని తెలిపారు. ఇటీవల గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా రైతులు తమ గోడు విన్నవించుకున్నారని రైతు సమస్యల పరిష్కరించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యేలు కృషి చేస్తారని జిల్లా డిస్ట్రిబ్యూటరీ సంఘం చైర్మన మురళీ కృష్ణంరాజు అన్నారు. ఈరోజు వేల్పూరు లాకుల నుండి ఎస్.ఇల్లిందిరపర్రు వరకు గోస్తనది మేజర్ డ్రెయిన్ కిక్కిస తొలగింపు పనులు ప్రారంభించడం జరిగింది ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ మురళీకృష్ణ రాజు , నీటి సంఘ అధ్యక్షులు దొమ్మేటి భాస్కరరావు, వాటర్ డిస్టిబ్యూటరీ సంఘం అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి, ఇరిగేషన్ అధికారులు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కోటిపల్లి వద్ద గోదావరి తీరాన్ని పరిశీలించిన ఆర్డీవో అఖిల



**కె గంగవరం పెన్ పవర్ జూలై 7 :** కె గంగవరం మండలంలోని కోటిపల్లి–సుందరపల్లి మధ్య ఉన్న కుమ్మరి సావరం వద్ద గోదావరి నదికి ఆనుకుని ఉన్న ఏటిగట్టు గోదావరి కోతకు గురవుతుంది. ఈ నేపథ్యంలో కోటిపల్లి వద్ద ఏర్పాటుచేసిన తాత్కాలిక రక్షణ చర్యలను రామచంద్రపురం డివిజనల్ రివెన్యూ అధికారి (ఆర్డీవో) శ్రీమతి డి. అఖిల పరిశీలించారు. గోదావరి నీటి ప్రవాహం వలన ఎటిగట్టు నష్టం జరుగుతున్నదని గుర్తించిన అధికారులు, ప్రాధాన్యత నిస్తూ ఇసుక బస్తాలతో తాత్కాలికంగా గట్టు బలపరిచే చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సమీక్షించిన ఆర్డీవో అఖిల ఇరిగేషన్ శాఖ అధికారులకు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన రక్షణ చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రామ్మోహన్, పిడబ్ల్యూడి ఏఈ సుదర్శన్ సింగ్, ఆర్ ఐ ఎన్ వెంకటేశ్వరరావు, వీఆర్వో స్వామి నాయుడు, ఆనంద్ రాజు, పి సత్యనారాయణ రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు పరిసర గ్రామాల్లో నివసిస్తున్న ప్రజల భద్రతకు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

# ఎంఆర్పిఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం

### పద్మ శ్రీ మందా కృష్ణమాదిగ జన్మదిన వేడుకలు






**పెనుమంట్ర, పెన్ పవర్,జూలై 07 :** మండలం లోని ప కుమ్మరి గుంట, జగన్నాధపురం గ్రామం రాజేంద్ర నగర్, కవిటం పాటిమీద, పి. పోలవరం, రావిగొప్పు గ్రామాల నందు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆయా గ్రామ అధ్యక్షుల అధ్యక్షతన ఎంఆర్పిఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం మరియు జన్మదిన వేడుకలు గ్రామంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ముఖ్య అతిథిగా ఎంఎస్పి జిల్లా గౌరవ అధ్యక్షులు కనపాల పెద్దిరాజు మాదిగ హాజరై ప్రసంగించారు. ఈరోజు మనకు గర్వకారణంగా ఉంది. మందకృష్ణ మాదిగ గారి దీర్ఘకాలిక ఉద్యమాల ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధ్యమైంది. ఆయన పోరాటం వల్ల ఆరోగ్యశ్రీ పథకం, వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు పెన్షన్ పెంపు వంటి అనేక విజయాలు సాధించగలిగాం. ఈ ఉద్యమాలు సామాజిక న్యాయం సాధనలో మైలురాయిలుగా నిలిచాయి" అని పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జి ఆకుమర్తి పెద్దిరాజు మాదిగ మాట్లాడుతూ సభలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ మందకృష్ణ మాదిగ నాయకత్వాన్ని కొనియాడుతూ, భవిష్యత్తులో కూడా ఆయన మార్గదర్శనంలో ముందుకు సాగాలని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ ఇన్ఛార్జి టి. శేఖర్ మాదిగ, కండెల్లి సునీల్ మాదిగ, తానేటి ఏసు మాదిగ, కె. జయశేఖర్ మాదిగ, చదలవాడ సత్యనారాయణ మాదిగ, చదలవాడ ప్రసాద్ మాదిగ, తొత్తరమూడి చైతన్య మాదిగ, అయినపూడి భాను మాదిగ, చితగుల్లబాలు మాదిగ, కడిమి సుధీర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## మాది ప్రజా పాలన ప్రజలకు జవాబిదారిగా నిలుస్తాం : తనయుడు పితాని వెంకట్



**పెనుమంట్ర, పెన్ పవర్, జూలై 07 :** మాది ప్రజా పాలన, ప్రజలకు జవాబిదారిగా ఉండాలన్నదే మా లక్ష్యమని మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తనయుడు వెంకట సురేష్ అన్నారు. పెనుగొండ మండలం దొంగ రావిపాలెంలో సుపరిపాలనకు తొలి అడుగు కూటమి ప్రభుత్వం ఏడాదిపాలనపై గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ప్రజల అవసరాలను అడిగి తెలుసుకుంటున్నారు. రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమాన్ని ముందుకు నడిపిస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేసి తీరుతున్నామని అన్నారు. ఆగస్టు 15వ తేదీ నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి తీసుకున్నామని చెప్పారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమంది పిల్లలకు తల్లికి వందనం అమలు చేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గుత్తుల లోకేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జ మన్నె రమేష్, గ్రామ టిడిపి అధ్యక్షులు కడలి సత్యనారాయణ ఎంపీటీసీ పితాని శేఖర్ బాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# నిత్యాన్నదానంనకు లక్ష విరాళం



**అమలాపురం /సఖినేటిపల్లి, పెన్ పవర్ జూలై 7 :** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామములో వేంచేసియున్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయములో నిర్వహించే నిత్యాన్నదాన ట్రస్ట్ నకు హైదరాబాద్ సోమాజిగూడ వాస్తవ్యులు సివి వాసు దేవరాయ్, ఉషరాయ్ దంపతులు 1,01,116 వేల రూ.లు విరాళముగా సమర్పించియున్నారు. వీరికి శ్రీ స్వామివారి ప్రత్యేక దర్శనానంతరము ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకట ప్రసాద్ శ్రీ స్వామి వారి చిత్రపటం, ప్రసాదమును అందజేయుటమైనది. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కిరణ్ పాల్గొన్నారు.

### వజ్రకూటంలో సుపరిపాలనకు తొలి అడుగు

# ఎమ్మెల్యే సత్యప్రభ నేతృత్వంలో ఇంటింటి ప్రచారం





**ప్రత్తిపాడ, పెన్ పవర్, జూలై 07 :** శంఖవరం మండలంలోని వజ్రకూటం గ్రామంలో "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమాన్ని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ స్థాయి నేతలంతా సమాహరమై, ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలకు వివరించారు. ప్రధాన అతిథులుగా నియోజకవర్గ పరిశీలకులు మెట్ల రమణబాబు, రాష్ట్ర టీఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు&క్లస్టర్ ఇంచార్జి వెన్నా శివ, సీనియర్ నేతలు పర్వత సురేష్, మీసాల రాజు, మండల పార్టీ అధ్యక్షుడు బద్ది రామారావు, లీగల్ సెల్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకుడు, ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కీర్తి సుభాష్, గ్రామస్తుల సమక్షంలో కార్యక్రమాన్ని సమన్వయపరిచి, ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో సాధించిన అభివృద్ధి, అమలైన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమం కలిసి ముందుకెళ్తున్నాయని అన్నారు.

మండలాల్లో జరిగే అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయల నిధులు తెచ్చామని, ప్రతి గ్రామానికీ రోడ్లు, నాళాలు, తాగునీటి స్కీములు, విద్యుత్ మరియు పించన్ పంపిణీ లాంటి అంశాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని వివరించారు. టీడీపీ శ్రేణులు మాట్లాడుతూ, ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా మార్చేందుకు వరుపుల సత్యప్రభ కృషి అద్భుతమని పేర్కొన్నారు. ప్రజలతో ప్రతి విషయంలోనూ నేరుగా మమేకమవుతూ, సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తున్న నాయకురాలు అని కొనియాడారు.

# పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలి

### - జగ్గంపేట సి ఐ, వైఆర్ కె శ్రీనివాస్



కిర్లంపూడి,పెన్ పవర్, జూలై 7 : పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వై ఆర్ కె శ్రీనివాస్ అన్నారు. జిల్లా ఎస్పీ,జి బిందు మాధవ్ ఆదేశాల మేరకు సోమవారం కిర్లంపూడి మండలం తామరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిర్లంపూడి ఎస్సై,జి సతీష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిఐ, వై ఆర్ కె శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు శక్తి యాప్ రిజిస్ట్రేషన్, యాంటీ ర్యాగింగ్ యాక్ట్, పోక్సో యాక్ట్, సైబర్ మోసాలు, సైబర్ బెదిరింపులు, డ్రగ్స్ వద్దు బ్రో, లైంగిక వేధింపులు, బాల్యవాహాలు వంటి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పట్ల బాలికలకు అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# టిడిపి మండల నాయకులు సమావేశం



**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై.7 :** మండలంలోని రేఖపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద సోమ వారం తెలుగుదేశం పార్టీ మండల కమిటీ నాయకుల సమావేశం ప్రధాన కార్యదర్శి బురక కన్నా రావు అధ్యక్షతనలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్ మాట్లా డుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి ని చూసి తట్టు కోలేక వైసిపి మాజీ ఎమ్మెల్యే దనలక్ష్మి,రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే జాగ్రత్త అంటూ హెచ్చరించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పెంచిన పెన్షన్ నాలుగు వేలు రూపాయలు పెన్షన్ దారులకు అందజేస్తున్నాము. మీ వైసిపి ప్రభుత్వం వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదు సంవత్సరాలు పట్టిందని గుర్తు చేశారు. మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం సంవత్సరంలో ఒక కుటుంబానికి మూడు గ్యాస్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నాము. చదువుకునే విద్యార్థులకు ఒక కుటుంబంలో ఎంతమంది చదువుకునే విద్యార్థులు ఉంటే అందరికీ తల్లికి వందనం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

మా ఎం.ఎల్.ఏ. మిరియాల శిరీషదేవి తనకున్న సొంత కారును అంబులెన్స్ గా మార్చి ఇప్పటి వరకు 114 మంది మృతి చెందిన మృత దేహాలను కాకినాడ,రాజమండ్రి,నర్సీపట్నం తదితర వైద్య శాల నుండి తమ తమ గ్రామాలకు చేర్చారని,పేద ప్రజలను అనేక విధాలుగా ఆదుకోవడం జరుగు తుందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో రహదారులు వేయలేని పరిస్థితి ఉన్నారంటూ విమర్శించారు. చింతూరు సబ్- డివిజన్ లో సుమారు 1.70 కోట్లు తో గుంతలు పూడ్చడం జరిగిందని వరి కొనుగోలు కేంద్రాలు ద్వారా ఈ సంవత్సరములో కొత్త మార్పు కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వరి కొన్న రోజునే నగదు వారి ఖాతాలో జమ కావడం జరిగిందని,మా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఒక సంవత్సర కాలంలో అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే మీ వైసీపీ నాయకులకు తెలియడం లేదా అంటూ విమర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి,మాజీ జెడ్పీటీసీ ముత్యాల రామరావు,నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక సూర్య ప్రకాష్ రావు,బొర్రా నరసింహారావు,మామిడి రాజు,ముత్యాల రమేష్,ఉప సర్పంచ్ పాయం లక్ష్మణరావు,టిడిపి మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఎం.ఆర్.పి.ఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం

# పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ 60వ పుట్టినరోజు వేడుకలు




**ఆత్రేయపురం, పెన్ పవర్ జూలై 7 :** డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట నియోజకవర్గం, ఆత్రేయపురం మండలంలోని పలు గ్రామాల్లో ఎం.ఆర్.పి.ఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం మరియు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ 60వ జన్మదినోత్సవ వేడుకలు శ్రద్ధా ఘనతలతో నిర్వహించ బడ్డాయి. ఈ వేడుకలను ఎం.ఆర్.పి.ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మర రాఘవ మరియు నూతన కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. గ్రామస్థాయిలో మొదలైన వేడుకలు అనంతరం మండల కేంద్రమైన ఆత్రేయపురంలో బులిపేట వద్ద కేంద్ర సమావేశంగా నిర్వహించబడ్డాయి. వివిధ గ్రామాల నుండి ప్రజలు, నేతలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. మెర్లపాలెం, లొల్ల, వాడపల్లి, పేరవరం, కట్టుంగ, వెలిచేరు, అంకంపాలెం వంటి గ్రామాల్లో స్థానిక నేతల సమన్వయంతో ర్యాలీలు, సమావేశాలు, పూలమాలలు సమర్పించడం, జెండా ఆవిష్కరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. బులిపేట సభకు ఎం.ఎస్పి జిల్లా ప్రధాన కార్యదర్శి గందం యాకోబు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా టీడీపీ మండల నాయకులు ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్) పాల్గొన్నారు. వారు బాబూ జగజ్జీవన్ రాం విగ్రహానికి పూలమాల వేసి, దండోరా జెండా ఎగరవేశారు.

ముఖ్య ప్రసంగాల్లో, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఏర్పడిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పోరాట ప్రాధాన్యతను, 30 సంవత్సరాల నిరంతర ఉద్యమం ద్వారా 2024 ఆగస్టు 1న సుప్రీం కోర్టు నుండి ఎస్సీ ఉపవర్గీకరణపై అను కూలమైన తీర్పు రావడాన్ని ప్రస్తావించారు. మాదిగలతో పాటు ఇతర వెనుకబడిన కులాలకు కూడా ఇది సామాజిక న్యాయం సాధనకు మార్గం అని పేర్కొన్నారు. వేదికపై పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ 60వ



పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముదునూరి వెంకటరాజు , సన్మానం చేయగా, ఆయన చేతుల మీదుగా ఎం.ఆర్.పి.ఎస్ సీనియర్ నాయకులు కొమ్మర రాఘవ, గందం యాకోబు, ముప్పిడి రాజు, రాచర్ల అరుణ్ లకు కూడా ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి పండు, కాకిలేటి శ్రీను, యార్లగడ్డ ప్రవీణ్, సిరిపెళ్ల బాబీ, సిర్రా సురేష్, ఉందుర్తి శంకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో జమాల్ ఖాన్ సేవలు వెలకట్టలేనివి

### మెమెంటోతో సత్కారం



**ఎటపాక ,పెన్ పవర్, జులై 07 :** ఏజెన్సీలో టిడిపి సీనియర్ నాయకులు ఆయుర్వేద వైద్యులు డా జమాల్ ఖాన్ విలువ కట్టలేనివని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషా దేవి కొనియాడారు. తోటపల్లి గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే శిరీషా దేవి ఆవిష్క రించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎంతోమంది నిరుపేద కుటుంబాల్లో డా జమాల్ ఖాన్ వెలుగులు నింపారు. ఇల్లు కాలిపోయిన కుటుంబాలకు ఇంటి సామగ్రి తోపాటు ఆర్థిక సహాయం అందజేస్తున్న మంచి మనసున్న వ్యక్తి అన్నారు. విలీన మండలాల్లో ఆయన చేస్తున్న సేవలు విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు, జనసేన,బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహణ



**పెనుమంట్ర, పెన్ పవర్, జూలై 07:** మండలంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 31వ ఆవిర్భావ దినోత్సవం మరియు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుక ను ఆచంట గ్రామంలో నియోజవర్గ ఇంచార్జ్ దిగుమర్తి వెంకటేశ్వర ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా ఉపాధ్యక్షులు తోత్తరమూడి శ్రీనివాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ గత 31 ఏళ్లుగా వర్గీకరణ కోసం నిరంతర పోరాటం చేస్తూనే, సామాజిక న్యాయం సాధన కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిందన్నారు. మాదిగలే కాకుండా, అన్ని సామాజిక వర్గాల సమస్యలను ఎత్తిచూపుతూ, ఆరోగ్యశ్రీ పథకం, వృద్ధులకు మరియు వితంతువులకు నెలకు రూ. 4000 పెన్షన్, వికలాంగులకు రూ. 6000 పెన్షన్ పెంపు వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేయించగలిగిందన్నారు. ఇది మందకృష్ణ మాదిగ మరియు సీనియర్ నాయకుల నిరంతర ఉద్యమ ఫలితమేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు పలివెల పైడియ్య మాదిగ జిల్లా గౌరవ అధ్యక్షులు కనపాల పెద్దిరాజు మాదిగ, నియోజకవర్గ ఎమ్. ఎస్. ఎఫ్ ఇంచార్జి టి. శేఖర్ మాదిగ, పోడూరు మండల ఇంచార్జ్ ఆకుమర్తి పెద్దిరాజు మాదిగ, ఆచంట ఇంచార్జ్ పసల సత్యనారాయణ మాదిగ, చదలవాడ ఆనంద్ మాదిగ, చదలవాడ శ్రీను మాదిగ,లంక రాముడు మాదిగ, కంకిపాటి రవి మాదిగ, కొడమంచిలి ప్రభాకర్ మాదిగ, వేణు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# ఫసల్ బీమా యోజన సద్వినియోగం చేసుకోవాలి

### - కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం పెన్ పవర్ జూలై 7 :** ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన భారత ప్రభుత్వం ప్రారంభించిన ఒక ముఖ్య మైన పంట బీమా పథక మని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సోమ వారం స్థానిక కలెక్టరేట్ నందు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ప్రచార పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊహించని వాతావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల లేదా వ్యాధుల కారణంగా పంట నష్ట పోయిన రైతులకు ఆర్థిక సహాయాన్ని అందించడానికి ఈ పథకం దోహదపడుతుందన్నారు. రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకుని పంటలకు నష్టం వాటిల్లిన సందర్భంలో బీమా పరిహారా లను వివిధ దశలలో పొంద వచ్చునన్నారు రైతులు అతి తక్కువ ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఖరీఫ్ పంటలకు బీమా మొత్తంలో గరిష్టంగా 2 శాతం రబీ పంటలకు 1.5 శాతం చెల్లిస్తారన్నారు. వార్షిక వాణిజ్య మరియు ఉద్యాన పంటలకు 5% వరకు ప్రీమియం ఉంటుందని. మిగిలిన ప్రీమియం మొత్తాన్ని కేంద్రంరాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరిస్తాయన్నారు. లోటు వర్షపాతం లేదా ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల విత్తడం నాటడం కుదరకపోతే బీమా కవరేజ్ ఉంటుం దన్నారు. ప్రకృతి వైప రీత్యాలైన వరదలు, కరువు, వడగళ్ల వాన, తుఫాను, అకాల వర్షాలు, తెగుళ్ల మరియు వ్యాధుల వల్ల పంట నష్టం జరిగితే కవరేజ్ లభిస్తుందన్నారు. పంట కోసిన తర్వాత పొలంలోఆరబెట్టడానికి ఉంచిన పంటలకు తుఫానులు, అకాల వర్షాల వల్ల నష్టం జరిగితే బీమా వర్తిస్తుందను,వడగళ్ల వాన, జలమయం కావడం ప్రమాదాల వల్ల కలిగే నష్టాలకు కూడా బీమా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, ఎల్ డి ఎం కేశవ వర్మ, ఉద్యాన అధికారి బి.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

# రూ.23 లక్షలకే దుబాయ్ గోల్డెన్ వీసా.. షరతులు వర్తిస్తాయి




**హైదరాబాద్ పెన్ పవర్:** యూఎఈ జారీ చేసే గోల్డెన్ వీసాలకు ఉన్న ఆదరణ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అంతర్జాతీయ వ్యాపారానికి ముఖద్వారంగా ఉంటున్న దుబాయ్ వైపు చూస్తున్న వారి సంఖ్య అంతకంతకూ ఎక్కువ అవుతున్న సంగతి తెలిసిందే. గోల్డెన్ వీసా జారీ చేసేందుకు ఇప్పటి వరకు అనుసరించిన విధానానికి భిన్నంగా కొత్త తరహా గోల్డెన్ వీసా కార్యక్రమానికి తెర తీసింది దుబాయ్ ప్రభుత్వం.ఇప్పటివరకు ఉన్న నిబంధనల ప్రకారం స్థిరాస్తిలో కనీసం రూ.4.66 కోట్లు లేదంటే వ్యాపారంలో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టే వారికి గోల్డెన్ వీసాను జారీ చేయటం తెలిసిందే. అందుకు భిన్నంగా కేవలం రూ.23.3 లక్షల ఫీజును చెల్లించటం ద్వారా జీవితకాలం చెల్లుబాటు అయ్యే గోల్డెన్ వీసాను పొందేందుకు వీలుగా కొత్త కార్యక్రమానికి తెర తీశారు. దీన్ని తొలుత భారత్.. బంగ్లాదేశీయులకు మాత్రమే జారీ చేస్తారు. తర్వాతి కాలంలో మిగిలిన దేశాలకు విస్తరించే వీలుందని చెబుతున్నారు.ఈ కొత్త వీసా కోసం రానున్న మూడు నెలల వ్యవధిలో ఐదు వేలకు పైనే భారతీయులు అప్లై చేసుకుంటారని చెబుతున్నారు. భారతీయులకు యూఎఈ గోల్డెన్ వీసా పొందేందుకు ఇదే సరైన సమయమని చెబుతున్నారు. దీని కోసం భారత్ లో రయాద్ గ్రూప్ అనే కన్సెల్టెన్సీని ఎంపిక చేసినట్లు చెబుతున్నారు. ఈ వీసా కోసం అప్లై చేసుకున్న వారి నేపథ్యాన్ని తొలుత తనిఖీ చేస్తారు.క్రిమినల్ రికార్డులు.. యాంటీ మనీలాండరింగ్ నేపథ్యంతో పాటు సోషల్ మీడియా ఖాతాల్ని సైతం తనిఖీ చేస్తారు. ఆర్థికం.. వాణిజ్యం.. సైన్స్.. స్టార్టప్.. ఉద్యోగ సేవల లాంటి మార్గాల్లో యూఏఈ మార్కెట్ కు వారు ఎలా ప్రయోజనం చేకూరుస్తారన్న అంశాన్ని పరిశీలిస్తారు. అనంతరం తుది నిర్ణయం కోసం ప్రభుత్వానికి అప్లికేషన్ ను పంపుతారు. గోల్డెన్ వీసా కోసం అప్లై చేసే వారు దుబాయ్ ను సందర్శించాల్సిన అవసరం ఉండదు. వారు తమ స్వదేశంలో ఉంటూనే అనుమతి తీసుకోవచ్చు.ఈ వీసా పొందిన వారు తమ కుటుంబ సభ్యులను దుబాయ్ తీసుకెళ్లొచ్చు. అసిస్టెంట్లు.. డ్రైవర్లను నియమించుకునే వీలు ఉంటుంది. స్థానికంగా ఏదైనా వ్యాపారం.. ఉద్యోగం చేసుకునే వీలు ఉంటుంది. నామినేషన్ ఆధారిత వీసా జీవితకాలం చెల్లుబాటు అయ్యే వీలుంది. ఈ పైల్ ప్రాజెక్టును తొలుత భారత్.. బంగ్లాదేశ్ లో అమలు చేసి.. తర్వాతి కాలంలో చైనాతో పాటు ఇతర దేశాలకు విస్తరిస్తారని చెబుతున్నారు.

# ప్రాజెక్ట్ విష్ణు: భారత్ రక్షణ రంగంలో సరికొత్త శకం!




**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశం రక్షణ రంగంలో సరికొత్త చరిత్రను లిఖిస్తోంది. అత్యాధునిక హైపర్‌సోనిక్ ఆయుధాల అభివృద్ధిలో కీలకమైన "ప్రాజెక్ట్ విష్ణు"తో దేశం తన సైనిక శక్తిని గణనీయంగా పెంచుకుంటోంది. ఈ ప్రాజెక్ట్ కింద, రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 12 హైపర్‌సోనిక్ క్షిపణులను అభివృద్ధి చేస్తున్నారు. భారత సైనిక బలగాలకు ప్రపంచ స్థాయి, వేగవంతమైన దాడి , రక్షణ సామర్థ్యాలను అందించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం.

**పాకిస్థాన్, చైనాకు దీటైన జవాబు**

ప్రాజెక్ట్ విష్ణు భారతదేశం చుట్టూ పెరిగిన భద్రతా సవాళ్లకు శక్తివంతమైన సమాధానంగా నిలుస్తోంది. పాకిస్థాన్, చైనా వంటి దేశాల నుంచి మాత్రమే కాకుండా బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి ఎదురయ్యే పరోక్ష సవాళ్లకు ప్రతిఘటనగా ఈ హైపర్‌సోనిక్ ఆయుధ శ్రేణులు రూపొందుతున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇది భారతదేశ రక్షణ వ్యూహంలో కీలకమైన ముందడుగు.

**హైపర్‌సోనిక్ టెక్నాలజీ అంటే ఏమిటి?**

హైపర్‌సోనిక్ ఆయుధాలు అంటే ధ్వని వేగం కంటే ఐదు రెట్లు అధిక వేగంతో ప్రయాణించగల ఆయుధాలు. అంటే ఇవి మాక్ 5 (సుమారు గంటకు 6,000 కి.మీ.) కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించగలవు. ప్రస్తుతం ప్రపంచంలో అమెరికా, రష్యా, చైనా మాత్రమే ఈ సాంకేతికతను అభివృద్ధి చేశాయి. ఇప్పుడు భారత్ కూడా ఈ సాంకేతికతను సొంతం చేసుకొని నాలుగో దేశంగా నిలవనుంది, ఇది దేశానికి గర్వకారణం.

**ప్రాజెక్ట్ విష్ణులో భాగంగా అభివృద్ధి అవుతున్న ఆయుధాలు:**

**ET-LDHCM మిసైల్ :** ఇది మాక్ 8 వేగంతో ప్రయాణించే సామర్థ్యం కలిగి, 2,500 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలదు.

హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్ : ఇది సముద్ర యుద్ధనౌకలపై దాడి చేయగలదు. దీని పరిధి సుమారు 1,500 కిలోమీటర్లు.

హైపర్‌సోనిక్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్స్: శత్రు దేశాల హైస్పీడ్ క్షిపణులను అడ్డుకునే ప్రత్యేక రక్షణ వ్యవస్థలు.

స్క్రామ్‌జెట్ ఇంజిన్లు: హైపర్‌సోనిక్ వేగాన్ని సాధించేందుకు ఉపయోగించే అత్యాధునిక ఇంజిన్ టెక్నాలజీ.

హైపర్‌సోనిక్ డ్రోన్లు, డికాయ్‌లు: శత్రు రాడార్‌లను తప్పించే క్లోక్ టెక్నాలజీతో రూపొందుతున్నాయి.

సముద్రం నుంచి, ఆకాశం నుంచి దాడికి సిద్ధం

ఈ ఆయుధాలు కేవలం భూమి ఆధారిత క్షిపణులకే పరిమితం కావు. %ణ=ణూ% నౌకల నుంచి, యుద్ధ విమానాల నుంచి ప్రయోగించగల హైపర్‌సోనిక్ వెర్షన్‌లను కూడా అభివృద్ధి చేస్తోంది. అంతేకాకుండా జలాంతర్గాముల నుంచి ప్రయోగించే వెర్షన్ల పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఇది భారత సైనిక దళాల బహుముఖ సామర్థ్యాన్ని పెంచుతుంది.

**స్వదేశీ పరిజ్ఞానం.. భారత్ విజయ రహస్యం**

ఈ ఆయుధాలన్నీ 100% స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయన్నది ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత. ఎలాంటి విదేశీ ఆధారత లేకుండానే అభివృద్ధి చెందుతున్న ప్రాజెక్ట్ విష్ణు, భారత రక్షణ స్వావలంబనకు అసలైన ఉదాహరణగా నిలుస్తోంది. ఇది "ఆత్మనిర్భర్ భారత్" లక్ష్యానికి అనుగుణంగా ఉంది.

**ఆసియాలో పవర్ బ్యాలెన్స్ మారనుంది!**

ప్రాజెక్ట్ విష్ణుతో భారతదేశం ఆసియాలో శక్తివంతమైన సైనిక శక్తిగా ఎదుగుతోంది. మాక్ 8 వేగంతో ప్రయాణించే ఆయుధాలు, శత్రు దేశాల అణు క్షిపణులను సైతం ముప్పు తిప్పలు పెడతాయి. ప్రస్తుతం ప్రపంచంలో ఇలాంటి ఆయుధాలను అడ్డుకునే రక్షణ వ్యవస్థలు ఏ దేశంలోనూ లేవు, ఇది భారతదేశానికి వ్యూహాత్మక ఆధిక్యాన్ని ఇస్తుంది.భారత ప్రభుత్వం 2030 నాటికి పూర్తి స్థాయి హైపర్‌సోనిక్ క్షిపణి వ్యవస్థను సైన్యంలో ప్రవేశపెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. "ప్రాజెక్ట్ విష్ణు" ద్వారా సైనిక రంగాన్ని మార్చే విధంగా భారత్ ముందుకు సాగుతోంది. ప్రాజెక్ట్ విష్ణు ద్వారా భారత్ హైపర్‌సోనిక్ ఆయుధరంగంలో మైలురాయిని అధిగమిస్తోంది. ఇది కేవలం సాంకేతిక విజయం మాత్రమే కాదు, దేశ భద్రతకు బలమైన పట్టుదల, స్వావలంబనకు సంకేతం. పాకిస్థాన్, చైనా వంటి శత్రు దేశాలపై మరింత ఒత్తిడిని సృష్టించే ఈ ఆయుధ వ్యవస్థలు, రాబోయే భవిష్యత్తులో భారతదేశానికి గ్లోబల్ మిలిటరీ సూపర్ పవర్‌గా ఎదగడానికి బలం చేకూరుస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# బెజవాడ రాజకీయం ఏక ఛత్రాధిపత్యమేనా.. !





**హైదరాబాద్ పెన్ పవర్:** సీనియర్ నాయకులు విజయం సాధించిన నియోజకవర్గాల్లో ఆధిపత్యం, లేదా ఏక ఛత్రాధిపత్యంగా నాయకులు రాజకీయాలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తుంది. సాధారణంగా ఎన్నిసార్లు గెలిచినా.. ఒకప్పుడు నాయకులు ప్రజలను పట్టించుకునేవారు. వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రాధాన్యం వచ్చేవారు. అడపా దడపా మాత్రమే సొంత కార్యక్రమాలు చేసుకునేవారు. కానీ, రాను రాను ఈ పరిస్థితి మారిపోయింది. వరుసగా విజయాలు దక్కించుకున్న నాయకులతోపాటు 10 –15 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్న నేతలు ఏకఛత్రాధిపత్యంగా తమ నియోజకవర్గాల్లో రాజకీయాలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా విజయవాడ వంటి రాజకీయ చైతన్యం ఉన్న నగరాల్లో ఈ తరహా పరిస్థితి ఎక్కువగా కనిపిస్తుండడం విశేషం. విజయవాడ సెంట్రల్, అదేవిధంగా తూర్పు నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో టిడిపి విజయం దక్కించుకుంది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో మాత్రం బిజెపి తరఫున సుజనా చౌదరి గెలిచారు. ఆయన సంగతి ఎట్లా ఉన్న.. విజయవాడ తూర్పు, సెంట్రల్ నియోజకవర్గాల్లో మాత్రం ఒకింత రాజకీయాల వేరేగా నడుస్తున్నాయని టిడిపిలోనే చర్చ జరుగుతోంది. మరీ ముఖ్యంగా సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజకీయాలు వేరేగా ఉన్నాయని టిడిపి నాయకులు చెబుతున్నారు. వాస్తవానికి బొండా ఉమా అంటే మాస్ నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. తొలుత పారిశ్రామికవేత్తగా ఎదిగిన ఆయన 2014లో తొలిసారి విజయం దక్కించుకున్నారు. ఆ క్రమంలోనే వైసీపీ నాయకులపై విరుచుకుపడడం ద్వారా చంద్రబాబు కనుసన్నల్లో పడ్డారు. దీంతో తనకు మంత్రి పదవి వస్తుందని ఆయన ఆశలు పెట్టుకున్నారు. అయితే అది రాలేదు. తర్వాత 2019లో పరాజయం పాలయ్యారు. గత ఎన్నికల్లో మళ్లీ విజయం సాధించారు. అయితే నియోజకవర్గంలో ఆయన ప్రజలకు చేరువ కాకపోవడంతో పాటు కీలక నాయకులకు కూడా ఆయన అందుబాటులో ఉండడం లేదన్నది ప్రస్తుతం చర్చగా మారింది.

అంతేకాదు పార్టీలో కూడా ఆయన సీనియర్లకు దూరంగా ఉండటం తనకు నచ్చింది చేసుకుంటూ వెళ్లడం అదేవిధంగా వ్యాపారాలు వ్యవహారాల్లో ఎక్కువగా కాన్సన్ట్రేట్ చేస్తున్నారని విమర్శలు పెరుగుతున్నాయి. ఇది సరికాదు అన్నది సీనియర్లే చెబుతున్న విషయం. ఇక తూర్పు నియోజకవర్గంలో 2014 నుంచి వరుసగా విజయాలు దక్కించుకుంటున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చాలా సైలెంట్ గా ఉండే నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. అయితే ఇటీవల కాలంలో ఆయన కూడా పార్టీ నాయకులకు దూరంగా ఉంటూ సొంత వ్యవహారాలు చేసుకుంటున్నారని ఎక్కువగా ఆయన అసలు నియోజకవర్గంలోనే ఉండడం లేదని చర్చ నడుస్తుంది. కీలకమైన విజయవాడలో బలమైన సామాజిక వర్గాలకు చెందిన ఇద్దరు ఇలా చేయటం వల్ల పార్టీకి ఇప్పటికిప్పుడు ఇబ్బందులు లేకపోయినా భవిష్యత్తులో మాత్రం ఇబ్బందులు తప్పవని సీనియర్లు అంచనా వేస్తున్నారు. మరి వీరికి వీరు సరి చేసుకుంటారా లేకపోతే అధిష్టానం వీరిని సరిచేయాలా అనేది చూడాలి. ప్రస్తుతం చంద్రబాబు పిలుపు ఇచ్చిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఈ రెండు నియోజకవర్గాలను ఇప్పటివరకు మొదలు కాలేదు. దీనిని బట్టి వారు ఏ మేరకు పార్టీకి అనుకూలంగా ఉన్నారు అనేది అర్థమవుతుంది. అయితే వారు పార్టీకి అనుకూలంగానే ఉన్నా.. సొంత ప్రనుల్లోనే ఎక్కువ సమయం పెట్టుకోవడం వల్ల విమర్శలు ఎదుర్కొంటున్నారు.

# బాబు వద్దన్నా.. అమెరికా వెళ్లిన రఘురామ.. మొత్తం ఐదుగురు ఎమ్మెల్యేలు అక్కడే..



**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి చంద్రబాబు వార్నింగును ఐదుగురు టీడీపీ ఎమ్మెల్యేలు లైట్ తీసుకున్నారా? అనే చర్చ జరుగుతోంది. తానా సభలకు వెళ్లొద్దంటూ సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలిచ్చినప్పటికీ ఐదుగురు ఎమ్మెల్యేలు మాత్రం అమెరికా వెళ్లడంపై కార్యకర్తలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అంతా తప్పనిసరిగా పాల్గొనాలని అధినేత, సీఎం చంద్రబాబు ఆదేశించారు. తానా సభలకు ముందే నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో 'తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేసి ఎవరైనా తానా, ఆటా అంటే తాట తీస్తానని వార్నింగ్ ఇచ్చారు సీఎం. అయితే సీఎం వ్యాఖ్యలతో దాదాపు 15 మంది ఎమ్మెల్యేలు తమ అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నా, ఐదుగురు ఎమ్మెల్యేలు మాత్రం తమ తానా పర్యటనకే మొగ్గు చూపారు. 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జరిగిన తానా సభల్లో ఐదుగురు ఎమ్మెల్యేలు ప్రత్యక్షం కావడం చర్చకు దారితీస్తోంది.ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలను ధిక్కరించి తానా సభకు వెళ్లిన వారిలో ప్రముఖులు డిప్యూటీ స్పీకర్ రఘురామ రాజు ఉన్నారు. ఆయనతోపాటు నరసారావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు, చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ బాబు, నందిగామ, మైలవరం ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, వసంత కృష్ణప్రసాద్ అమెరికా వెళ్లారు. ఈ ఐదుగురిలో రఘురామ, వసంత కృష్ణప్రసాద్ వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చారు. మిగిలిన ముగ్గురు తొలి నుంచి పార్టీలో ఉన్నప్పటికీ పార్టీ క్రమశిక్షణను అతిక్రమించి అమెరికా వెళ్లడమే అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.అమెరికా వెళ్లిన ఐదుగురు ఎమ్మెల్యేలు అధినేత నుంచి అనుమతి తీసుకున్నారా? లేదా? అనే సందేహం వ్యక్తమవుతోంది. ఎమ్మెల్యేల విదేశీ పర్యటనతో ఐదు నియోజకవర్గాల్లో దాదాపు 15 రోజులు పాటు 'తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదంటున్నారు. ఈ కార్యక్రమ నిర్వహణపై తెలుగుదేశం పార్టీ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తోంది. దీంతో ఎమ్మెల్యేల విదేశీ పర్యటనపై పార్టీకి ముందే సమాచారం ఉండి ఉంటుందని అంటున్నారు.అయితే అధినేత ఆదేశాలను విస్మరించి ఎమ్మెల్యేలు విదేశాలకు వెళ్లడంపైనే అంతా చర్చించుకుంటున్నారు. సహజంగా తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యమిస్తారు. ఇక వ్యక్తిగతంగా క్రమశిక్షణకు విలువనిచ్చే డిప్యూటీ స్పీకర్ రఘురామ.. అసెంబ్లీని క్రమశిక్షణతో నడుపుతానని పలుమార్లు చెప్పారు. అలాంటి నాయకుడే అధినేత ఆదేశాలను కాదని అమెరికా వెళ్లడమేంటని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. అయితే రఘురామ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉండి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు ఉండటంతో 'తొలిఅడుగు' కార్యక్రమం కొనసాగుతోందని చెబుతున్నారు. కానీ, మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లోనే కార్యక్రమం కొనసాగడం లేదని అంటున్నారు.

# ఏఐ మేజిక్.. వందేళ్లకు పైనే బతికించేస్తుందట



**హైదరాబాద్ పెన్ పవర్:** పెద్దోళ్లను కలిస్తే.. నిండు నూరేళ్లు బతకాలన్న ఆకాంక్షను వ్యక్తం చేయటమే కాదు.. నూరేళ్లు బతకాలన్న దీవెనలు అందిస్తుంటారు. మనిషికి పూర్ణాయుర్దాయం వందేళ్లుగా చెప్పటం తెలిసిందే. మనకు స్వాతంత్ర్యం వచ్చేనాటికి మన దేశ ప్రజల సగటు జీవితకాలం 32 ఏళ్లు. మన దేశంలోనే కాదు ప్రపంచంలోని చాలా దేశాల్లో మనిషి జీవితకాలం తక్కువగా ఉండేది. వైద్య రంగంలో చేపట్టిన పరిశోధనలు.. మార్పులు మనిషి జీవిత కాలాన్ని పెంచేలా చేశాయి. రకరకాల వ్యాధులకు చెక్ పెట్టే టీకాలు అందుబాటులోకి రావటంతో మనలో ఆరోగ్యం పట్ల స్పృహ పెరిగింది. ప్రస్తుతం భారతీయుల సగటు జీవితకాలం 70 ఏళ్లు కాగా.. హాంకాంగ్.. దక్షిణ కొరియా ప్రజల సగటు జీవితకాలం 85 ఏళ్లుగా తేల్చారు. మరి.. రానున్న రోజుల్లో మనిషి జీవితకాలం ఎంతమేర పెరిగే వీలుంది? అన్నదిప్పుడు చర్చగా మారింది. శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం 'కృత్రిమమేధ' ఎంట్రీతో మనిషి జీవితకాలం మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

ఒక అంచనా ప్రకారం 2030 నాటికి.. అంటే రానున్న ఐదేళ్లలో మనిషి జీవితకాలం మరింత పెరుగుతుందని చెబుతున్నారు. కొందరు మనిషి ఆయుర్దాదం 150ఏళ్లకు పెరుగుతుందని చెప్పినా.. అంత కాకున్నా.. వందేళ్లకు పైనే హాయిగా జీవించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆధునిక వైద్యం అందుబాటులోకి రావటం.. కృత్రిమమేధతో వైద్య రంగం మరింత దూసుకెళ్లే వీలుందని.. ఇవన్నీ మనిషి జీవితకాలాన్ని పెంచేందుకు సాయం చేస్తాయని చెబుతున్నారు.

శరీరంలోని క్రోమోజోముల చివరిభాగంలో ఉండే టెలోమియర్ల పొడుగు మయసు పెరిగే కొద్దీ తగ్గిపోతూ ఉంటుంది.ఈ ప్రక్రియను నిరోధించగలిగితే వృద్ధాప్యాన్ని జయించొచ్చు. సైడ్ ఎఫెక్టులు లేకుండా టెలోమియర్ల పొడుగు తగ్గిపోయే ప్రక్రియను నిరోధించేందుకు శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. ఇవి ఫలిస్తే మనిషి జీవితకాలం మరింత పెరుగుతోంది. ఇందుకు ఏఐ సాయం చేస్తుందని చెబుతున్నారు.

మనిషిలో వయసు పెరిగే ప్రక్రియను 2032 నాటికి ఏఐ నియంత్రిస్తుందన్న అంచనాలు ఉన్నాయి, అప్పటికి కృత్రిమమేధతో పని చేసే మెడికల్ నానోబోట్లు అందుబాటులోకి వస్తాయని.. ఎవరికైనా ఏదైనా రోగం వస్తే ఏఐ సాయంతో సమస్యను గుర్తించి.. మరమ్మత్తు చేస్తాయని చెబుతున్నారు. అంతేకాదు. మనిషి మెదడులోని సమాచారాన్ని కూడా బ్యాకప్ లా తీయటంలో ఏఐ సాయం చేస్తుందని చెబుతున్నారు అదే జరిగితే.. మనిషి భౌతికంగా లేకున్నా మానసికంగా చిరంజీవిగా మిగిలినట్లు చేయొచ్చని చెబుతున్నారు. మొత్తంగా అందుబాటులోకి వస్తున్న ఏఐతో.. మనిషి నూరేళ్ల కంటే ఎక్కువే బతికేసే పరిస్థితి.

# దేశం కోసం ఆడు... నా ఆరోగ్యం గురించి ఆలోచించొద్దు: ఆకాశ్ దీప్ సోదరి

- ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో 10 వికెట్లు పడగొట్టిన పేసర్ ఆకాశ్ దీప్
- ఈ ప్రదర్శనను క్యాన్సర్‌తో పోరాడుతున్న సోదరికి అంకితం
- తమ్ముడి విజయంపై సోదరి జ్యోతి సింగ్ భావోద్వేగ స్పందన
- తాను క్యాన్సర్ మూడో దశలో ఉన్నట్లు ఆమె వెల్లడి
- నా గురించి ఆందోళన పడకుండా దేశం కోసం ఆడమని చెప్పానన్న సోదరి
- తండ్రి, అన్నయ్య లేని లోటు తీరుస్తూ తమ్ముడే కుటుంబాన్ని నడిపిస్తున్నాడని ఉద్వేగం




**హైదరాబాద్ పెన్ పవర్:** ఒకవైపు క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న సోదరి.. మరోవైపు దేశం కోసం ఆడుతూ అద్భుత ప్రదర్శన చేసిన తమ్ముడు! ఇంగ్లాండ్‌తో జరిగిన ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో భారత పేసర్ ఆకాశ్ దీప్ సాధించిన ఘనత, దాని వెనుక ఉన్న భావోద్వేగభరిత కథ ఇది. ఈ టెస్టులో 10 వికెట్లు పడగొట్టి సత్తా చాటిన ఆకాశ్ దీప్, తన ప్రదర్శనను క్యాన్సర్‌తో పోరాడుతున్న తన సోదరి జ్యోతి సింగ్‌కు అంకితమిచ్చాడు. ఈ విషయంపై జ్యోతి సింగ్ స్పందిస్తూ ఉద్వేగానికి లోనయ్యారు.

"ఆకాశ్ ప్రదర్శన దేశం గర్వపడేలా చేసింది. పది వికెట్లు తీయడం చూసి చాలా సంతోషపడ్డాను. ఈ కష్ట సమయంలో మా కుటుంబంలో ఆనందాన్ని నింపాడు" అని జ్యోతి సింగ్ తెలిపారు. తాను క్యాన్సర్ మూడో దశలో ఉన్నానని, కనీసం ఆరు నెలల చికిత్స అవసరమని వైద్యులు చెప్పినట్లు ఆమె వెల్లడించారు. ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లే ముందు ఎయిర్‌పోర్ట్‌లో కలిసినప్పుడు, "నా గురించి ఆందోళన పడొద్దు, దేశం కోసం బాగా ఆడు" అని మాత్రమే చెప్పానని ఆమె గుర్తుచేసుకున్నారు. మ్యాచ్ ముగిశాక ఆకాశ్ వీడియో కాల్‌లో మాట్లాడాడని, "కంగారు పడొద్దు, దేశం మొత్తం మనకు అండగా ఉంది" అని ధైర్యం చెప్పాడని జ్యోతి సింగ్ కన్నీటి పర్యంతమయ్యారు. "మా నాన్న, అన్నయ్య మరణించినప్పటి నుంచి తమ్ముడే కుటుంబాన్ని నడిపిస్తున్నాడు. ఇలాంటి సోదరుడు ఉండటం చాలా అరుదు. అతను వికెట్ తీసినప్పుడల్లా మా వీధిలోని వారంతా చప్పట్లతో సంబరాలు చేసుకున్నారు" అని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. మొదట తన అనారోగ్యం గురించి మీడియాలో మాట్లాడటం ఇష్టం లేకపోయినా, తనపై ప్రేమతో ఆకాశ్ భావోద్వేగానికి గురై ఈ అంకితం ఇచ్చాడని ఆమె వివరించారు.

# మాటతో కాదు ఆటతోనే సమాధానమిచ్చాడు.. గిల్ దెబ్బకు ఇంగ్లాండ్ జర్నలిస్ట్ మాయం






**హైదరాబాద్ పెన్ పవర్:** ఎడ్జ్ బాస్టన్ విజయం టీమిండియాలో జోష్ నింపింది. తొలి టెస్టులో ఓడిపోయి తీవ్ర ఒత్తిడిలో బరిలోకి దిగిన గిల్ సేన విజయంపై మ్యాచ్ కు ముందు వరకు ఎవరికీ పెద్దగా అంచనాలు లేవు. అందులో కూడా ఎడ్జ్ బాస్టన్ లో రికార్డ్స్ టీమిండియాకు ఘోరంగా ఉన్నాయి. 8 మ్యాచ్ ల్లో 7 మ్యాచ్ ల్లో ఓడిపోయి.. ఒక మ్యాచ్ డ్రా తో సరిపెట్టుకుంది. దీంతో మ్యాచ్ కు ముందు ఇంగ్లాండ్ జట్టు క్లియర్ ఫేవరేట్ గా బరిలోకి దిగింది. అయితే అందరి అంచనాలను తలక్రిందులు చేస్తూ టీమిండియా ఏకంగా 336 పరుగుల తేడాతో భారీ విజయాన్ని సాధించి ఇంగ్లాండ్ కు దిమ్మ తిరిగే షాక్ ఇచ్చింది.

రెండో టెస్టుకు ముందు గిల్ ను ఇంగ్లాండ్ జర్నలిస్ట్ తన ప్రశ్నతో ఓవరాక్షన్ చేశాడు. "ఇప్పటివరకు ఇండియా ఎడ్జ్ బాస్టన్ లో గెలవలేదు. మీ జట్టు గెలవగలదని మీరు అనుకుంటున్నారా.." అని అడిగాడు. విజయం తర్వాత గిల్ తన చమత్కారంతో జర్నలిస్ట్ పై సెటైర్ వేశాడు. గిల్ మాట్లాడుతూ.. " నా అభిమాన జర్నలిస్ట్ నాకు కనిపించడం లేదు. అతడిని నేను చూడాలేమో.." అని అన్నాడు. గిల్ మ్యాచ్ కు ముందు ఎలాంటి అసహనానికి గురవ్వలేదు. గెలిచిన తర్వాతే తనదైన శైలిలో సమాధానమిచ్చాడు.

"నేను గణాంకాలను లేదా చరిత్రను నమ్మను అని చెప్పాను. 50-60 సంవత్సరాల చరిత్రలో మేము 7 మ్యాచ్ లను (ఎడ్జ్ బాస్టన్ లో) వేర్వేరు కోర్సుల్లో ఆడాము. వేర్వేరు జట్లు ఇక్కడకు వచ్చాయి. ఇంగ్లాండ్ కు ఇక్కడికి వచ్చిన అత్యుత్తమ భారత జట్టు ఇదేనని నేను నమ్ముతున్నాను. వారిని ఓడించి ఇక్కడి నుండి సిరీస్ గెలవగల సామర్థ్యం మాకు ఉంది. మనం సరైన నిర్ణయాలు తీసుకుంటూ, పోరాడుతూ ఉంటే, ఈ సిరీస్ గుర్తుంచుకోవలసిన సిరీస్ లలో ఒకటి అవుతుందని నేను భావిస్తున్నాను". అని గిల్ మ్యాచ్ తర్వాత జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్ లో అన్నాడు.

ఈ మ్యాచ్ విషయానికి వస్తే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అత్యద్భుత బ్యాటింగ్‌కు తోడు ఆకాశ్ దీప్ (10/187) రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి పది వికెట్లతో కెరీర్ బెస్ట్ బౌలింగ్‌తో విజృంభించడంతో ఐదో రోజు, ఆదివారం ముగిసిన రెండో టెస్టులో 336 రన్స్ తేడాతో ఇంగ్లండ్‌పై అఖండ విజయం అందుకుంది. ఇండియా ఇచ్చిన 608 రన్స్ టార్గెట్ ఛేజింగ్‌లో ఓవర్‌నైట్ స్కోరు 72/3తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లిష్ టీమ్ 68.1 ఓవర్లలో 271 కే కుప్పకూలి చిత్తుగా ఓడింది. దాంతో ఇండియా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 1%-%1తో సమం చేసింది.

తొలి ఇన్నింగ్స్ లో ఇండియా 587 పరుగులు చేస్తే.. బదులుగా ఇంగ్లాండ్ 407 పరుగులకు ఆలౌట్ అయింది. రెండో ఇన్నింగ్స్ లో 6 వికెట్ల నష్టానికి టీమిండియా 427 వద్ద డిక్లేర్ చేసింది. 608 పరుగుల లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ 271 పరుగులకు ఆలౌట్ అయింది. రెండు ఇన్నింగ్స్ ల్లో కలిపి 430 పరుగులు చేసిన గిల్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

# బ్రాడ్‌మాన్ అసాధ్యమైన రికార్డ్ గిల్ బ్రేక్ చేస్తే చూడాలని ఉంది: సునీల్ గవాస్కర్






**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా కొత్త టెస్ట్ కెప్టెన్ శుభమాన్ గిల్ తన తొలి సిరీస్ లోనే అత్యుత్తమ ఫామ్ తో చెలరేగుతున్నాడు. తన బ్యాటింగ్ తో గిల్ ప్రపంచ క్రికెట్ లో తన ఉనికిని చాటుతున్నాడు. కెప్టెన్ గా బాధ్యతలు స్వీకరించిన తొలి సిరీస్ లోనే వరుస సెంచరీలతో హోరెత్తించాడు. లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో 147 పరుగులు చేసిన గిల్.. ఆదివారం (జూలై 6) ఇంగ్లాండ్ తో ఎడ్జ్ బాస్టన్ లో జరుగుతున్న రెండో టెస్టులో 30 ఫోర్లు, 3 సిక్సర్లతో 269 పరుగుల మారథాన్ ఇన్నింగ్స్ ఆడాడు. ఇక రెండో ఇన్నింగ్స్ లో 161 పరుగులు చేసి ఔరా అనిపించాడు. ఓవరాల్ గా తొలి రెండు టెస్టుల్లో గిల్ 585 పరుగులు చేయడం విశేషం. సిరీస్ లో మరో మూడో టెస్టులు మిగిలి ఉన్నాయి. మొత్తం 6 ఇన్నింగ్స్ ల్లో గిల్ మరో 390 పరుగులు చేయగలిగితే ఒక అసాధ్యమైన రికార్డ్ తన ఖాతాలో వేసుకోనున్నాడు. ఒక టెస్ట్ సిరీస్ లో అత్యధిక పరుగులు చేసిన రికార్డ్ ఆస్ట్రేలియా దిగ్గజ ఆటగాడు డాన్ బ్రాడ్ మాన్ పేరిట ఉంది. 1930 యాషెస్ సిరీస్ లో ఇంగ్లాండ్ పై బ్రాడ్ మాన్ 974 పరుగులు చేసి ఒకే సిరీస్ లో అత్యధిక పరుగులు చేసిన రికార్డ్ ను తన పేరిట లిఖించుకున్నాడు. 95 సంవత్సరాలైనా ఈ రికార్డ్ ఇప్పటివరకు పదిలంగా ఉంది. బ్రాడ్ మాన్ రికార్డ్ గిల్ బ్రేక్ చేతే చూడాలని టీమిండియా దిగ్గజ బ్యాటర్ సునీల్ గవాస్కర్ కోరుకుంటున్నాడు. గవాస్కర్ మాట్లాడుతూ.. "బ్రాడ్ మాన్ 974 పరుగుల రికార్డ్ గిల్ బ్రేక్ చేసి ఒకే సిరీస్ లో 1000 చేస్తే అంతకంటే ఆనందం మరొకటి ఉండదు. ప్రతి ఒక్కరూ ఈ రికార్డ్ బ్రేక్ చేయడం అసాధ్యమని భావిస్తున్నారు. కానీ గిల్ ఈ రికార్డ్ బ్రేక్ చేయగలిగితే చూడాలని ఉంది. లార్డ్స్ లో జరగబోయే మూడో టెస్టుల్లో గిల్ నా 774 పరుగుల రికార్డ్ బ్రేక్ చేయడం ఖాయం. రికార్డ్స్ బద్దలు కొట్టడానికే ఉన్నాయి". అని గవాస్కర్ అన్నాడు.



సాంప్రదాయ చీరలో మాళవిక చూడముచ్చటగా ఉంది



# చీరలో సంయుక్తా.... ట్రెడిషనల్ టచ్‌తో గ్లామర్ ట్రీట్

టాలీవుడ్‌లో తనదైన నటనతో గుర్తింపు పొందిన సంయుక్తా, ఇప్పుడు తన గ్లామర్ ఫోటోషూట్లతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ చీర లుక్ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. బ్లష్ పింక్ కలర్ ఎంబ్రాయిడరీ చీరలో మెరిసిపోతూ, ట్రెడిషనల్ జ్వెలరీ, గజ్రాతో ఆమె లుక్‌కు ఫ్యాషన్ ప్రపంచం పాజిటివ్ గా రెస్పాండ్ అవుతోంది. ఈ ఫోటోషూట్‌లో ఆమె ధరించిన చీర, బ్లౌజ్ డిజైన్, మేకప్ నుంచి హెయిర్ స్టైలింగ్ వరకు ప్రతీదీ మినిమలిస్టిక్‌గా ఉండేలా స్టైలింగ్ టీమ్ ప్లాన్ చేసింది. నాజూకు హావభావాలతో రిఫైన్‌డ్ మేకప్, మాయ చూపే చూపులతో సంయుక్తా ఎక్స్‌ప్రెషన్స్ మనసుల్లో చెరగని ముద్ర వేసింది. సాధారణ చీరను కూడా ఓ కళాఖండంగా మార్చగలిగే టాలెంట్ ఆమె సొంతమని ఈ ఫోటోలు మరోసారి నిరూపించాయి.

అంతేకాదు, సంయుక్తా కెరీర్ పరంగా కూడా ఇప్పుడు సూపర్ పేస్‌లో ఉంది. నిఖిల్ హీరోగా తెరకెక్కుతున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ స్వయంభులో ఆమె హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రం భారీ అంచనాలతో తెరకెక్కుతోంది. ఇందులో ఆమె పాత్రలో గ్లామర్‌తో పాటు బలమైన ఎమోషన్ కూడా ఉంటుందని టాక్. ఈ సినిమాతో పాటు మలయాళ స్టార్ మోహన్ లాల్, హీరో రామ్‌తో కూడా ఓ భారీ సినిమాలో నటిస్తోంది. పలు భాషల్లో తన క్రేజ్ పెంచుకుంటున్న సంయుక్తా, ఒకవైపు కమర్షియల్ సినిమాలు చేస్తూ.. మరోవైపు నటనకు అవకాశమిచ్చే కంటెంట్ డ్రివన్ పాత్రలను కూడా ఎంచుకుంటోంది. ఇటీవలి కాలంలో శర్వానంద్, బెల్లంకొండ శ్రీనివాస్ సినిమాలకు కూడా ఆమె పేరు తెరపై వినిపిస్తోంది. ఇక సోషల్ మీడియాలో ఆమె యాక్టివిటీ చూస్తే, ప్రతి లుక్‌తో ఫ్యాషన్ లవర్స్‌కి ప్రేరణనిచ్చేలా ఉంటోంది. ఈ ఫోటోషూట్‌తో మరోసారి ఆమె అందం, అభిరుచి, ఆత్మవిశ్వాసం సోషల్ మీడియాలో అందరినీ ఆకట్టుకుంది.



నేహా మాలిక్: ఆమె ఆకర్షణతో హృదయాలను మండించడం

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com